# ది క్రైమ్ న్యూస్

Crime News

తెలుగు దినపత్రిక

మంగళవారం, ఏప్రిల్ 07, 2026 | సంపుటి - 20 | సంచిక 204 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## యుద్ధం ముగించే దిశగా చర్యలు

### 45రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదన

### అంతర్జాతీయ మీడియాలో కథనాలు

న్యూఢిల్లీ : పశ్చిమాసియాలో ఉద్రిక్తతలకు తెరదించే కాల్పుల విరమణ ప్రతిపాదనలను యూఎస్, ఇరాన్ పరిశీలిస్తున్నట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. ఇరు వర్గాలు 45 రోజుల పాటు కాల్పుల విరమణ పాటించేలా ముసాయిదా ప్లాన్‌ను మధ్యవర్తులు సిద్ధం చేసినట్టు మీడియా సంస్థ యాక్సియోస్ తెలిపింది.

తరువాయి 2లో




## తుమ్మిడిహట్టి నిర్మించి జిల్లాను

# సస్యశ్యామలం చేస్తాం

### ఆదిగాబాద్‌కు గోదావరి నీరు పారిస్తాం

### బాసర నుంచి భద్రాచలం వరకు ఆలయాల అభివృద్ధి

- ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన
- త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు
- పర్యాటకంగా, పారిశ్రామికంగా జిల్లా అభివృద్ధి
- జిల్లా అభివృద్ధిని విస్మరించిన గత పాలకులు
- ఏప్రిల్‌లో రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ
- ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెల్లడి



**గత ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును పక్కనపెట్టి ఆదిలాబాద్ జిల్లాకు అన్యాయం చేసిందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తుమ్మిడిహట్టి ప్రాజెక్టును నిర్మించి ఆదిలాబాద్ జిల్లాలో గోదావరి నీళ్లు పారిస్తుందని చెప్పారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి త్వరలోనే శంకుస్థాపన చేస్తామని, ఈ జిల్లాను పర్యాటకంగా, పారిశ్రామికంగా అభివృద్ధి చేస్తామని చెప్పారు. త్వరలోనే జిల్లాకు యూనివర్సిటీ మంజూరు చేసి శంకుస్థాపన చేస్తామన్నారు. బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి తీరంలో ఉన్న ఆలయాలన్నింటినీ అభివృద్ధి చేస్తామన్నారు. ఆదిలాబాద్ జిల్లాపై కాంగ్రెస్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందని రేవంత్ రెడ్డి అన్నారు. అసెంబ్లీ ఎన్నికల ముందు ఏప్రిల్ నుంచే డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క పీపుల్స్ మార్చ్ చేపట్టి ప్రజా సమస్యలు తెలుసుకున్నారని ఆయన చెప్పారు.**

ఆదిలాబాద్ :

ఆదిలాబాద్ ప్రజలు అమాయకులే కాదు.. నిరంకుశత్వంపై పోరాడిన వీరులంటూ జిల్లా వాసులపై ప్రశంసల వర్షం కురిపించారు. ఆదిలాబాద్ జిల్లా ఏప్రిల్‌లో ముఖ్యమంత్రి, పలువురు మంత్రులు పర్యటించారు. ఈ సందర్భంగా రూ.695 కోట్ల అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన ప్రగతి పాలన బహిరంగ సభకు హాజరై ప్రసంగించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి మాట్లాడుతూ..2029 వరకు జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు, మండలాల హద్దులు మార్చవద్దని కేంద్రం చెప్పింది. కేంద్రం ఆంక్షలు ఎత్తివేయగానే హద్దులు మారుస్తాం. కాళేశర్వం కూలేశ్వరం అయ్యింది. గత పాలకులు తుమ్మిడిహట్టిని పక్కనపెట్టి ఆదిలాబాద్‌కు అన్యాయం చేశారు. తుమ్మిడిహట్టి ప్రాజెక్ట్‌ను నిర్మించి ఆదిలాబాద్‌కు నీళ్లిస్తాం' అని తెలిపారు.గత పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి ఆదిలాబాద్ దూరంగా ఉంది. కేసులు, అక్రమ నిర్బంధాలకు వ్యతిరేకంగా

తరువాయి 2లో



## బాసర జ్ఞానసరస్వతి

# ఆలయ విస్తరణ

225 కోట్లతో అధునాతనంగా పునర్నిర్మాణం

ఆధునీకరణ పనులకు సిఎం రేవంత్ శంకుస్థాపన

ఆలయంలో ప్రత్యేక పూజల నిర్వహణ

మనవడికి అక్షరాభ్యాసం చేయించిన సిఎం

2

## హామీలను అమలు చేసిన

# ఘనత మాది

### పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీలకు కార్యరూపం

### మాకు వ్యక్తిగత ఎజెండా లేదన్న భట్టి విక్రమార్క

ఆదిలాబాద్ : అధికారంలోకి వచ్చేందుకు నేతలు ఎన్నో హామీలు ఇస్తుంటారని, కొందరు అధికారంలోకి రాగానే వాటిని మర్చిపోతారని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క అన్నారు. తాము అలాంటివాళ్లం కాదన్నారు. తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్‌కు మూడేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదిలాబాద్ జిల్లా

2లో

## హార్ముజ్ జలసంధిని

# వెంటనే తెరవండి

### ఇరాన్‌పై తీవ్రపదజాలంతో విమర్శలు

### లేదంటే సర్వనాశనం చేస్తాని ట్రంప్ వార్నింగ్

### లెక్కచేయకుండా ప్రతిదాడులకు దిగుతోన్న ఇరాన్

వాషింగ్టన్ : అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇరాన్‌పై బూతులతో రెచ్చిపోయారు. తాను ఎంతగా హెచ్చరించినా హార్ముజ్ జలసంధిని ఇరాన్ తెరవకపోవడంతో ట్రంప్ తీవ్ర ఆవేశానికి లోనయ్యారు. ఈ సందర్భంగా తన సోషల్ మీడియా అకౌంట్ ట్రూత్ వేదికగా ఇరాన్‌కు గట్టి వార్నింగ్ ఇచ్చారు. హార్ముజ్ జలసంధిని తెరవకుంటే ఇరాన్‌పై భీకర దాడులు తప్పవని హెచ్చరించారు.

తరువాయి 2లో

# ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు

### అమలు దిశగా కీలక అడుగులు వేస్తున్నాం

### పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేళ ప్రధాని మోడీ

న్యూఢిల్లీ : భారతీయ జనతా పార్టీ కీలక ఎజెండాలైన ఉమ్మడి పౌర స్మృతి, ఒకే దేశం, ఒకే ఎన్నికలను అమలు చేసే దిశగా వేగంగా అడుగులు పడుతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. దీనిపై చర్చోపచర్చలు జరుగుతున్నాయని, సానుకూల పురోగతి కూడా కనిపిస్తోందని పేర్కొన్నారు. భాజపా 47 వార్షికోత్సవం సందర్భంగా నిర్వహించిన సభలో ఆయన వర్చువల్‌గా పాల్గొని మాట్లాడారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్ల అంశాన్ని 1994లోనే భారతీయ జనతా పార్టీ లేవనెత్తిందని ప్రధాని మోదీ గుర్తు చేశారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పించడానికి కట్టుబడి ఉందని తెలిపారు.

తరువాయి 2లో

## చంద్రబాబు చేతిలో

# ఐదూళ్ల భవిష్యత్

### భద్రాచలం అభివృద్ధికి ఐదూళ్లే ముఖ్యం

### మౌనంగా ఐదు మండలాలను కలుపుకున్న బాబు

### మంత్రి తుమ్మల లేఖతో మరోమారు తెరపైకి సమస్య



భద్రాచలం : భద్రాచలం అభివృద్ధికి, నీటి మునక గండం నుంచి బయట పడడానికి ఇప్పుడు ఐదూళ్లు అవసరం గతంలో విభజన తరవాత ఏకపక్ష నిర్ణయంతో ఐదు మండలాలను ఎపిలో కలిపారు. భద్రాచలానికి ఆనుకొని ఉన్న 5 గ్రామాలను ఏపీ నుంచి వేరుచేసి తెలంగాణలో కలపాలని కేంద్రాన్ని రాష్ట్రం కోరుతోంది. గత కొన్నేళ్లుగా ఈ విషయంలో కేంద్రం నాన్చివేత ధోరణి అవలంబిస్తోంది. ఎపి ప్రభుత్వం కూడా అదే వైఖరితో ఉంది. ఐదు మండలాలను కలపడం వల్లనే

2లో

## బీజేపీ 47వ ఆవిర్భావ

# దినోత్సవ వేడుకలు

ఊరూవాడా జెండా ఎగరేసిన పార్టీ శ్రేణులు

రాష్ట్ర కార్యాలయ వేడుకల్లో పాల్గొన్న అధ్యక్షుడు పివిఎస్ మాధవ్

పార్టీ ఆవిర్భావ శుభాకాంక్షలు తెలిపిన సిఎం చంద్రబాబు

2






2

## ఆనాటి నేతలు... నేటి మోడీతో మరింత బలోపేతం

### 47వ వార్షికోత్సవ శుభాకాంక్షలు తెలిపిన పవన్

అమరావతి : బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ సోషల్ మీడియా ఎక్స్‌లో శుభాకాంక్షలు తెలియజేశారు. భారతీయ జనతా పార్టీ 47వ వసంతంలో అడుగిడుతున్న శుభ తరుణాన ఆ పార్టీ పార్లమెంటరీ పక్ష నేత, ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, ఆ పార్టీ జాతీయ అధ్యక్షులు



## నీటిని దాచుకోవడం

# నేర్చుకోవాలి

### భూమిలో నీరు ఇంకితేనే సేద్యానికి సాధ్యం

### నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలి

### నీటి భద్రతలో రైతులు భాగస్వామ్యం కావాలి

### గతంలో ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు చేపట్టాం

### మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు ఖర్చు చేస్తున్నాం

### 'నీటి భద్రత- సాగునీటి సంఘాల బాధ్యత'లో సిఎం చంద్రబాబు

### మావిగన్ పేరుతో అడ్డుకునే కుట్రలు అంటూ విమర్శలు

అనంతపురం : బ్యాంక్‌లో నగదు దాచుకున్నట్లు మనం నీటిని భూమిలో దాచుకోవాలని రాష్ట్ర ప్రజలకు ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపునిచ్చారు. నీటి బొట్టు విలువ ప్రతి ఒక్కరూ గ్రహించాలని సీఎం చంద్రబాబు కోరారు. భూమినే ఒక జలాశయంగా మార్చుకోవాలన్నారు.

తరువాయి 2లో

## నవంబర్ నాటికి

# మూలపేట పోర్టు పూర్తి

### రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టాం

### గత ప్రభుత్వంలో 20శాతం పనులు మాత్రమే చేశారు

### ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయ్యాయి

### పోర్టు పనులను పరిశీలించిన మంత్రులు జనార్ధన్, అచ్చన్న



శ్రీకాకుళం : శ్రీకాకుళం జిల్లా వాసుల చిరకాల ఆకాంక్ష మూలపేట పోర్టు అని మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు అన్నారు. రూ.4,360 కోట్లతో పోర్టు నిర్మాణం చేపట్టామని.. 1,524 ఎకరాల్లో 4 బెర్త్‌ల నిర్మాణం చేపడుతున్నట్లు చెప్పారు. మూలపేట పోర్టును ఈ నవంబర్ నాటికి పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. మూలపేట పోర్టును మంత్రులు బీసీ జనార్దన్ రెడ్డి, అచ్చెన్నాయుడు సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి జనార్దన్ మాట్లాడుతూ.. మూలపేట పోర్టును పరిశీలించామని.. ప్రాజెక్ట్ నిర్మాణంపై సమీక్ష నిర్వహించామని తెలిపారు. గత ప్రభుత్వంలో 20 శాతం పనులు మాత్రమే

2లో

## యుద్ధం ముగించే దిశగా చర్యలు

రెండు దశల్లో ఈ ప్లాన్‌ను అమలు చేసేలా ప్రణాళికలు రెడీ అయినట్లు పేర్కొంది. ఇరు దేశాల మధ్య రాజీ కుదిర్చేందుకు పాకిస్తాన్, ఈజిప్టు, తుర్కియే, గల్ఫ్ దేశాలు ప్రయత్నాలు చేస్తున్నట్లు మీడియాలో కథనాలు వెలువడ్డాయి. యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్, యూఎస్ ప్రత్యేక ప్రతినిధులు స్టీవ్ విట్కాఫ్‌తో పాక్ ఆర్మీ చీఫ్ ఆసిమ్ మునీర్ చర్చలు జరుపుతున్నట్లు విశ్వసనీయ వర్గాలు తెలిపాయని రాయిటర్స్ వార్తా సంస్థ పేర్కొంది. ఇరాన్ విదేశాంగ శాఖ మంత్రితో కూడా ఆసిమ్ మునీర్ కాల్పుల విరమణపై చర్చిస్తున్నట్లు పేర్కొంది. అయితే, కాల్పుల విరమణ ఒప్పందంలో భాగంగా హోర్ముజ్‌ను తెరిచేందుకు ఇరాన్ సిద్ధంగా లేదని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఒత్తిడులు, తుది గడువులను సహించేది లేదని స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. హోర్ముజ్ జలసంధి విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్ మొదట్లో ఇరాన్‌కు ఏప్రిల్ 6ను డెడ్‌లైన్‌గా విధించారు. హోర్ముజ్‌ను తెరవకపోతే ఇరాన్‌లో నరకం కనిపిస్తుందని ఇష్టారీతిన తిడుతూ డెడ్‌లైన్‌కు ఒక రోజు ముందు ట్రంప్ ఓ పోస్టు పెట్టారు. ఈ తుది గడువును మరో 20 గంటల మేర పొడిగిస్తున్నట్లు తాజాగా ట్రంప్ ప్రకటించారు. ఈ నేపథ్యంలో 45 రోజుల కాల్పుల విరమణ ప్రతిపాదన తాజాగా తెరపైకి వచ్చింది.

# నీటిని దాచుకోవడం నేర్చుకోవాలి

అనంతపురం జిల్లా యాడికిలో చంద్రబాబు పర్యటించారు. 'నీటి భద్రత-సాగునీటి సంఘాల బాధ్యత' కార్యక్రమంలో పాల్గొన్నారు. సాగునీటి సంఘాలు, రైతులతో సమావేశమయ్యారు. వర్షపు నీటి విలువ రాయలసీమ రైతులకు బాగా తెలుసని అన్నారు. నీటిని సంరక్షించుకోవడానికి వంద రోజుల యాక్షన్ ప్లాన్ చేపట్టమని స్పష్టం చేశారు. పరిగెత్తే నీటిని నిలబెట్టాలి.. నిలబడిన నీటిని నిల్వ చేయాలి.. జలాశయాలు నింపేందుకు ప్రయత్నించాలన్నారు. ఇంకుడు గుంతలు, చెక్ డ్యామ్‌లు, తుంపర సేద్యం, సూక్ష్మసేద్యం వంటివి గతంలో చేపట్టామని చంద్రబాబు వివరించారు. నీటి కుంటలు, కాలువలు, చెరువుల్లో మట్టి తీసి పొలాల్లో వేశామని ఏపీ సీఎం గుర్తు చేశారు. నీటి భద్రతా కార్యక్రమంలో భాగస్వామ్యం కావాలని రైతులు, సాగునీటి సంఘాలను సూచించారు. మైక్రో ఇరిగేషన్‌లో తాము చేసింది.. దేశం మొత్తం అనుసరించిం దని అన్నారు. ప్రస్తుతం మైక్రో ఇరిగేషన్‌లో రూ.1,031 కోట్లు ఖర్చు చేస్తూ దేశంలో నంబర్ వన్‌గా ఉన్నామన్నారు. గతంలోనే ఇంకుడుగుంతలు, పంటకుంటలు తవ్వించాం. ఎన్టీఆర్ జలసిరి, నీరు-మీరు, నీరు ప్రగతి తీసుకువచ్చాం. మైక్రో ఇరిగేషన్‌లో దేశంలోనే నంబర్ వన్‌గా ఉన్నాం. రాయలసీమలో 63 శాతం పంటలను మైక్రో ఇరిగేషన్ కిందికి తీసుకొచ్చాం. మైక్రో, డ్రిప్ ఇరిగేషన్ వల్ల రాయలసీమ హార్టికల్చర్ హబ్‌గా తయారైంది. వచ్చే ఏడాది గోదావరి పుష్కరాల కంటే ముందే పోలవరాన్ని పూర్తి చేస్తాం. పెండింగ్ సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేస్తాం. రాష్ట్రంలోని జలాశయాలన్నీ జలకళ సంతరించుకున్నాయి. నీటిని నిల్వ చేసుకుంటే చాలు.. అదే సంపద సృష్టిస్తుందని చంద్రబాబు అన్నారు. గత ఏడాది వేసవి ముందు 8, వేసవి తర్వాత 3 మీటర్ల మేర భూగర్భ జలాలు ఉన్నాయని పేర్కొన్నారు. జిల్లాలో గతంలో 13 మీటర్ల మేర ఉంటే.. ప్రస్తుతం అవి 11 మీటర్లలో ఉన్నాయని తెలిపారు. వర్షాకాలం కంటే ముందు 6 మీటర్ల లోతు, ఆ తర్వాత 3 మీటర్ల కంటే తక్కువగా నీరు చూడాల్సి ఉందని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. అలా చేయగలిగితే రాష్ట్రంలో నీటి ఎద్దడి అనేది ఉండదన్నారు. రాయలసీమలోనూ ప్రతి ఎకరాకు నీరు ఇచ్చే బాధ్యత తనదని ఈ సందర్భంగా ఆయన ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒక్క ఖరీఫ్‌కు 547 టీఎంసీలు, రబీకి 343 టీఎంసీలు నీరు అవసరమవుతుందని సీఎం చంద్రబాబు తెలిపారు. పరిశ్రమలకు 28, తాగు నీటికి 158 టీఎంసీల చొప్పున మొత్తంగా 1,300 టీఎంసీల వరకూ మనకు అవసరం అవుతాయని వివరించారు. ఈ ఏడాదిలో 74 టీఎంసీల నీరు అనంతపురం వరకూ తీసుకు వచ్చామని ఆయన గుర్తు చేశారు. గత పాలకులు మనకు అడ్రస్ లేకుండా చేశారంటూ వైసీపీపై సీఎం చంద్రబాబు నిప్పులు చెరిగారు. ఇప్పుడు మీ రాజధాని ఏదంటే అమరావతి అని గర్వంగా చెప్పే రోజు వచ్చిందని ఆయన సంతోషం వ్యక్తం చేశారు. గతంలో రాజధాని విషయంలో మూడు ముక్కలాట ఆడారని.. ఇక మనకు ఒక్కటే రాజధాని నగరం అని పేర్కొన్నారు.మావిగన్ అంటూ పిచ్చి మాటలు మాట్లాడుతున్నారని వైకాపాపై సీఎం చంద్రబాబు విరుచుకుపడ్డారు. వారికి మావిగన్ పిచ్చి ముదిరిందని మండిపడ్డారు. రాష్ట్రంపై పగబట్టారు.. ఇష్టానుసారం మాట్లాడుతున్నారు. అమరావతి దేవతల రాజధాని.. పేరు పలికితే పుణ్యం వస్తుంది. అమరావతి పేరు పలకడం ఇష్టం లేకపోతే ఇంట్లోనే ఉండండి. రాష్ట్రానికి ఒకే రాజధాని.. అది అమరావతి అని సీఎం స్పష్టం చేశారు. పార్లమెంటులో 50 పార్టీలు ఉంటే అందులో వైసీపీ మినహా 49 పార్టీలు రాజధాని అమరావతికి మద్దతు పలికాయని సీఎం చంద్రబాబు వివరించారు. ఒక్క దిక్కు మాలిన వైసీపీ మాత్రమే రాష్ట్రానికి ద్రోహం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పిచ్చి ముదిరి మావిగన్ అనే పేరు తెరపైకి తెచ్చారని వైసీపీ అధినేతపై సీఎం చంద్రబాబు మండిపడ్డారు. రాజధాని అమరావతి అని పలకడానికి కూడా ఇష్టం లేని వ్యక్తులు మావిగన్ అంటున్నారని సీఎం చంద్రబాబు వ్యంగ్యంగా అన్నారు. బాబాయిని చంపి తన చేతిలో కత్తి పెట్టిన వాళ్లు ఎలాంటి రాజకీయమైనా చేస్తారంటూ వైసీపీ నేతల వైఖరిని ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు ఎండగట్టారు. రాజధాని అమరావతి పనులు వేగంగా జరుగుతుంటే.. అవి చూసి సహించలేకే ఈ విమర్శలు చేస్తున్నారని తెలిపారు. రాష్ట్రానికి పెట్టుబడులు, ఉద్యోగాలు వస్తుంటే ఓర్వలేకపోతున్నారని వైసీపీ నేతల తీరుపై ఏపీ సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆడబిడ్డల జోలికి వస్తే వారికి అదే చివరి రోజు అవుతుందని హెచ్చరించారు. దేవాలయాలపై దాడులు చేసి తిరిగి ప్రభుత్వంపై ఎదురుదాడి చేస్తున్నారంటూ వైసీపీ నేతల తీరుపై మండిపడ్డారు. తిరుమలలో శ్రీవారి ప్రసాదాన్ని కల్తీ నెయ్యితో ఘోర అపచారం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. జలధారతో ప్రతి ఎకరానికీ జలహారతి ఇచ్చేలా కార్యాచరణ చేపడదామని ప్రజలకు సీఎం చంద్రబాబు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మంత్రులు పయ్యావుల కేశవ్, నిమ్మల రామానాయుడు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

# నవంబర్ నాటికి మూలపేట పోర్టు పూర్తి

చేశారని.. ప్రస్తుతం 70.54 శాతం పనులు పూర్తయినట్లు మంత్రి తెలిపారు. 20 నెలల్లోనే 49.63 శాతం ప్రాజెక్ట్ పనులు పూర్తి అయినట్లు వెల్లడించారు. కరపత్రిక అడ్డం పెట్టుకుని విష ప్రచారం చేస్తున్నారంటూ వైసీపీపై విరుచుకుపడ్డారు. పోర్టు కోసం కావల్సిన ఉప్పు భూముల విషయంలో వైసీపీ చిత్తశుద్ధితో పని చేయలేదని విమర్శించారు. తాము అధికారంలోకి వచ్చాక ఉప్పు భూముల కోసం కేంద్రంతో సంప్రదింపులు చేశామని.. 385 ఎకరాల ఉప్పు భూములను లీజ్‌పై కేంద్ర కేటాయించిందని వివరించారు. వైసీపీ నేతలు 20 నెలల తరువాత రాజకీయం చేస్తున్నారని.. ఈ 20 నెలలు నిద్ర పోయారా అంటూ మంత్రి ప్రశ్నించారు. రాజకీయ ఉనికి కోసమే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. ఉత్తరాంధ్ర ప్రజలు అందుకే బుద్ధి చెప్పారన్నారు. రాజధాని అని చెప్పినా ఉత్తరాంధ్ర ప్రజలు నమ్మలేదని తెలిపారు. ప్రజా సమస్యలపై మాట్లాడుదాం రండి అంటూ జగన్, వైసీపీ నేతలకు మంత్రి ఛాలెంజ్ విసిరారు. గతంలో అమరావతికి ఓకే అన్న జగన్.. మోసం చేసి తరువాత మూడు ముక్కలు ఆట ఆడారని మండిపడ్డారు. జగన్ అభివృద్ధి చేసే నాయకుడు కాదని.. విధ్వంసం సృష్టించే నాయకుడంటూ వ్యాఖ్యలు చేశారు. అందుకే 11సీట్లకి పరిమిత మయ్యారన్నారు. దేశంలో ప్రైవేట్ ఎయిర్‌పోర్ట్‌లలో బోగాపురం నంబర్ 2గా నిలవనుందని మంత్రి బీసీ జనార్దన్ రెడ్డి తెలిపారు. మూలపేట పోర్టు పనులు 20 శాతం నుంచి 76 శాతం పూర్తి చేశామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. పోర్టులో షిప్ వచ్చి ల్యాండ్ అయ్యిందని.. బెర్త్‌లు లేకుండా షిప్ రాదు కదా అని అన్నారు. పోర్టు కట్టిన తరువాత రోడ్డు, రైల్ రవాణా అవసరం ఉంటుందన్నారు. పోర్టు కోసం సాల్ట్ ల్యాండ్‌లు అవసరమని చెప్పుకొచ్చారు. 385 ఎకరాల సాల్ట్ భూములను కేంద్రం లీజ్‌కు ఇచ్చిందని.. దానిపై కూడా ఒకరు కోర్టుకు వెళ్లారన్నారు. పోర్టును నవంబర్ నాటికి పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. ఫారెస్ట్ ల్యాండ్, జెన్ కో పవర్ సమస్యలను వీలైనంత త్వరగా అధిగమిస్తామని చెప్పారు. అడ్డగోలుగా పూర్తి చేసినట్లు వైసీపీ నేతలు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. మూలపేట వాసులు త్యాగధనులని కొనియాడారు. పోర్టు వల్ల ఎంఎ÷-లాయిమెంట్ రాదని.. పోర్టు పరిసరాల్లో పరిశ్రమలు రావాల్సి ఉందని చెప్పారు. 17 కంపెనీలు ల్యాండ్ కోసం దరఖాస్తు చేశాయని తెలిపారు. మూలపేట పోర్టును సందర్శించడానికి వైసీపీని ఆహ్వానిస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు అన్నారు.

# తుమ్మిడిహట్టి నిర్మించి జిల్లాను సస్యశ్యామలం చేస్తాం

పోరాడి అధికారంలోకి వచ్చాం. విపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా కాంగ్రెస్ ప్రభుత్వం చూడదు. బీజేపీ, బీఆర్ఎస్ మాకు రాజకీయ ప్రత్యర్థులు మాత్రమే.. శత్రువులు కాదు. అభివృద్ధి పనుల కార్యక్రమానికి విపక్ష ఎమ్మెల్యేలను కూడా పిలిచాం. గతంలో ముఖ్యమంత్రి వస్తుంటే విపక్ష నేతలను అరెస్టులు, గృహనిర్భంధాలు చేసేవారు. ఇక్కడ కాంగ్రెస్ ఎమ్మెల్యేలు లేకపోయినా నిధులు ఇస్తున్నాం. మేం పార్టీలు చూడకుండా అన్ని ప్రాంతాలను అభివృద్ధి చేస్తున్నాం అని అన్నారు. సంక్షేమ పథకాల అమలులో రాజకీయాలు చూడటం లేదు. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించాం. గత ప్రభుత్వం డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు ఇవ్వలేదు. కానీ మేం పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు ఇస్తున్నాం. ఇందిరమ్మ ఇళ్ల కోసం ఇప్పటికే రూ.5,400 కోట్లు పేదల ఖాతాల్లో వేశాం. సన్నబియ్యంతో పేదల కడుపు నింపాలనే ఆలోచన గత పాలకులకు వచ్చిందా అని ప్రశ్నించారు. ఆదిలాబాద్ జిల్లా ప్రజలు అమాయకులే కాదు. నిరంకుశత్వం మీద పోరాడిన వీరులు. కుమురంభీం వంటి ఆదివాసీ వీరులు నిజాం నిరంకుశత్వంపై పోరాడారు. ఆదిలాబాద్ జిల్లాకు ఆధునిక విద్య, వైద్యం వంటి సదుపాయాలు ఇంకా దక్కలేదు. ఎన్నో ఒత్తిళ్లు, బెదిరింపులు తట్టుకొని కాంగ్రెస్ కార్యకర్తలు పోరాడారు. ప్రతిపక్ష ఎమ్మెల్యేలను శత్రువులుగా చూసే ప్రభుత్వం కాదు ఇది. రేషన్‌కార్డుదారులకు సన్నబియ్యం ఇస్తున్న రాష్ట్రం.. దేశంలో మరొకటి లేదు. యువత మత్తుబాట వదిలి.. మైదానాల బాట పట్టాలని ప్రయత్నం చేస్తున్నాం. ఆదాయం పెంచాలి.. పేదలకు పంచాలి అనే ఆశయంతో ఈ ప్రభుత్వం పని చేస్తోందని రేవంత్‌రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు,కొండా సురేఖ, ఎంపి గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బాసర జ్ఞానసరస్వతి ఆలయ విస్తరణ

నిర్మల్ : నిర్మల్ జిల్లా బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయాన్ని సీఎం రేవంత్‌రెడ్డి కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.. ఈ సందర్భంగా ఆలయ అధికారులు, అర్చకులు సీఎంకు ఘనస్వాగతం పలికారు. ఆలయంలో సీఎం ప్రత్యేక పూజలు చేసిన అనంతరం.. మనవడికి అక్షరాభ్యాసం చేయించారు. తర్వాత ఆలయ విస్తరణ అభివృద్ధి పనులకు సీఎం భూమిపూజ చేశారు. రూ.225 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. బాసరలోని జ్ఞాన సరస్వతి దేవాలయాన్ని పునరభివృద్ధి చేసేందుకు మాస్టర్‌ప్లాన్ రూపొందించారు. ఈ ప్లాన్‌లో ఆలయ రీడెవలప్‌మెంట్ నమూనాలోని ఒక భాగాన్ని రాష్ట్ర ప్రభుత్వం ఆదివారం విడుదల చేసింది. దక్షిణ భారతదేశంలోని ఏకైక జ్ఞాన సరస్వతి ఆలయం.. అక్షరాభ్యాసాలకు ఆలవాలమైన క్షేత్రం పునఃనిర్మాణంతో కొత్త శోభను సంతరించుకోబోతోంది. వేద వ్యాస మహర్షితో ప్రతిష్టతమైన ముగ్గురు అమ్మల ఆలయం ఆచారాలకు అనుగుణంగా సమున్నతమైన రాజగోపురం.. కోనేరు.. ఉత్తర ద్వారం అభివృద్ధి.. ధ్యాన మందిరాలతో మరింతగా భక్తుల మనస్సులను ఆకట్టకోనుంది. వేల ఏళ్ల ఘన చరిత్ర గల్గిన బాసర జ్ఞాన సరస్వతి ఆలయ పునః నిర్మాణాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.225 కోట్లను కేటాయించింది. పునః నిర్మాణ పనులకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి సోమవారం భూమి పూజ చేసారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి సిఎం భట్టి విక్రమార్క, మంత్రులు జూపల్లి కృష్ణారావు,కొండా సురేఖ, ఎంపి గోడం నగేశ్, స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి, పిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు. దక్షిణ గంగగా గుర్తింపు పొందిన పవిత్ర గోదావరి నదీ తీరంలోని బాసర క్షేత్రంలో జ్ఞాన సరస్వతి దేవి కొలువై ఉన్నారు.. కురుక్షేత్ర యుద్ధానంతరం ప్రశాంతత కోసం వేద వ్యాస మహర్షి గోదావరి తీరానికి వచ్చి బాసరలో నివసించారని ప్రశస్తి. ఆ సమయంలో స్వయంగా ఆయనే గోదావరి ఇసుకతో జ్ఞాన సరస్వతితో పాటు మహాలక్ష్మి, మహాకాళి అమ్మవార్ల మూర్తులను ప్రతిష్టించారనేది స్థల పురాణం.. అలా ముగ్గురమ్మల కొలువైన క్షేత్రంగా బాసర ప్రసిద్ధి చెందింది. జ్ఞాన సరస్వతి కొలువైన క్షేత్రం కావడంతో ప్రతి ఏటా పెద్ద సంఖ్యలో పిల్లలకు ఇక్కడ అక్షరాభ్యాసాలు చేయిస్తుంటారు. వసంత పంచమి, ఇతర పర్వ దినాల్లో అక్షరాభ్యాసాలకు వచ్చే పిల్లలు, తల్లిదండ్రులు, వారి బంధువులు, భక్తులతో ఆలయం కిటకిటలాడుతుంది. ప్రాచీన ఆలయం కావడం.. ఏటేటా పెరుగుతున్న భక్తుల సంఖ్యకు తగినట్లు అభివృద్ధి పనులు చేపట్టపోవడంతో భక్తులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు.. ఈ నేపథ్యంలో బాసర ఆలయ అభివృద్ధి చేపట్టాలని గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సంకల్పించారు. సంప్రదాయాలు, ఆచారాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధి పనులు చేపట్టేందుకు మాస్టర్ ప్లాన్ తయారు చేయాలని అధికారులను ఆదేశించారు. బాసర ఆలయ పునఃనిర్మాణ పనులకు మాస్టర్ ప్లాన్ రూపొందించే ముందు అధికారులు శృంగేరి పీఠాధిపతులతో సంప్రదించారు.. గర్భాలయం, అర్ధ మండపం, రాజగోపురం, ఇతర గోపురాలు, మాడ వీధులు, కోనేరు, ఉత్తర ద్వారాల నిర్మాణాలకు సంబంధించి పీఠాధిపతుల అనుమతులు తీసుకున్నారు.. వారి సూచనలకు అనుగుణంగా మాస్టర్ ప్లాన్‌ను రూపొందించారు. భక్తుల సంఖ్య.. భవిష్యత్ అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రస్తుతం 2 వేల చదరపు అడుగుల్లో ఉన్న గర్భాలయం, అర్ధ మండపాన్ని 5 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఉత్తరం వైపున 9 అంతస్తుల రాజగోపురం, మిగిలిన మూడు దిక్కుల్లో 7 అతంస్తుల గోపురాలు, 33 అడుగుల వెడల్పుతో నాలుగు దిక్కుల మాడ వీధులు, ఉత్తర ద్వారం నిర్మించనున్నారు. మొత్తంగా ఆలయ విస్తీర్ణాన్ని 20 వేల చదరపు అడుగుల నుంచి 62 వేల చదరపు అడుగులకు పెంచుతున్నారు. ఆలయంలో ప్రతి నిర్మాణాన్ని శిలలతో చేపట్టనున్నారు. 6 వేల మంది భక్తులకు అన్ని వసతులతో 70 వేల చదరపు అడుగులతో క్యూ కాంప్లెక్స్‌లు, 200 మంది ఏకకాలంలో కూర్చొని ధ్యానం చేసుకునేలా ధ్యాన మందిరం, 20 వేల చదరపు అడుగుల వైశాల్యంతో వంటశాల, భోజన శాలలు, ప్రసాద పంపిణీ కేంద్రం, ఈశాన్య దిక్కున కోనేరు తూర్పు దిక్కున ఆధ్యాత్మికత పరిఢవిల్లేలా అద్భుతమైన తోరణాలు, సమాచార కేంద్రం, దేవాలయానికి ఉత్తర, తూర్పు దిక్కుల్లో రోడ్ల అభివృద్ధి, దేవాలయం నుంచి ఆవతలి వైపు వెళ్లేందుకు అండర్ పాస్, ఆవతలి వైపున సోలార్ రూఫ్‌టాప్‌తో వాహనాల పార్కింగ్, దేవాలయ ప్రాంగణంలో ఆహ్లాదకరమైన మొక్కలతో పుష్పవనం పనులు చేపట్టనున్నారు. ఆలయ ప్రాంగణం ఆవల హెల్త్ సెంటర్ ఏర్పాటు చేయనున్నారు.. భవిష్యత్‌లో ఆలయం వెనుక భాగం భారీ వృక్షాలతో ఆలరారేలా మొక్కలు నాటనున్నారు.. గోదావరి నది పుష్కరాలు వచ్చే ఏడాది జూన్ లో ప్రారంభంకానున్నాయి. పుష్కరాల సమయంలో లక్షలాది మంది భక్తులు పుణ్య స్నానాలకు బాసర గోదావరి తీరానికి చేరకుంటారు. వారికి అవసరమైన అన్ని వసతులు ప్రస్తుత మాస్టర్‌ఎ÷-లాన్‌లో భాగంగా చేపట్ట నున్నారు. ఏ ఒక్క భక్తుడు ఇబ్బంది పడకుండా అదే సమయంలో ఆలయ సంప్రదాయాలు, భక్తుల విశ్వాసాలకు అనుగుణంగా పనులు చేపట్టాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు.

# హోర్ముజ్ జలసంధిని వెంటనే తెరవండి

మంగళవారం పవర్ ప్లాంట్ డే. బ్రిడ్జి డే. అన్నీ కలిపి ఇరాన్‌లోనే జరుగుతాయి. దీనికేదీ సాటిరాదు. హోర్ముజ్ జలసంధిని తెరవండి. లేకుంటే ఇరాన్‌లో కాదు. నరకంలో ఉన్నట్లే. చూస్తూ ఉండండి. అల్లాను ప్రార్థించండి అంటూ ట్రంప్ పేర్కొన్నాడు. అంతేకాదు.. ఇందుకోసం రాయలేని రీతిలో బూతు పదాల్ని వాడాడు. హోర్ముజ్ జలసంధిని 48 గంటల్లోగా తెరవాల్సిందే అని ఇరాన్‌కు ఇప్పటికే ట్రంప్ హెచ్చరిక జారీ చేసిన సంగతి తెలిసిందే. తాను చెప్పినట్లు చేయకపోతే ఇరాన్‌లోని బ్రిడ్జిలు, పవర్ ప్లాంట్లపై దాడులు చేస్తామని ట్రంప్ హెచ్చరించారు. తీవ్రంగా గాయపడిన తమ ఎఫ్-15 యుద్ధ విమాన సిబ్బందిని ఇరాన్‌లోని పర్వత ప్రాంతాల నుంచి రక్షించామని అమెరికా అధ్యక్షుడు వెల్లడించారు. పగటిపూటే.. దాదాపు ఏడు గంటలపాటు శ్రమించి ఈ రెస్క్యూ ఆపరేషన్ చేశామన్నారు. పౌరులకు, విమానాలకు ఎక్కువ ప్రమాదం ఉండే ఇలాంటి ఆపరేషన్ చాలా అరుదని చెప్పారు. అయితే, ట్రంప్ హెచ్చరికను ఇరాన్ తేలికగా తీసుకుంది. మరోవైపు ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ దళాలు దాడులు కొనసాగిస్తున్నాయి. ఇరాన్ కూడా కువైట్, బహ్రెయిన్‌లోని చమురు కేంద్రాలపై దాడులు చేస్తోంది. అలాగే, తమ దేశంలోని పౌర కేంద్రాలపై దాడులు చేస్తే తాము కూడా మరింత బలంగా దాడి చేస్తామని ఇరాన్న ఇప్పటికే హెచ్చరించింది. ఇంకోవైపు ఇజ్రాయెల్ దళాలు లెబనాన్ రాజధాని అయిన బీరుట్‌పై దాడులు చేస్తున్నాయి. అలాగే, ఆదివారం అమెరికాకు చెందిన యుద్ధ విమానాల్ని కూల్చివేశామని ఇరాన్ తెలిపింది. సీ-130 అనే రెండు రవాణా విమానాల్ని, రెండు బ్లాక్ హ్యాక్ అనే హెలికాప్టర్లను కూల్చినట్లు తెలిపింది. మరోవైపు అణు ఆధారిత విద్యుత్ క్షేత్రాలపై దాడుల వల్ల తీవ్ర పరిణామాలు ఎదుర్కొవాల్సివస్తుందని ఇరాన్ ఆందోళన వ్యక్తం చేసింది. రేడియో ధార్మిక పదార్థాలు భూ, జలాలు, వాతావరణంలోకి విడుదలయితే ఇరాన్‌తో పాటు ఇరాన్ ఆవల కూడా మానవ, పర్యావరణ విపత్తులకు దారితీయవచ్చునని పేర్కొంది. అందువల్ల అమెరికా, ఇజ్రాయిల్ తమ దేశంలోని అణు విద్యుత్ స్థావరాలను లక్ష్యం చేసుకొని చేస్తున్న దాడులను తీవ్రంగా ఖండించాల్సిందిగా ఐక్యరాజ్యసమితి ప్రధాన కార్యదర్శి ఆంటోనియా గుటెర్రెస్‌కు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ ఒక లేఖ రాశారు. ఈ లేఖను ఆయన సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. ఇరాన్‌లో పనిచేస్తున్న ఏకైక అణు విద్యుత్ ప్లాంటుపై పదే పదే జరుగుతున్న దాడులు పశ్చిమాసియాలో మానవ, పర్యావరణ ప్రమాదాలకు దారితీస్తాయని అరాగ్చీ హెచ్చరించారు. బుషెహర్ స్థావరంపై జరుగుతున్న దాడులను సహించలేని పరిస్థితి నెలకొన్నదని చెప్పారు. రేడియో ధార్మిక పదార్థాలు కలుషితమైతే ఇరాన్ సరిహద్దులకు ఆవల కూడా తీవ్ర పరిణామాలు తప్పవని ఆందోళన వ్యక్తం చేశారు. బుషెహర్ ఎ÷-లాంటుపై నాలుగుసార్లు దాడి జరిగిందని సామాజిక మాధ్యమ వేదిక ఎక్స్ ద్వారా ఆయన తెలియజేశారు. రేడియో ధార్మిక పదార్థాలు విడుదలైన పక్షంలో టెహ్రాన్ కంటే గల్ఫ్ సహకార మండలి సభ్య దేశాలకే ముప్పు ఎక్కువ అని చెప్పారు. ఇరాన్ యుద్ధం కారణంగా పెరుగుతున్న చమురు ధరలతో లాభాలు దండుకుంటున్న ఇంధన కంపెనీలపై పన్నులు విధించాలని ఐదు యూరోపియన్ దేశాల ఆర్థిక మంత్రులు సూచించారు. ఈ మేరకు జర్మనీ, ఇటలీ, స్పెయిన్, పోర్చుగల్, ఆస్ట్రియా దేశాల ఆర్థిక మంత్రులు ఈయూ కమిషన్‌కు ఓ లేఖ రాశారు. 'మనమంతా సంఘటితంగానే ఉన్నామని, చర్య తీసుకునేందుకు సిద్ధమేనని సంకేతం పంపడానికి ఇలాంటివి అవసరం' అని వారు అభిప్రాయపడ్డారు. చమురు కంపెనీలపై భారీగా పన్నులు విధించడం ద్వారా సామాన్య ప్రజలపై భారం తగ్గుతుందని వారు తెలిపారు. దక్షిణ లెబనాన్‌లో ఐరాస శాంతి పరిరక్షక కేంద్ర కార్యాలయానికి చెందిన 17 నిఘా కెమేరాలను ఇజ్రాయిల్ ధ్వంసం చేసింది. కోస్తా ప్రాంతంలోని నఖురా పట్టణంలో ఏర్పాటు చేసిన ఈ కెమేరాలను ఇజ్రాయిల్ దళాలు ధ్వంసం చేశాయని లెబనాన్‌లో ఐరాస తాత్కాలిక దళాల (యునిఫిల్) ప్రతినిధి కండిస్ అర్డియల్ తెలిపారు. పట్టణంలో తిష్ట వేసిన ఇజ్రాయిల్ సేనలు అక్కడి భవనాలను పెద్ద సంఖ్యలో నేలమట్టం చేశారని ఆమె అన్నారు.

# బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

విజయవాడ : ఏపీ వ్యాప్తంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా ఊరూ వాడా పార్టీ శ్రేణులు సంబరాలు చేపట్టారు. విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయం వద్ద పార్టీ ఆవిర్భావ వేడుకల్లో రాష్ట్ర అధ్యక్షులు పీవీఎన్ మాధవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ పతాకాన్ని ఎగురవేసి ... నాయకులు, కార్యకర్తలకు స్వీట్‌లు తినిపించారు మాధవ్. నేటి నుంచి గ్రామపంచాయతీల్లో బీజేపీ ఆధ్వర్యంలో 'మన ఊరు.. మన జెండా' పేరుతో కార్యక్రమం ప్రారంభంకానుంది. దేశంలో విచ్ఛిన్నకర రాజకీయాలకు వ్యతిరేకంగా బీజేపీ పోరాటం చేసిందని పీవీఎన్ మాధవ్ తెలిపారు. అవినీతి అక్రమాలకు వ్యతిరేకంగా బీజేపీ అనేక రాష్ట్రాల్లో అధికారాన్ని చేపట్టిందన్నారు. పొత్తులతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసే స్థితి నుంచి సంపూర్ణ మద్దతుగా ప్రభుత్వం ఏర్పాటు అయ్యే వరకు బీజేపీ బలపడిందని చెప్పుకొచ్చారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక శత్రు దేశాలు దాడి చేసేందుకు కూడా వెనకడుగు వేశాయన్నారు. బీజేపీ అధికారంలోకి వచ్చాక కుల, మత ఘర్షణలు లేవని తెలిపారు. 'సబ్ కా సాత్.. సబ్ కా వికాస్' నినాదంతో బీజేపీ అడుగులు వేస్తోందన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక అభివృద్ధే లక్ష్యంగా అడుగులు వేస్తోందని పీవీఎన్ మాధవ్ పేర్కొన్నారు. ఇదిలావుంటే బీజేపీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా స్పందిస్తూ.. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందన్నారు. బీజేపీ నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న నిబద్ధతతో దేశాన్ని శక్తివంతం చేసిందని సీఎం చంద్రబాబు పోస్టు చేశారు. 'భారతీయ జనతా పార్టీ 47వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పార్టీ నాయకులకు, కార్యకర్తలకు నా హృదయపూర్వక శుభాకాంక్షలు. జాతీయవాదమే పునాదిగా, దేశ సర్వతోముఖాభివృద్ధికి కట్టుబడి ఉన్న ఈ పార్టీ.. మన సంస్కృతిని, ప్రజాస్వామ్య విలువలను బలోపేతం చేస్తూ, సమగ్ర అభివృద్ధి, దేశ సేవ కోసం నిరంతరం కృషి చేస్తోంది. పార్టీ వ్యవస్థాపక నేతల నుంచి మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి, ప్రస్తుత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో బీజేపీ తన నిర్ణయాత్మక పాలన, ప్రగతి పట్ల ఉన్న నిబద్ధతతో దేశాన్ని శక్తివంతం చేసింది. ఆంధ్రప్రదేశ్‌లో రెట్టింపు వేగంతో పనిచేస్తోన్న ఎన్డీయే డబుల్ ఇంజన్ సర్కార్.. ఉత్సాహంతో ప్రజలకు సేవలు అందిస్తూ, సహకార సమాఖ్య స్ఫూర్తికి ఉదాహరణగా నిలుస్తోంది.

## ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలు

2029లో జరిగే లోక్‌సభ, అసెంబ్లీ ఎన్నికలకు జరిగే ఎన్నికల్లో ఈ రిజర్వేషన్లు అమలు అయ్యేలా చూస్తామని మోదీ హామీ ఇచ్చారు. కాంగ్రెస్ హయాంలో ఎమర్జెన్సీ, ప్రతిపక్షాలపై దాడులు వంటి ఎన్నో అణచివేతలను భాజపా కార్యకర్తలు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. ఈ సందర్భంగా కార్యకర్తలను ఉత్సాహపరిచేలా పలు అంశాలను పేర్కొన్నారు. మన కార్యక్రమం చురుగ్గా ముందుకెళుతోంది. ఉమ్మడి పౌరస్మృతి, జమిలి ఎన్నికలపై తీవ్రంగా చర్చలు జరుగుతున్నాయి. మంచి పురోగతి కనిపిస్తోంది. అభివృద్ధి చెందిన దేశంగా మార్చడానికి భాజపా కట్టుబడి ఉంది. బ్రిటీష్ కాలం నాటి చట్టాలను రద్దు చేశాం. కొత్త పార్లమెంట్ భవనాన్ని నిర్మించుకున్నాం. జనరల్ కేటగిరీలో 10 శాతం రిజర్వేషన్లు, ట్రిపుల్ తలాక్ రద్దు, పౌరసత్వ సవరణ చట్టం, అయోధ్యలో రామ మందిర నిర్మాణం వంటివి చేపట్టాం అని ప్రధాని మోదీ అన్నారు.

# హామీలను అమలు చేసిన ఘనత మాది

పిప్పిరిలో బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. పిప్పిరిలో మొదలుపెట్టి ఖమ్మం వరకు పాదయాత్ర చేసినట్లు గుర్తు చేసుకున్నారు. పీపుల్స్ మార్చ్‌లో ఇచ్చిన హామీల అమలుపై జీవోలు జారీ చేశాం. ఇవాళే రూ.1,238 కోట్లతో చేపట్టే పనులకు శంకుస్థాపన చేశాం. ఒకే విడతలో రుణమాఫీ చేసి రూ.22,500 కోట్లను రైతుల ఖాతాల్లో వేశాం. ప్రతి నియోజకవర్గంలో పేదల కోసం 3,500 ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశాం. తొలి ఏడాదిలోనే మొత్తం 4.50 లక్షల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాం. ప్రతి నియోజకవర్గంలో అంతర్జాతీయ ప్రమాణాలతో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూళ్ల నిర్మాణం చేపట్టాం. ఇన్ని పథకాలు, హామీలు ఎలా అమలు చేయగలుగు తున్నారని ఇతర రాష్ట్రాల నేతలు అడుగుతున్నారు. ఈ రాష్ట్రంలో పుట్టడం అదృష్టంగా ప్రజలు భావించే పరిస్థితులు ఉండాలని భావించాం. రాష్ట్రంలో ప్రతి కుటుంబానికి వర్తించేలా రూ.5 లక్షలతో ఇందిరమ్మ బీమా పథకం తీసుకొచ్చాం. రైతు కుటుంబాల నుంచి వచ్చిన మాకు పేదల కష్టాలు, అవసరాలు తెలుసు. ప్రజల సంక్షేమం తప్ప.. మాకెవరికీ వ్యక్తిగత ప్రయోజనాలు లేవని భట్టి విక్రమార్క అన్నారు.

# భద్రాచలం అభివృద్ధికి ఐదూళ్లే ముఖ్యం

పోలవరం సాధ్యం అయ్యిందని పదేపదే చెబుతున్న చంద్రబాబు ఈ విషయంలో పట్టువిడుపులు ప్రకటించడం లేదు. ఉభయ తెలుగు రాష్ట్రాల అభివృద్ధి తనకు ముఖ్యమని ప్రకటించిన చంద్రబాబు ఈ విషయంలో మాత్రం పెదవి విప్పడం లేదు. చంద్రబాబు తలచకుంటే ఈ సమస్య చిటికెలో పరిష్కారం అవుతుంది. పరిపాలన సౌలభ్యం కోసం ఆ ఐదు గ్రామాలను తెలంగాణలో విలీనం చేసి గిరిజనుల ఇబ్బందులు తొలగించాల్సి ఉంది. రాష్ట్ర విభజన సమయంలో ఏపీలో కలిపిన యాటపాక, కన్నాయిగూడెం, పిచ్చికలపాడు, పురుషోత్తపట్నం, గుండాల గ్రామ పంచాయతీలు పరిపాలనపరంగా ఎదుర్కొంటున్న ఇబ్బందులను పదేపదే కేంద్రం దృష్టికి తీసుకుని వెళ్లారు. ఆ ఐదు గ్రామ పంచాయతీల పరిధిలో 19 రెవెన్యూ గ్రామాలు ఉండగా.. తెలంగాణలోని రెండు భాగాల మధ్య ప్రత్యేక పరిస్థితుల్లో ఉన్నాయి. మిగిలిన సరిహద్దులు గోదావరి నది, రిజర్వు ఫారెస్టు ప్రాంతాలతో చుట్టుముట్టు ఉన్నాయి. దీంతో పరిపాలనపరమైన సమస్యలు ఎదురవుతున్నాయి. ప్రజలు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ గ్రామ పంచాయతీలకు పోలవరం ముంపు సమస్యతో ఎలాంటి సంబంధం లేదు. కానీ పరిపాలన, జీవనోపాధి, ప్రజాసేవల కోసం ఆ గ్రామాల ప్రజలు భద్రాచలంపైనే పూర్తిగా ఆధారపడి ఉన్నారు. ఏపీలో కొనసాగటం వల్ల గత 12 ఏళ్లుగా ఇబ్బంది పడుతున్నారు. ఈ గ్రామాల్లోని గిరిజనులు తమ ఊళ్లను తెలంగాణలోనే కలపాలని ఎప్పటి నుంచో కోరుతున్నా, కేంద్రం కానీ, ఎపి కానీ పట్టించుకోవడం లేదు. ఇక, ఆ గ్రామాల ప్రజలు ఏపీలోని అల్లూరి సీతారామరాజు జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే 282 కిమీల దూరం ప్రయాణించాల్సి ఉంటుంది. ఇందుకోసం 8 గంటల సమయం పడుతుందని పేర్కొంటున్నారు. మరోపక్క, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకేంద్రం కేవలం 40 కిమీల దూరంలో ఉన్నదని, గంటలో జిల్లా కేంద్రానికి చేరుకోవచ్చు. ప్రస్తుత సరిహద్దుల కారణంగా వ్యవసాయ ఉత్పత్తులు, అటవీ ఉత్పత్తులు, అవసరమైన సరుకులు తరలించేటప్పుడు తరుచుగా తనిఖీలు, అడ్డంకులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాంతం ఛత్తీస్‌గఢ్- ఒడిసా రాష్ట్రాలకు సమీపంలో ఉండటంతో పోలీసింగ్, శాంతిభద్రతల సమస్యలు కూడా తలెత్తుతున్నదని ఆరోపణలు ఉన్నాయి. ఇకపోతే భద్రాద్రి శ్రీ సీతారామచంద్రస్వామి దేవాలయం తెలంగాణలో ఉండగా,ఈ ఆలయానికి సంబంధించిన కొన్ని భూ ములు ప్రస్తుతం పురుషోత్తపట్నం ప్రాంతంలో ఉన్నాయి. ఈ దేవాలయ భూముల విషయంలో గతంలో అక్కడికి వెళ్లిన మహిళా ఇవోపై దాడి జరిగింది. ఇది శాంతిభద్రతల సమస్యగా మారింది. దేవాలయ నిర్వహణ సులభంగా ఉండేందుకు ఈ భూభాగాలను తిరిగి తెలంగాణలో కలపటం అత్యవసరం కూడా. ఈ భౌగోళిక సమస్య కొనసాగితే భద్రాచలం దేవాలయం అభివృద్ధి ప్రణాళికకు ఆటంకం ఏర్పడుతుందని ప్రభుత్వ వర్గాలు కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. అంతేకాక, ఆ ఐదు గ్రామాలు ఐదో షెడ్యూలులో ఉండటంతో ప్రభుత్వ సేవలు, సంక్షేమ పథకాలు గిరిజనులకు అందటం లేదని గిరిజన నేతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ఆ ఐదు గ్రామ పంచాయతీలు, 19 రెవెన్యూ గ్రామాలు తిరిగి తెలంగాణలోని భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోకి కలపాల్సిన అసవరం ఉఎంతైనా ఉందని. కేంద్ర మంత్రి అమిత్‌షాకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మరోమారు విజ్ఞప్తి చేశారు. ప్రస్తుత పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు ఈ నెల 16 నుంచి జరగబోతతున్నాయి. ఈ సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో.. ఇప్పుడే నిర్ణయం తీసుకోవాలని మంత్రి కోరారు. ఈ మేరకు కేంద్ర మంత్రికి ఆయన ఓ లేఖ రాశారు. ఆ ఐదు గ్రామాల సమస్యను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇదివరకే ఏపీ సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లారని ఆ లేఖలో పేర్కొన్నారు. అయితే ఇప్పుడు చంద్రబాబు కనుక నిర్ణయం తీసుకుంటే సమస్య సులువుగా పరిష్కారం అవుతుంది. అందుకు ఆయన సానుకూలంగా ముందుకు రావాల్సి ఉంది.

## ఆనాటి నేతలు... నేటి మోడీతో మరింత బలోపేతం

నితిన్ నబిన్, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా, బీజేపీ ఏపీ అధ్యక్షులు పీవీఎన్ మాధవ్, పార్టీ నాయకులు, కార్యకర్తలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. దేశం పట్ల ప్రేమ, దేశ ప్రజల పట్ల అంకితభావం అనే సిద్ధాంతాలే ఆలంబనగా బీజేపీ ముందుకు వెళ్తోందన్నారు. మాజీ ప్రధాన మంత్రి అటల్ బిహారీ వాజ్‌పేయి, ఎల్‌కే అద్వానీ లాంటి మహనీయుల సంకల్పం.. ప్రధాని మోదీ అచంచల విశ్వాసంతో కూడిన పోరాటంతో నేడు ప్రపంచంలోనే అతిపెద్ద పార్టీగా బీజేపీ కీర్తిని ఆర్జించిందని వెల్లడించారు. బీజేపీ నాయకత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వం క్లిష్ట పరిస్థితుల్లో కూడా సమర్థవంతమైన విధానాలు అమలు చేస్తూ దేశ రాజకీయాల్లో తనదైన ముద్ర వేసిందన్నారు. భారతీయ జనతా పార్టీ వికసిత్ సంకల్పం దేశాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించాలని ఆకాంక్షిస్తున్నట్లు ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ ట్వీట్ చేశారు.

# అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ప్రజావాణి కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి దరఖాస్తులు స్వీకరించిన జిల్లా కలెక్టర్**



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : అర్జీల పరిష్కారం సత్వరమే చేయాలని, ప్రజావాణి దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యతనిచ్చి అర్జీలను పెండింగ్ లో ఉంచకుండా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ లో ప్రజల నుండి దరఖాస్తులను స్వీకరించారు. పెద్దపల్లి పట్టణం రాజీవ్ నగర్ కు చెందిన ఆర్.రాధ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్, తహసిల్దార్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. అంతర్గాం మండలం విస్సంపేట గ్రామానికి చెందిన పి. కిట్టయ్య తాము బర్రెలు కాసుకుంటూ జీవనం కొనసాగిస్తున్నామని తమకు ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా పీడీ హౌసింగ్ కు రాస్తూ అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రజావాణి కార్యక్రమంలో సంబంధిత జిల్లా అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పటాన్‌చెరులో "రాజన్న టీ కొట్టు" ప్రారంభం




పటాన్చెరు, ఏప్రిల్ 06(ది క్రైమ్ న్యూస్) : పటాన్‌చెరు పట్టణంలోని జేపీ కాలనీ జిహెచ్ఎంసి డివిజన్ పరిధిలోని అంబేద్కర్ కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన "రాజన్న టీ కొట్టు"ను బీఆర్ఎస్ పార్టీ నాయకుడు మాద్రి పృథ్వీరాజ్ సోమవారం ఘనంగా ప్రారంభించారు. న్యూ మార్కెట్ రోడ్‌లో నిర్వహించిన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి దుకాణాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, షాప్ యజమానులకు హృదయపూర్వక శు భాకాంక్షలు తెలియజేసిన పృథ్వీరాజ్, వారి వ్యాపారం మరింత అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. "రాజన్న టీ కొట్టు" ఇప్పటికే పటాన్‌చెరు నియోజకవర్గంలో అనేక ఫ్రాంచైజీలతో విజయవంతంగా కొనసాగుతున్న బ్రాండ్ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజన్న టీ కొట్టు చైర్మన్ రాజును ప్రత్యేకంగా అభినందించారు. అలాగే తీగలనగరం శంకర్, మల్లేష్, మూర్తి, యువసేన సభ్యులు, హోటల్ యాజమాన్యం తదితరులు పాల్గొన్నారు.

## మూడు కోట్ల 25 లక్షల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టిన ఎమ్మెల్యే జీఎంఆర్



పటాన్‌చెరు (అమీన్పూర్), ఏప్రిల్ 06(ది క్రైమ్ న్యూస్ ): అమీన్పూర్ డివిజన్ పరిధిలో భారీ అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గూడెం మహిపాల్ రెడ్డి సోమవారం ఉదయం సాయి అంబికా కాలనీ నుంచి ఐలాపూర్ తాండ వరకు, లాలా బాయి కాలనీ నుంచి బొల్లారం ఇండస్ట్రియల్ ఏరియా వరకు రూ. 3 కోట్ల 25 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, నూతన రహదారుల నిర్మాణంతో ఆయా కాలనీల ప్రజలకు మెరుగైన రవాణా సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. నిర్ణయించిన గడువులో పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకువస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అమీన్పూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ తుమ్మల పాండురంగారెడ్డి, మాజీ ఎంపీపీ దేవానందం, మాజీ జెడ్పిటిసి సుధాకర్ రెడ్డి, ఈఈ సురేష్, మాజీ ప్రజాప్రతినిధులు, సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఒంటిమిట్టలో నేత్రపర్వంగా చక్రస్నానం

ఒంటిమిట్ట : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో చివరిరోజైన శనివారం ఆలయ సమీపంలోని పుష్కరిణిలో చక్రస్నానం నేత్రపర్వంగా జరిగింది. విశేష సంఖ్యలో భక్తులు పాల్గొని పుణ్యస్నానాలు ఆచరించారు. ఆలయంలో ఉదయం 4 గంటలకు సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి ఆలయ శుద్ధి, ఆరాధన నిర్వహించారు.

# జిన్నారంలో ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



పటాన్చెరు(జిన్నారం), ఏప్రిల్ 06(ది క్రైమ్ న్యూస్) : భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని జిన్నారం మున్సిపాలిటీలో వేడుకలు ఘనంగా నిర్వహించారు. పార్టీ స్థాపనకు 47 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా మున్సిపల్ పరిధిలోని పలు పోలింగ్ బూత్‌ల వద్ద జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు చేపట్టారు. జిన్నారం మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు కొత్త కాపు జగన్ రెడ్డి వివిధ ప్రాంతాల్లో పార్టీ జెండాను ఆవిష్కరించారు. కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన ప్రధాన కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ వంగేటి ప్రతాప్ రెడ్డి, రాష్ట్ర సీనియర్ నాయకుడు కురుపల్లి నర్సింగరావు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, దేశ సేవే లక్ష్యంగా పనిచేస్తూ భారత గౌరవాన్ని ప్రపంచానికి చాటిన పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు. జనసంఘ కాలం నుంచి ఇప్పటివరకు పార్టీ జెండాను ముందుకు తీసుకెళ్లిన మహనీయులను స్మరించుకోవాలని పిలుపునిచ్చారు. 'అంత్యోదయ' స్ఫూర్తితో సుపరిపాలన లక్ష్యంగా పని చేస్తూ దేశమే ప్రథమం అనే భావనతో పార్టీ ముందుకు సాగుతోందని తెలిపారు. అలాగే నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశంలో బీజేపీ ప్రభావం పెరుగుతోందని, రాబోయే కాలంలో తెలంగాణలో కూడా కాషాయ జెండా ఎగరవేస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశ సేవకు అంకితమై పనిచేస్తున్న కోట్లాది కార్యకర్తలకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు నర్సింగ్ రావు, వంగేటి రాజిరెడ్డి, కౌన్సిలర్లు స్వప్న, రాజేందర్ రెడ్డి, వెంకటేష్, సీనియర్ నాయకులు పల్నాటి శ్రీనివాస్, బుక్కా బిక్షపతి, లక్ష్మణ్, ఏర్పుల వీరేష్, రాజు, భార్గవ్, దామోదర్, జిన్నారం మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి

**ఆహార నాణ్యతలో ఎలాంటి రాజీ ఉండ కూడదు - జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ఈట్ రైట్" కార్యక్రమాన్ని కచ్చితంగా అమలు చేయాలి**

**సోషల్ మీడియాలో చిన్న విషయాలు కూడా పెద్ద సమస్యలుగా మారుతున్నాయి**

**మెనూ ప్రకారం 100 శాతం ఆహారం అందించాలి**



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : జిల్లాలో సుమారు 12 వేల మంది విద్యార్థులు రెసిడెన్షియల్ విద్యాసంస్థల్లో చదువుతున్నందున, వారికి అందించే ఆహార నాణ్యతపై ఎలాంటి రాజీ ఉండకూడదని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష స్పష్టం చేశారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో కేజీబీవీ, గురుకుల విద్యాసంస్థలు, ఆదర్శ పాఠశాలల వంట మనుషులతో సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఆహార విషబాధ, వాంతులు, తాగునీటి సమస్యలు వంటి ఘటనలు ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం చిన్న చిన్న విషయాలు కూడా సామాజిక మాధ్యమాల్లో పెద్ద సమస్యలుగా మారుతున్నాయని, రాజకీయ కారణాలతో అవి మరింత విస్తరిస్తున్నాయని పేర్కొన్నారు. ఇటీవల మంచిర్యాల జిల్లాలో విద్యార్థులు బయట ఆహారం తీసుకొని అస్వస్థతకు గురైనప్పటికీ, ప్రభుత్వ పాఠశాలలపై విమర్శలు వచ్చిన విషయాన్ని గుర్తుచేశారు. ఇలాంటి పరిస్థితులు రాకుండా ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. వంటలో ఉపయోగించే కూరగాయలు, గుడ్లు, మాంసం వంటి పదార్థాలను పరిశుభ్రమైన వాతావరణంలో నిల్వ చేయాలని, వంట విధానం, పదార్థాల నాణ్యతపై వంట మనుషులు అత్యంత జాగ్రత్త వహించాలని ఆదేశించారు. ప్రత్యేకంగా మాంసాహార వంటకాలు మరింత శ్రద్ధతో తయారు చేయాలని సూచించారు. విద్యార్థుల వ్యక్తిగత పరిశుభ్రత, ముఖ్యంగా గోర్లు వంటి అంశాలపై కూడా పర్యవేక్షణ అవసరమని తెలిపారు. వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో మరిన్ని ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశమున్నందున, వంట ప్రక్రియలో ద్విగుణిత జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. చిన్న పొరపాట్లు కూడా పెద్ద సమస్యలకు దారితీసే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రభుత్వం డైట్ ఛార్జీలు పెంచి, చెల్లింపులు సమయానికి చేస్తున్నందున, నిర్ణయించిన మెనూను ఎట్టి పరిస్థితుల్లోనూ 100 శాతం పాటించాలని, అన్ని రెసిడెన్షియల్ విద్యాసంస్థలు ఒకే సాధారణ మెనూను అమలు చేయాలని ఆదేశించారు. గత ఏడాది ముత్తారం కేజీబీవీలో జరిగిన ఆహార విషబాధ ఘటన పునరావృతం కాకుండా, ప్రతి రోజు అప్రమత్తంగా ఉండాలని వంట మనుషులకు సూచించారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, ఫుడ్ ఇన్‌స్పెక్టర్ అరవింద్ రెడ్డి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఇప్పుడు కట్టండి... డబ్బు సేవ్ చేసుకోండి - హాలియాలో 5% పన్ను రాయితీ

ది క్రైమ్ న్యూస్ -- నల్గొండ జిల్లా ప్రతినిధి : హాలియా మున్సిపాలిటీ పరిధిలోని పౌరులందరికీ తెలియజేయునది ఏమనగా, 2026-27 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఇంటి ఆస్తి పన్నును ముందుగానే చెల్లించే వారికి రాష్ట్ర ప్రభుత్వం 5% రాయితీను ప్రకటించింది. ఈ రాయితీ 01-04-2026 నుండి 30-04-2026 వరకు మాత్రమే వర్తించును. ఈ విషయంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మున్సిపల్ వాహనాల ద్వారా మైక్ అనౌన్స్‌మెంట్‌లు నిర్వహించబడుతున్నాయి. అదేవిధంగా మున్సిపల్ వాహనాలకు 5% రాయితీ ఫ్లెక్సీలు ఏర్పాటు చేయడం జరిగింది. ప్రధాన కూడళ్లలో మరియు మెయిన్ రోడ్లపై కూడా ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. 5% రాయితీ వల్ల లాభాలు, 1000 ఆస్తి పన్ను ఉన్నవారు? 950 మాత్రమే చెల్లించవలెను, 10,000 ఆస్తి పన్ను ఉన్నవారు ? 9,500 మాత్రమే చెల్లించవలెను, 50,000 ఆస్తి పన్ను ఉన్నవారు ? 47,500 మాత్రమే చెల్లించవలెను, కాబట్టి హాలియా మున్సిపాలిటీ పరిధిలోని గృహ యజమానులు మరియు వాణిజ్య సముదాయ యజమానులు ఈ 5% రాయితీ అవకాశాన్ని వినియోగించుకోవలసిందిగా కోరడమైనది. మరిన్ని వివరాల కోసం మున్సిపల్ కార్యాలయాన్ని లేదా సంబంధిత బిల్ కలెక్టర్‌ను సంప్రదించగలరు.

# ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి

**జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**ప్రపంచ హోమియో దినోత్సవం సందర్భంగా ఏప్రిల్ 10న ప్రత్యేక వైద్య శిబిరం**



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : 99 రోజుల ప్రణాళికలో భాగంగా ఆరోగ్యంపై శ్రద్ధ పెంచుకొని ఉచిత వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. తెలంగాణ ప్రభుత్వ ప్రజా పాలన--ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఆరోగ్య వారోత్సవాల సందర్భంగా సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష ఆయుష్ వైద్యులతో కలిసి తన కార్యాలయంలో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ఏప్రిల్ 10, 2026 (శుక్రవారం) రోజున ఉదయం 6:30 గంటలకు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో యోగా కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలిపారు. ప్రపంచ హోమియో దినోత్సవాన్ని పురస్కరించుకుని అదే రోజు ఉదయం 9:30 గంటలకు పెద్దపల్లి పట్టణంలోని ఆయుష్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉచిత ఆయుష్ వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ శిబిరంలో నిష్ణాతులైన ఆయుర్వేద, హోమియో మరియు యునాని వైద్యులచే ఉచిత కన్సల్టేషన్ అందించబడుతుందని, అవసరమైన వారికి ఉచితంగా మందులు కూడా పంపిణీ చేయబడతాయని తెలిపారు. దీర్ఘకాలిక వ్యాధులైన కీళ్ల వాతం, కీళ్ల నొప్పులు, నడుము నొప్పి, మెడ నొప్పి, చర్మ వ్యాధులు, జీర్ణకోశ సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు, పైల్స్, ఫిస్టులా, స్త్రీల ఋతు సంబంధ వ్యాధులు, సంతాన సమస్యలు, బీపీ, షుగర్ తదితర వ్యాధులకు సంబంధించి చికిత్సలు అందించబడతాయని పేర్కొన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆరోగ్య పరిరక్షణలో భాగస్వాములు కావాలని, ముఖ్యంగా పెద్దపల్లి పట్టణం మరియు పరిసర గ్రామాల ప్రజలు ఎక్కువ సంఖ్యలో పాల్గొనాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమంలో ఆయుష్ డాక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

# తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవు

**రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు**



గోదావరిఖని క్రైమ్ (ది క్రైమ్ న్యూస్): తాగి వాహనం నడిపితే కఠిన చర్యలు తప్పవని రామగుండం ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బి. రాజేశ్వరరావు హెచ్చరించారు. రామగుండం ట్రాఫిక్ పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డ 10 మందిని గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేష్ దుర్వ ముందు సోమవారం హాజరుపరచగా వారిలో 8 మందికి 16000 జరిమానా విధించారు. రెండోసారి పట్టుబడ్డ ఇద్దరు వ్యక్తులకు 2000 జరిమానాతో పాటు కమ్యూనిటీ సర్వీస్ కింద అనాథాశ్రమంలో అవసరమైన వస్తువులను పంపిణీ చేయాలని కోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఆదేశాల మేరకు ట్రాఫిక్ సిఐ బి. రాజేశ్వరరావు ఆధ్వర్యంలో అమ్మ పరివార్ అనాథాశ్రమంలో 75 కిలోల బియ్యం, పండ్లు అందజేశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ వాహనదారులు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, ఫోర్ వీలర్ నడిపేటప్పుడు సీట్ బెల్ట్ పెట్టుకోవాలని సూచించారు. వాహన పత్రాలు వెంట ఉంచుకోవాలని, మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని పేర్కొన్నారు.

# సిద్ధాంతమే పార్టీ బలం... క్యాడర్ బేస్డ్ పార్టీ బిజెపినే

**కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్**





గన్నేరువరం, ఏప్రిల్ 6(ది క్రైమ్ న్యూస్):కరీంనగర్ జిల్లా గన్నేరువరం మండలం గుండ్లపల్లిలో సోమవారం బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా నూతనంగా ఏర్పాటు చేసిన పార్టీ జెండా గద్దె ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరై జెండా గద్దెను ఆవిష్కరించి పార్టీ జెండాను ఎగరవేశారు. అనంతరం కేంద్ర మంత్రి మాట్లాడుతూ....నాడు ఇద్దరు ఎంపీలతో ప్రారంభమై ప్రపంచంలోనే అత్యధిక కార్యకర్తలను కలిగి,క్యాడర్ బేస్డ్ పార్టీగా వరుసగా 3సార్లు కేంద్రంలో అధికారంలో వచ్చి దేశాన్ని ఏలుతూ ఎంచుకున్న సిద్ధాంతం, బావాజాలంతో ప్రపంచంలోనే తిరుగులేని శక్తిగా బిజెపి అవతరించిందన్నారు. బీజేపీ అంత్యోదయ సిద్ధాంతం ఎంతో గొప్పదని,పార్టీ సిద్ధాంతకర్త పండిత్ దీన్ దయాల్ ఉపాధ్యాయ ఆకాంక్షించినట్టు అర్హులైన పేదలందరికీ సంక్షేమ ఫలాలు అందించాలనే సంకల్పంతో మోడీ ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. నేషన్ ఫస్ట్ పార్టీ నెక్స్ట్, సెల్ఫ్ లాస్ట్ నినాదంతో ఉన్న బిజెపిపై దేశ ప్రజలకున్న ఎనలేని విశ్వాసంతో వరుసగా మూడుసార్లు కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిందని,కేంద్ర పథకాలను ప్రజల్లోకి మరింతగా తీసుకెళ్లడానికి కృషి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలపై నిరంతరం పోరాటం చేయాలని కేంద్ర మంత్రి పిలుపునిచ్చారు. అనంతరం గన్నేరువరం మండలకేంద్రంలో బిజెపి మండలాధ్యక్షుడు తిప్పర్తి నిఖేష్ నాయకులతో కలిసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. బిజెపి జిల్లా అధ్యక్షుడు గంగాడు కృష్ణారెడ్డి, ప్రధాన కార్యదర్శి మాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వినుకొండ నాగేశ్వర్, కరివేద మైపాల్ రెడ్డి, పుల్లెల పవన్ కుమార్, సొల్లు అజయ్ వర్మ, ముత్యాల జగన్ రెడ్డి, సోమరాజు రెడ్డి, పకిడి మహేందర్, పుల్లల రాము, బొమ్మిడి సురేందర్ రెడ్డి, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# ఇకపై 'మన ఇసుక వాహనం' ద్వారానే ఇసుక బుకింగ్

**అదనపు కలెక్టర్ గడ్డం నగేష్**

ఇల్లంతకుంట, ఏప్రిల్6(ది క్రైమ్ న్యూస్):రాజన్న సిరిసిల్ల జిల్లాలో నిర్మాణదారులు ఇకనుండి ఇసుకను ఆన్‌లైన్ ద్వారానే బుకింగ్ చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వాదేశాల మేరకు సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్ రూపొందించిన 'మన ఇసుక వాహనం' వెబ్‌సైట్ ద్వారా బుకింగ్ ప్రక్రియ అత్యంత సులభంగా మారుతుందని పేర్కొన్నారు. నేరుగా కూపన్లిచ్చే విధానాన్ని ప్రభుత్వం రద్దు చేసిందని,జిల్లా కమిటీ ఆమోదించిన రీచ్‌ల నుండే ఇసుకను తరలించాలని సూచిస్తూ ఆన్‌లైన్ విధానంతో ఇసుక కేటాయింపు, రవాణాలో పూర్తి పారదర్శకత ఉంటుందని తెలిపారు. దీంతో అక్రమ రవాణాకు అడ్డుకట్ట పడటమే కాక మధ్యవర్తుల బెడద తప్పుతుందని,బుకింగ్ సమయంలో ఇందిరమ్మ ఇళ్లకి సంబంధిత అధికారి, సాధారణ గృహ నిర్మాణానికి పంచాయతీ కార్యదర్శి లేదా సంబంధిత అధికారి జారీ చేసిన అనుమతి పత్రాలు, ప్రభుత్వ పనులకై ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అనుమతి పత్రాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని, అప్‌లోడ్ చేసే పత్రాలు 200కెబి లోపు సైజులో, పిడిఎఫ్ లేదా జేపీజీ ఫార్మాట్‌లో ఉండాలన్నారు. వినియోగదారులకు ఎలాంటి సందేహాలున్నా లేదా సమాచారం కావాలన్నా ఫోన్ నంబర్లు: 040-23120421 / 8333923732, ఇమెయిల్:helpdesk.tsmiv@cgg.gov.లను సంప్రదించవచ్చని తెలిపి ప్రభుత్వం నిర్ణయించిన ధరకే ఇసుకను పొందేందుకు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వినియోగదారులను అదనపు కలెక్టర్ ప్రకటన ద్వారా కోరారు.




# సంపాదకీయం

## సహజవాయువు కోసం ఉద్యమించాల్సిందే !

పశ్చిమాసియా యుద్ధం వల్ల ఇంధనం, గ్యాస్ సమస్యలు తీవ్రం అవుతున్నాయి. ప్రధానంగా గ్యాస్ సమస్య తీవ్రత పెరుగుతోంది. ఈ యుద్ధం ఎప్పుడు ముగుస్తుందో తెలియడం లేదు. ట్రంప్ బెదరింపులు, హుంకరింపులతో సమస్య మరింత జటిలం అవుతోంది. ఇరాన్ కూడా తగ్గేది లేదన్నట్లుగా పోరాడుతోంది. అమెరికా యుద్ధ విమానాలను కూల్చేస్తోంది. 48 గంటల గడువు ముగిసిన వేళ, నియంత ట్రంప్ ఏ దుర్మార్గాలకు ఒడిగడతాడో తెలియడం లేదు. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ యుద్ధం నేపథ్యంలో రాష్ట్రం తీవ్ర గ్యాస్ కొరతను ఎదుర్కొంటోంది. సాధారణ ప్రజలు, చిరు వ్యాపారులు హోటల్ నిర్వాహకులు, తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అన్ని తినుబండారాల ధరలు పెరుగుతున్నాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల అనంతరం కేంద్ర ప్రభుత్వం పెట్రోలియం ఉత్పత్తుల ధరలు పెంచుతుందన్న ప్రచారం కూడా సాగుతోంది. అదే జరిగితే నిత్యావసరాల ధరలు మిన్నంటే ప్రమాదం వుంది. మరోవైపు సహజవాయువు కేటాయింపులు లేక రాష్ట్రంలో గ్యాస్ ఆధారిత విద్యుదుత్పత్తి కేంద్రాలు మూతబడిన దుస్థితి ఏర్పడింది. ఫలితంగా అధిక రేటుకు డిస్కంలు విద్యుత్ కొనాల్సివస్తోంది. ఈ క్రమంలో దేశీయంగా సమస్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఇప్పటికే గ్యాస్ కొరతతో ప్రజలు అగచాట్లు పడుతున్నారు. హోటల్ పరిశ్రమ కుదేలవుతోంది. కట్టెల పొయ్యి లతో కొన్నిచోట్ల నెట్టుకు వస్తున్నారు. విద్యుత్ స్టవ్‌ల ఉత్పత్తి పెరిగింది. అయితే తగినంత విద్యుత్ సరఫరా కూడా కష్టంగానే ఉంది. ఎండాకాలం కావడంతో అడపాదడపా కరెంట్ కష్టాలు మొదలు అయ్యాయి. ఈ క్రమంలో కృష్ణా-గోదావరి బేసిన్‌లో ఉత్పత్తి అయ్యే చమురు, సహజ వాయువు విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తగు నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇక్కడి సహజవాయువును గృహ, హోటల్ అవసరాలకు మళ్లించాలి. అప్పుడు డిమాండ్‌లో కనీసం 50శాతం అయినా అధిగమించగలం. ఒక రకంగా చెప్పాలంటే ఇది ఉభయ తెలుగు రాష్ట్రాల హక్కు. ఇక్కడి వనరులు వీరికే దక్కాలి. ఈ సహజవాయువులో కనీసం సగం ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించాలని సిపిఎం అధ్వర్యంలో వామపక్ష పార్టీలు, వివిధ ప్రజా సంఘాలు, సంస్థలకు చెందినవారు డిమాండ్ చేస్తున్నారు. వీరి డిమాండ్ కూడా న్యాయంగా ఉన్నదే. దాదాపు రెండు దశాబ్దాల క్రితం ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఇదే డిమాండ్‌తో జనవిజ్ఞాన వేదికవంటి వివిధ సంస్థలు అనేక రూపాల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు నిర్వహించాయి. అయితే ఆ తరువాత ఉమ్మడి రాష్ట్ర విభజన కోరుతూ ఆందోళనలు, ఇతరేతర కారణాలతో అది వెనక్కు వెళ్లింది. ఈ గ్యాస్ వల్ల ఎపి ఆర్థిక వ్యస్థ కూడా బలపడుతుంది. ప్రజల సమస్యలు తీరుతాయి. దీనిపై చంద్రబాబు పట్టుబట్టాల్సిన తరుణం ఇది. అయితే కార్పోరేట్ దిగ్గజాల చేతిలో ఉన్న ఈ వ్యవహారం విషయంలో చంద్రబాబు అంత తొందరగా నోరువిప్పుతారని అనుకోరాదు. డిప్యూటి సిఎం పవన్ కళ్యాణ్ కూడ రాష్ట్ర ప్రయోజనాలపై దృష్టి పెట్టాలి. ఇక్కడ లభించే గ్యాస్ ఇక్కడి ప్రజలకు సరఫరా చేస్తే... రాష్ట్ర ప్రజలకు ఎంతగానో ఉపయోగపడగలదు. రాష్ట్ర ప్రభుత్వ ఖజానాకు కూడా ఆదాయం సమకూరుతుంది. ఈ విషయంలో స్థానిక ప్రజలే ఉద్యమాలు చేపట్టాల్సి ఉంది. బ్లో అవుట్‌లతో బాధలు పడుతున్న ప్రజలు, గ్యాస్ వల్ల లాభాలు కూడా పొందాలి. మన గ్యాస్ మనకే అని ఉద్యమించాలి. ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన కృష్ణా-గోదావరి డి6 బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న సహజ వాయువును రోజుకు 21 వేల టన్నులు ఉత్పత్తి అవుతోందని అంచనా. రిలయన్స్ కంపెనీ పైపులైన్లు ద్వారా ఇక్కడ నుండి మహారాష్ట్ర, గుజరాత్‌కు గ్యాస్ సరఫరా చేసుకుని అక్కడ పరిశ్రమలు, ఇతర అవసరాలకు విక్రయించి వేల కోట్ల రూపాయల లాభాలు సంపాదిస్తోంది. ఆంధ్రప్రదేశ్‌లో వంట గ్యాస్ వినియోగం రోజుకు నాలుగు వేల టన్నులు. ఆయిల్ డ్రిల్లింగ్, ఇతర కార్యకలాపాలతో నిత్య కాలుష్యమేగాక బ్లో అవుట్‌లు, ఇతర ప్రమాదాల్లో రాష్ట్రం విలువైన ప్రాణాలను కోల్పోతున్నది. అత్యంత విలువైన సహజ వనరులను రాష్ట్రం కోల్పోతోంది. కనుక నష్టాలు రాష్ట్రానికి, లాభాలు రిలయన్స్‌కు చెందడం సరికాదు. ఇక్కడి సహజవాయువును కనీసం 50శాతం ఇక్కడి ప్రాంత ప్రజలకు కేటాయించిన తరవాతనే మిగతాది తరలించడం న్యాయం. మన తీరంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్ రాష్ట్రానికి కేటాయిస్తే కరెంటు కష్టాలు కూడా తగ్గుతాయి. కాబట్టి రాష్ట్రంలో లభించే ప్రకృతి వనరులను సరిగా వినియోగించు కుంటే ఇలాంటి ఇబ్బందులు రావు. రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే గ్యాస్‌లో మన వాటా మనకు వస్తే రూ.950 ఉన్న సిలిండర్ ధర రూ.300- 350కు, యూనిట్ కరెంటు రూపాయికి వచ్చే అవకాశం ఏర్పడుతుంది. పిఎన్‌జి ఇంకా తక్కువ ధరకే లభిస్తుంది. చమురు, సహజ వాయువు జాతీయ సంపద కనుక రాష్ట్రానికి ఇవ్వాల్సిన న్యాయమైన వాటా ఇచ్చి మిగిలినది ఇతర రాష్ట్రాలకు తీసుకెళితే ఎవరికీ అభ్యంతరం ఉండదు. మన సహజ వనరులను రిలయన్స్‌కు అప్పగించి, మనం ఇబ్బంది పడటం అన్యాయం. కెజి బేసిన్‌లో చట్టబద్ధంగా రావాల్సిన చమురు, సహజవాయువు వాటాను పొందేలా రాష్ట్ర ప్రభుత్వం కేంద్రంపై ఒత్తిడి తేవాలి. అవసరమైతే అసెంబ్లీ తీర్మానించాలి. ఈ విషయంలో అఖిలపక్షంలో చర్చించాలి. గతంలోకి వెళితే కృష్ణా-గోదావరి డి6 బేసిన్ ను రిలయన్స్ ఇండస్ట్రీస్‌కు 20 ఏళ్ల క్రితం అప్పుడున్న ప్రభుత్వాలు చట్టవిరుద్ధం గా కేటాయించాయి. భూగర్భ నిక్షేపాలను కనుగొన్నపుడు లభించే ఉత్పత్తుల్లో ఆయా కంపెనీలు కేంద్ర ప్రభుత్వానికి వాటాగా సరఫరా చేసే చమురు, సహజవాయువులో 50 శాతాన్ని సంబంధిత రాష్ట్రాలకు కేటాయించాలని 12వ ఆర్థిక సంఘం సిఫార్సు చేసింది. పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ కూడా ఈ విషయాన్ని గురించి పెట్రోలియం మంత్రిత్వ శాఖను నిలదీసింది. కనుక ఆంధ్రప్రదేశ్ సముద్ర తీరంలో ఉత్పత్తి అవుతున్న కృష్ణా-గోదావరి బేసిన్ సహజ వాయువులో సగం రాష్ట్ర అవసరాలకు కేటాయించడం కేంద్ర ప్రభుత్వ బాధ్యత. దీనిని చంద్రబాబు లేవనెత్తడం మంచిది. కేంద్రంలో అధికారం పంచుకుంటున్న చంద్రబాబు ఈ విషయంలో ఇప్పటికైనా డిమాండ్ ముందుకు తీసుకుని రావాలి. రాష్ట్రాలకు రాజ్యాంగ బద్ధంగా ఇవ్వాల్సిన నిధులను కేంద్ర ప్రభుత్వం ఎలాగూ ఇవ్వడం లేదు. విభజన సమస్యలు అలాగే ఉన్నాయి. అయితే చంద్రబాబు కోరిన వెంటనే ఇప్పుడు పనులు జరుగుతున్నాయి. అందువల్ల సహజ వాయువు విషయంలో ఒత్తిడి పెంచితే కేంద్రం దిగిరాక తప్పదు. ప్రజలు కూడా ఆందోళనలకు దిగితే తప్ప రాష్ట్రానికి చురుకు పుట్టదు.

# హర్మూజ్.. ఇరాన్ ట్రంప్ కార్డ్



2026 10:00 గాపీ మధ్యప్రాచ్య భౌగోళిక రాజకీయాల్లో అత్యంత కీలకమైన ప్రదేశాల్లో ఒకటి హర్మూజ్ జలసంధి. గల్ఫ్ ప్రాంతాన్ని ప్రపంచంతో కలిపే ఈ సన్నని సముద్ర మార్గం, కేవలం ఒక భౌగోళిక మార్గం మాత్రమే కాదు -ఇది ప్రపంచ ఆర్థిక వ్యవస్థను ప్రభావితం చేసే ఒక వ్యూహాత్మక కేంద్రం. ప్రపంచంలోని సముద్ర మార్గంద్వారా జరిగే ముడి చమురు రవాణాలో సుమారు ఇరవై శాతం ఈ జలసంధి ద్వారా జరుగుతుంది. ఈ నేపథ్యంలో హర్మూజ్ నియంత్రణ ఇరాన్‌కు ఒక శక్తివంతమైన భౌగోళిక ఆయుధంగా మారింది. ఇరాన్ భౌగోళికంగా హర్మూజ్ జలసంధికి సమీపంలో ఉన్నందున, ఈ ప్రాంతంలో దానికి సహజ ఆధిక్యం ఉంది. ఒకవైపు ఇరాన్ తీరప్రాంతం, మరోవైపు ఒమాన్ - ఈ రెండింటి మధ్య ఉన్న ఈ మార్గం అత్యంత సన్నని భాగంలో కేవలం 30-40 కిలోమీటర్ల వెడల్పు మాత్రమే ఉంటుంది. అంటే, ఈ ప్రాంతాన్ని పూర్తిగా పర్యవేక్షించడం, నియంత్రించడం సాధ్యమే. ఇదే అంశం ఇరాన్ వ్యూహానికి బలాన్నిస్తుంది. భద్రతా కెమెరాలు వార్తల ఆర్కైవ్స్ బ్రేకింగ్ న్యూస్ అలర్ట్స్ సంప్రదాయ నావికాదళ శక్తిపరంగా అమెరికా వంటి దేశాలతో పోలిస్తే ఇరాన్ వెనుకబడి ఉండొచ్చు. కానీ, ఇక్కడ కూడా ఇరాన్ తన ప్రత్యేకమైన అసిమెట్రిక్ వ్యూహాన్ని అనుసరిస్తోంది. పెద్ద యుద్ధ నౌకలతో ప్రత్యక్షంగా పోరాడే బదులుగా, చిన్న వేగవంతమైన పడవలు, సముద్ర మైన్స్, గెరిల్లా నావల్ టాక్టిక్స్‌ను వినియోగిస్తోంది. 'ఇది తక్కువ వనరులతో ఎక్కువ ప్రభావం' అనే సిద్ధాంతానికి అనుగుణంగా ఉంటుంది. ఇరాన్ నౌకాదళంలో ఉపయోగించే చిన్న పడవలు (ఫాస్ట్ ఎటాక్ క్రాఫట్స్) ఈ వ్యూహంలో కీలక పాత్ర పోషిస్తాయి. ఈ పడవలు వేగంగా కదలడం, అకస్మాత్తుగా దాడి చేయడం, వెంటనే తప్పించుకోవడం వంటి లక్షణాలను కలిగి ఉంటాయి. పెద్ద యుద్ధ నౌకలు ఈ రకమైన దాడులను సమర్థవంతంగా ఎదుర్కోవడం కష్టం. ఒకేసారి వందల సంఖ్యలో ఈ పడవలు దాడి చేస్తే, అది శత్రు నౌకాదళానికి పెద్ద సవాలుగా మారుతుంది. ఇంకా ఒక ముఖ్యమైన ఆయుధం - సముద్ర మైన్స్. హర్మూజ్ జలసంధి వంటి సన్నని ప్రాంతాల్లో మైన్స్ అమర్చడం ద్వారా నౌకాయానాన్ని పూర్తిగా నిలిపివేయవచ్చు. ఇది ప్రత్యక్ష యుద్ధం కాకుండా, ఆర్థిక వ్యవస్థపై దాడి చేసే మార్గంగా పనిచేస్తుంది. ఒక చిన్న మైన్ కూడా ఒక పెద్ద ఆయిల్ ట్యాంకర్‌ను దెబ్బతీయగలదు. దీంతో బీమా ఖర్చులు పెరగడం, రవాణా ఆలస్యం కావడం, చివరకు ఆయిల్ ధరలు పెరగడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటాయి. ఇరాన్ వ్యూహంలో మానసిక ఒత్తిడి కూడా కీలకం. హర్మూజ్ జలసంధిని మూసివేస్తామని తరచూ హెచ్చరికలు ఇవ్వడంద్వారా, ప్రపంచ మార్కెట్లలో అనిశ్చితిని సృష్టిస్తుంది. ఈ అనిశ్చితి చమురు ధరలను ప్రభావితం చేస్తుంది. అంటే, ఇరాన్ ప్రత్యక్ష చర్యలు తీసుకోకపోయినా, కేవలం హెచ్చరికల ద్వారానే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపగలదు. అయితే, ఈ వ్యూహానికి కూడా పరిమితులు ఉన్నాయి. హర్మూజ్ జలసంధిని పూర్తిగా మూసివేయడం అంటే, అంతర్జాతీయ స్థాయిలో తీవ్రమైన ప్రతిచర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ముఖ్యంగా అమెరికా నావికాదళం ఈ ప్రాంతంలో శక్తివంతంగా ఉంది. దీంతో విస్తృత స్థాయి యుద్ధానికి దారి తీసే ప్రమాదం ఉంది. ఇది ఇరాన్‌కే కాకుండా మొత్తం ప్రాంతానికి నష్టం కలిగించవచ్చు. ఇంకా ఒక ముఖ్యమైన అంశం -ఇరాన్ ఆర్థిక వ్యవస్థ కూడా ఆయిల్ ఎగుమతులపై ఆధారపడి ఉంటుంది. హర్మూజ్ జలసంధిని మూసివేస్తే, ఇరాన్ స్వంత ఎగుమతులు కూడా ప్రభావితమవుతాయి. అంటే, ఈ వ్యూహం ఒక ద్వంద్వ కత్తిలాంటిది. శత్రువులకు నష్టం కలిగించగలిగినంతగా, తనకూ నష్టం కలిగించే అవకాశం ఉంది. ట్రంప్ మలి జూదం అయినా, హర్మూజ్ జలసంధి ఇరాన్‌కు ఒక శక్తివంతమైన వ్యూహాత్మక లీవర్‌గా ఉంటుంది. ఇది కేవలం సైనిక సాధనం కాదు, ఒక ఆర్థిక ఒత్తిడి సాధనం కూడా. ప్రపంచ దేశాలు, ముఖ్యంగా చమురు దిగుమతులపై ఆధారపడిన దేశాలు, ఈ ప్రాంతంలో స్థిరత్వాన్ని అత్యంత ప్రాధాన్యంగా చూస్తాయి. ఈ నేపథ్యంలో, ఇరాన్‌కు ఒక చర్చా సాధనంగా (భార్గనింగ్ చిప్) కూడా ఇది ఉపయోగపడుతుంది. మొత్తానికి, హర్మూజ్ జలసంధి ఇరాన్ వ్యూహంలో ఒక కీలక స్థానం కలిగి ఉంది. చిన్న నావలు, మైన్స్, గెరిల్లా టాక్టిక్స్ వంటి అసిమెట్రిక్ విధానాలతో, ఇరాన్ తన పరిమిత వనరులను సమర్థవంతంగా వినియోగిస్తోంది. ఇది ఒక స్పష్టమైన సందేశాన్ని ఇస్తోంది. భౌగోళిక స్థానం కూడా ఒక శక్తివంతమైన ఆయుధం కావచ్చు. చివరగా, ఈ పరిస్థితి ప్రపంచానికి ఒక పాఠాన్ని నేర్పుతోంది. ఆర్థిక వ్యవస్థలు ఎంత గ్లోబలైజ్డ్ అయినా, అవి కొన్ని కీలక మార్గాలపై ఆధారపడి ఉంటాయి. ఆ మార్గాలు భౌగోళికంగా సున్నితమైన ప్రాంతాల్లో ఉంటే, అవి రాజకీయ ఆయుధాలుగా మారే అవకాశముంది. హర్మూజ్ జలసంధి దానికి ఒక ప్రత్యక్ష ఉదాహరణ. ఇరాన్ ఈ వాస్తవాన్ని తన వ్యూహంలో భాగం చేసుకున్నది. కానీ, ఈ వ్యూహం శాంతి, స్థిరత్వాన్ని కాపాడే దిశగా ఉపయోగించబడితేనే, అది ప్రపంచానికి మేలు చేస్తుంది.

## అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులు


### వెంటనే వారిని ఆదుకోవాలన్న మాజీమంత్రి వేముల

నిజామాబాద్,ఏప్రిల్6 : అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను వెంటనే ఆదుకోవాలని మాజీమంత్రి, ఎమ్మెల్యే వేముల ప్రశాంతరెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఇటీవల కురిసిన వడగండ్ల వానకు దెబ్బతిన్న పంటలను బీఆర్ఎస్ నాయకులు పరిశీలించారు. వరి, అరటి, మామిడి పంటలు దెబ్బతిన్నాయని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం రైతుల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నట్లు చెబుతున్నా.. ఎక్కడా అలాంటి కార్యక్రమాలు లేవని విమర్శించారు. వర్షాలకాలంలో సైతం పంట నష్టం జరిగినా, వివరాలు సేకరించినా ఇంతవరకూ ఒక్క రూపాయి కేటాయించలేదని మండిపడ్డారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా పంటలకు నష్టం జరిగినా పట్టించుకోకపోవడం శోచనీయమన్నారు. వడగండ్ల వాన కారణంగా తీవ్రంగా పంట నష్టం జరిగినా, ఇప్పటి వరకు కలెక్టర్ గాని, సంబంధిత అధికారులు గాని స్పందించలేకపోయారని పేర్కొన్నారు. వెంటనే స్పందించి రైతులను ఆదుకునేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఉమ్మడి జిల్లాలో వడగండ్ల వాన బీభత్సం సృష్టించింది. ఇటీవల వడగండ్ల వానకు జిల్లాలోని సాలూరా, ధర్పల్లి, నిజామాబాద్ రూరల్, సిరికొండ, కామారెడ్డి జిల్లా బీర్కూర్ తదితర మండలాల్లో వరి, మక్కజొన్న, అరటి పంటలు దెబ్బతిన్నాయి. పంట చేతికొచ్చే సమయంలో అకాల వర్షం రైతులకు తీవ్ర నష్టాన్ని మిగిల్చింది. కూరగాయలు దెబ్బతినగా, మామిడి కాయలు రాలిపోయాయి. సాలూరా మండలంలోని ఖాజాపూర్, హున్సా, మందర్న, ధర్పల్లి మండలంలోని ప్రాజెక్టు రామడ్గు, దమ్మన్నపేట్, గోవింద్‌పల్లి, కేశారం, ధర్పల్లి, బెలియతండా, సిరికొండ మండలంలోని తాటిపల్లి, పెద్దవాల్గోట్, పందిమడుగు, కొండూర్, చీమన్‌పల్లీ, జినిగ్యాల తదితర గ్రామాల్లో పంటలు దెబ్బతిని రైతులను కోలుకోలేని దెబ్బతీసింది. ఆరుగాలం కష్టపడి చేతికి వచ్చిన పంట కండ్ల ముందే రాలిపోతుంటే ఏం చేయాలో దిక్కుతోచని స్థితిలో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు. ధర్పల్లి మండల కేంద్రంలోని ఇందల్వాయి రోడ్డు, దమ్మన్నపేట్ రోడ్డులో అడ్డంగా చెట్లు నేలకూలాయి. ధర్పల్లి, సిరికొండ మండలాల్లో విద్యుత్ స్తంభాలు విరిగిపడిపోయాయి. కల్లాల్లో ఆరబెట్టిన ధాన్యం తడిసిపోయింది. నిజామాబాద్ రూరల్ మండలంలోని మాధవనగర్‌లో రామసాని కామయ్యకు చెందిన ఐదు గేదెలు విద్యు త్‌షా క్‌తో మృత్యువాత పడ్డాయి. ఈదురుగాలులకు ఓ చెట్టు కూలి విద్యుత్ స్తంభంపై పడింది. దీంతో స్తంభం విరిగి విద్యుత్ తీగలు తెగి ఇంటి వద్ద కట్టేసి ఉంచిన ఐదు గేదెలపై పడడంతో అవి అక్కడికక్కడే మృతిచెందాయి.

## ఒంటిమిట్టలో ముగిసిన బ్రహ్మోత్సవాలు

### వైభవంగా పుష్పయాగం నిర్వహణ

ఒంటిమిట్ట,ఏప్రిల్6 : ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామివారి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ముంగింపుదశకు చేరుకున్నాయి. ఇందులో భాగంగా నిర్వహించిన పుష్పయాగం అత్యంత వైభవంగా సాగింది. ఆదివారం సాయంత్రం పుష్పయాగ మహోత్సవం భక్తి భరితంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాతంతో స్వామివారిని మేల్కొలిపి, ఆలయ శుద్ధి, నిత్యారాధనలు నిర్వహించారు. సాయంత్రం 6 గంటలకు పుష్పయాగం వైభవంగా ప్రారంభమైంది. తులసీదళాలు, మల్లెలు, రోజాలు, చామంతులు, గన్నేరు, సంపంగి, మొగలి దళం వంటి పుష్పాలు, పత్రాలతో స్వామి, అమ్మవారికి పుష్పనీరాజనం సమర్పించారు. ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, కర్ణాటక రాష్ట్రాల నుండి సుమారు 3 టన్నుల పుష్పాలు విరాళంగా అందాయి. ప్రకృతి వైపరీత్యాలు తొలగి భక్తులు సుఖశాంతులతో ఉండాలని ప్రార్థిస్తూ, భూమాతను ప్రసన్నం చేసుకునేందుకు పుష్పయాగం నిర్వహిస్తారు. అలాగే నిత్యకైంకర్యాలలో తెలియక జరిగిన లోపాలకు ప్రాయశ్చిత్తంగా ఈ యాగాన్ని చేస్తారని అర్చకులు తెలిపారు. ఈ యాగం ద్వారా దోషాలు తొలగి శుభఫలితాలు కలుగుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో టిటిడి బోర్డు సభ్యులు సదాశివ రావు, డిప్యూటీ ఈవో ప్రశాంతి, గార్డెన్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ నవీన్, ఆలయ అర్చకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.




## అమెరికా రెస్క్యూ ఆపరేషన్ సాహసోపేతం

### ట్రంప్‌కు నెతన్యాహు ప్రశంసలు

న్యూఢిల్లీ,ఏప్రిల్6 : పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం నెలకొన్న వేళ, అమెరికా చేపట్టిన సాహసోపేతమైన రెస్క్యూ ఆపరేషన్‌పై అంతర్జాతీయంగా ప్రశంసలు వ్యక్తమవుతున్నాయి. ప్రమాదంలో చిక్కుకున్న అమెరికాకు చెందిన ఎఫ్-15 యుద్ధ విమాన సిబ్బందిని సురక్షితంగా కాపాడిన తీరును ఇజ్రాయెల్ ప్రధాని బెంజిమిన్ నెతన్యాహు కొనియాడారు. ఇరాన్ సరిహద్దుల సమీపంలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న సమయంలో, సాంకేతిక కారణాల వల్ల లేదా శత్రు దాడుల వల్ల అమెరికాకు చెందిన ఒక ఎఫ్-15 యుద్ధ విమానం ప్రమాదానికి గురైంది. అయితే, అత్యంత క్లిష్ట పరిస్థితుల్లో అమెరికా సైన్యం మెరుపు వేగంతో స్పందించి, ఇరాన్ గగనతలాన శోధించి ఆ విమానంలోని సిబ్బందిని ప్రాణాలతో కాపాడిన సంగతి తెలిసిందే. ఈ విజయంపై నెతన్యాహు స్పందిస్తూ.. ఇది అమెరికా సైనిక సామర్థ్యానికి, అధ్యక్షుడు ట్రంప్ దృఢ నిశ్చయానికి నిదర్శనమని పేర్కొన్నారు. 'అమెరికన్ మిషన్ అత్యంత కచ్చితత్వంతో జరిగింది. పైలట్లను సురక్షితంగా తీసుకురావడంలో చూపిన ప్రతిభ అసాధారణం' అని ఆయన ప్రశంసించారు. ఈ క్లిష్ట సమయంలో అమెరికాకు ఇజ్రాయెల్ అండగా ఉంటుందని ఆయన పునరుద్ఘాటించారు.

## సత్యానిష్ఠే.. ఏకైక మార్గం

'భావనమే' జీవనం. జీవ దేహం కేవలం ఒక ఉపకరణం. ఇంద్రియ గ్రహణం, ప్రజ్ఞ, ఉద్వేగాలు, అభ్యాసం, అస్తిత్వరూపం, నిర్ణయాలు, పట్టుదల, అనుభూతి విస్తృతి.. అన్నీ భావప్రపంచమే. అయితే .. ఈ భావప్రపంచం సత్య, శాంత, స్పష్ట సమర్థతతో, సుసంస్కారంతో సాగాలంటే.. శరీరం సంతులిత సమర్థతతో పనిచేస్తూ ఆరోగ్యంగా ఉండటం అత్యవసరం. కానీ, తగినంత ఆరోగ్యంగా ఉన్నవారిలో కూడా చాలావరకు భావప్రపంచం సమర్థతతో పనిచేయకపోవడం కీలకమైన సమస్య. అందులోనూ అధికారం, ధనం, విద్య (మేధస్సు) ఉన్నవారిలో ఈ దోషం ఉండటం సమాజానికి ప్రబలమైన సమస్య. భావప్రపంచాన్ని సంస్కార బలంతో నడుపగలిగింది సదా 'సత్యనిష్ఠ'. సత్యజీవనం.. విద్య. అసత్య జీవనం.. అవిద్య. దైనందిన మానవ జీవనం సత్యాసత్యాల 'మిశ్రమం'. 'సమానతా భావమయమైన' సరళ జీవనం, సమష్టి శాంతి, నిర్భయత, ఆరోగ్యం, కృషి, పరస్పర ఆదరణ, ఆధ్యాత్మిక సాధన, సంతృప్తి, ఆనందా నుభవం ఇవన్నీ అనివార్యంగా సత్యాన్ని ఆశ్రయించి సాగుతుంటాయి. 'ఆధిక్యతాభావమయమైన' సంపద్గత జీవనం, కాంక్ష , ప్రకృతిశోషణ, ఘర్షణ, హననం, ఆక్రమణ, ప్రాణ నష్టం, భయం ఇవి అసత్యాన్ని ఆశ్రయించి సాగుతాయి. మానవ 'జీవితాన్ని శాసించవలసిన సత్యాలు.



ఆధ్యాత్మికం

# అర్హులైన బాలికలకు పూర్తి స్థాయిలో
# హెచ్.పి.వి వ్యాక్సినేషన్ అందించాలి

**- జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష**

**శాఖల సమన్వయంతో లక్ష్యాలను సాధించాలి**

**హెచ్.పి.వీ వ్యాక్సినేషన్ పై సమన్వయ సమావేశం**



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : అర్హులైన బాలికలకు పూర్తి స్థాయిలో హెచ్.పి.వి (హ్యూం) వ్యాక్సినేషన్ అందించాలి అని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష పేర్కొన్నారు. సమీకృత జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష హెచ్.పి.వీ వ్యాక్సినేషన్ కార్యక్రమంపై సంబంధిత శాఖల అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించి పలు సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో హెచ్.పి.వీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని తెలిపారు. 14 నుండి 15 సంవత్సరాల మధ్య ఉన్న బాలికలకు హెచ్.పి.వీ టీకా అందించడం ద్వారా గర్భాశయ ముఖ క్యాన్సర్‌ను నివారించే అవకాశం ఉందని పేర్కొన్నారు. జిల్లాలోని పెద్దపల్లి జిల్లా ఆసుపత్రి, గోదావరిఖని జనరల్ ఆసుపత్రి, మంథని ఆసుపత్రి, సుల్తానాబాద్ సీహెచ్‌సీతో పాటు అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ప్రతి రోజూ ఉదయం 9.30 నుండి మధ్యాహ్నం 1.00 గంటల వరకు వ్యాక్సినేషన్ అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రభుత్వ మరియు ప్రైవేట్ పాఠశాలల్లో 9వ తరగతి చదువుతున్న, 14 సంవత్సరాలు పూర్తి చేసుకుని 15వ సంవత్సరంలోకి ప్రవేశించిన బాలికలందరూ తమ తల్లిదండ్రులతో సమీపంలోని ఆరోగ్య కేంద్రాలకు వెళ్లి తప్పనిసరిగా హెచ్.పి.వీ టీకా తీసుకునేలా మండల విద్యాశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. బాలికల తల్లిదండ్రుల సమ్మతితోనే టీకా వేయడం జరుగుతుందని, టీకా అనంతరం అరగంట పాటు పరిశీలించిన తర్వాతే పంపించడం జరుగుతుందని తెలిపారు. ఈ వ్యాక్సిన్ సురక్షితమైందని, ఎటువంటి ఇబ్బందులు ఉండవని స్పష్టం చేశారు. జిల్లా వ్యాప్తంగా అర్హులైన బాలికలందరికీ వ్యాక్సినేషన్ అందించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇక వేడి తరంగాల (హీట్ వేవ్) నేపథ్యంలో ప్రజలు అవసరం ఉన్నప్పుడే బయటకు రావాలని, అనవసర ప్రయాణాలను నివారించాలని కలెక్టర్ సూచించారు. తగినంతగా నీరు తాగుతూ శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచుకోవాలని, పత్తి (కాటన్) దుస్తులు ధరించాలని తెలిపారు. అలాగే రాబోయే వర్షాకాలంలో డెంగ్యూ కేసులు తగ్గించే దిశగా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. రోడ్లపై నీరు నిల్వ ఉండకుండా చూడాలని, దోమల పెరుగుదలకు అవకాశం లేకుండా అవసరమైన కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేసి అమలు చేయాలని సూచించారు. హెచ్.పి.వీ టీకా వల్ల కలిగే ప్రయోజనాలపై తల్లిదండ్రులకు విస్తృతంగా అవగాహన కల్పించి, అధిక సంఖ్యలో బాలికలు టీకా తీసుకునేలా చూడాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్, జడ్పీ సీఈవో నరేందర్, గ్రామీణ అభివృద్ధి అధికారి కాళిందిని, విద్యాశాఖ అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా జర్నలిస్ట్ గండి రంజిత్ కుమార్ జన్మదిన వేడుకలు..





జమ్మికుంట ఏప్రిల్ 6 (ది క్రైమ్ న్యూ) : జమ్మికుంట సిటీ కేబుల్ కెమెరామెన్ సాక్షి టీవీ జర్నలిస్ట్ గండి రంజిత్ కుమార్ జన్మదిన వేడుకలను జమ్మికుంట మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ కౌన్సిలర్ల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఛాంబర్ లో శాలువాతో సన్మానించి స్వీట్లు పంపిణీ చేశారు. అదేవిధంగా బిజెపి నాయకులు రంజిత్ కుమార్ జన్మదిన వేడుకల సందర్భంగా కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ప్రశాంత్ కుమార్ మాట్లాడుతూ జమ్మికుంట మండల కేంద్రంలోని ప్రజల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి సమస్యలను తనదైన శైలిలో చిత్రీకరించి అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకుని వెళ్లి ఆ సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్న రంజిత్ కుమార్ ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు. స్థానికంగా ఉన్న సమస్యలను కూడా మున్సిపల్ దృష్టికి తీసుకొని రావాలని వాటిని పరిష్కరించే దిశగా చర్యలు చేపడతామని పేర్కొన్నారు.

## ఏకే ఫౌండేషన్ చైర్మన్ అనిల్ కుమార్ హాజరుతో ఘనంగా పెళ్లి వేడుక





నల్గొండ జిల్లా ప్రతినిధి/ ది క్రైమ్ న్యూస్ : ఏప్రిల్:06 నల్గొండ జిల్లా నాగార్జున సాగర్ నియోజకవర్గం శుభమ్ ఫంక్షన్ హాల్, అల్వాల ఎక్స్ రోడ్డు తిరుమలగిరిసాగర్ మండలం గోడుమడక గ్రామ వాస్తవ్యులు బూడిద చిన్న పెద్దిరాజు యాదవ్ -యల్లమ్మ కుమారుడు బూడిద దశరథ సోదరుడు చి“రాంబాబు చి”అక్మిత వివాహ మహోత్సవం లో పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించిన ఏ కే ఫౌండేషన్ చైర్మన్, హైకోర్టు న్యాయవాది కట్టెబోయిన అనిల్ కుమార్ ఈ కార్యక్రమంలో గోడుమడక సర్పంచ్ అంగోతు మాన్ సింగ్, నేనావత్ శ్రీను నాయక్, ఉపసర్పంచ్ బూడిద పాండు యాదవ్, మాజీ సర్పంచ్ బూడిద కొండల్ యాదవ్,తిమ్మాయిపాలెం సర్పంచ్ శౌరి నాయక్, బూడిద దశరథ,బూడిద పుష్పారాజ్ యాదవ్ , నవీన్ యాదవ్, వెంకటేశ్వర్లు, మేకల కొండల్ యాదవ్, అనిల్, మహేష్,బూయ రామంజనేయులు, బూడిద మోహన్ రాజ్, కోరట్ల శ్రీను ముదిరాజ్ గ్రామ పెద్దలు మరియు యువత తదితరులు పాల్గొన్నారు

## నేడే జివి సారు పుట్టినరోజు....

**వేడుకలకు పార్టీ శ్రేణులు హజరుకావాలే: శాతరాజు యాదగిరి**

మానకొండూర్, ఎప్రిల్ 6(ది క్రైమ్ న్యూస్): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలకేంద్రంలోని బిఆర్ఎస్ కార్యాలయంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు జివి రామకృష్ణారావు పుట్టిన రోజు వేడుకలను నేడు నిర్వహిస్తున్నట్లు బిఆర్ఎస్ నియోజకవర్గ అధికార ప్రతినిధి శాతరాజు యాదగిరి ఒక ప్రకటనలో తెలిపారు.అని గ్రామాల పార్టీ సర్పంచులు, ఉపసర్పంచులు, పార్టీ కార్యకర్తలు ముఖ్య నాయకులు ఉదయం 11గంటలకు కార్యక్రమంలో పాల్గొని వేడుకలను విజయవంతం చేయాల్సిందిగా యాదగిరి ప్రకటన ద్వారా కోరారు.

## ఉద్యమకారుల గౌరవం కాపాడిన ఎమ్మెల్యే జైవీర్ రెడ్డి కృతజ్ఞతలతో సత్కారం



నల్గొండ జిల్లా ప్రతినిధి/ ది క్రైమ్ న్యూస్ : ఏప్రిల్:06 నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్ నియోజకవర్గశీ తెలంగాణ మలిదశ ఉద్యమకారులపై తెలంగాణ మలిదశ ఉద్యమ కాలంలో నమోదైన రౌడీ షీట్లను ఇటీవల రద్దు చేసినందుకు స్థానిక నాగార్జునసాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే కుందూరు జైవీర్ రెడ్డి ని ఈరోజు(6-4-2026) వారి నివాసంలో వ్యక్తిగతంగా కలిసి శాలువా, పూలమాల తో వారిని సత్కరించి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలియజేసిన తెలంగాణ మలిదశ ఉద్యమకారులు అదేవిధంగా గత సాధారణ ఎన్నికలలో ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అయినా 250 గజాల ఇంటిస్థలం, ఉద్యమకారుల గుర్తింపు కార్డు ఉద్యమకారులకు పింఛన్ మంజూరు లను కూడా వీలైనంత తొందరగా ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి ఉద్యమకారులకు మరింత చేయూతని ఇవ్వాల్సిందిగా కోరడం జరిగింది ఈ విషయంపై సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్యే ఈ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి వీలైనంత తొందరలో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానన్నారు ఈరోజు ఎమ్మెల్యేని కలిసిన తెలంగాణ మలిదశ ఉద్యమకారులు వర్ర వెంకటరెడ్డి, గోపిశెట్టి నరసింహ, కమతం జగదీశ్వర్ రెడ్డి, వాసికర్ల వినయ్ రెడ్డి, ఎడారి రాము, వద్ది రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, గుంటుక మధుసూదన్ రెడ్డి, రావులపాటి ఎల్లయ్య, కోనేటి శ్రీనివాస్, వర్ర రామకృష్ణారెడ్డి,సయ్యద్ జావీద్ పాల్గొన్నారు

## ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలి: సుంకరి సంపత్



తిమ్మాపూర్, ఎప్రిల్ 6(ది క్రైమ్ న్యూస్):కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం పోరండ్లకు చెందిన సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకరి సంపత్ డివిజన్-2 ఇరిగేషన్ అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కు వినతిపత్రాన్ని అందజేశారు. ఇరిగేషన్ శాఖ డివిజన్ -2 పరిధిలోని ఎల్ -4 కెనాల్ కు లింకున్న సబ్ కేనాల్ నా-14 ద్వారా పోరండ్లలో సుమారు 200- 300 ఎకరాలకున్న ఆయకట్టుకు గతేడాది నీళ్ళు రావడంతో రైతులందరూ పంట వేసుకున్నారన్నారు. ఈసారి కూడా నీళ్ళు వస్తాయని ఆశతో సుమారు రెండు వందల పైచిలుకు ఎకరాల్లో 60 - 70 మంది రైతులు వరి, మొక్కజొన్న సాగు చేయగా డిసెంబర్ వరకు నీళ్ళు విడుదల చేసిన అధికారులు తరువాత విడుదల చేయడం లేదన్నారు. సంబంధిత డీఈ, ఈఈకి వినతి పత్రాలు ఇచ్చినా ఫీల్డ్ మీద సందర్శన చేసి సరిపడా నీళ్లు విడుదల చేయకుండా అధికారులు నిర్లక్ష్యం వ్యవహరించడంతో పోరండ్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనలకు విరుద్ధంగా అనేకమంది అక్రమ దారులు ఇరిగేషన్ అధికారుల ప్రోత్బలంతో కెనాల్ కు గండిపెట్టి నీటి చౌరర్యానికి పాల్పడుతుండగా చివరి ఆయకట్టులో ఉన్న పోరండ్ల రైతుల పంటలు తీవ్రంగా ఎండిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు.గతంలో కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను అధికారులు నిర్లక్ష్యం చేయడం వల్లే గ్రామానికి నీళ్లు రావడం లేదని తక్షణమే ఇరిగేషన్ డిఈ సదాశివతో మాట్లాడి కెనాల్ చివరి ఆయకట్టు వరకు నీరందేలా పర్యవేక్షించాల్సిందిగా ఆదేశించాలని కలెక్టర్ ను కోరుతూ అధికారులు సమస్యను పరిష్కరించకుంటే రైతాంగం అంతా ఐక్యంగా నీరచ్చేంత వరకు పోరాడుతామని డిమాండ్ చేశారు. గ్రామ రైతులు ఆశోద రాజు కాంగ్రెస్ నాయకులు సింగిరెడ్డి జనార్దన్ రెడ్డి, విజయేందర్ తదితరులు కలెక్టర్ కు వినతిపత్రం అందజేసిన వారిలో ఉన్నారు.

## ఘనంగా చిరుతల రామాయణం సాంస్కృతిక ప్రదర్శన

కరీంనగర్ టౌన్, ఏప్రిల్6(ది క్రైమ్ న్యూస్) అపర భద్రాద్రి ఇల్లంతకుంట సీతారామచంద్రస్వామి దేవస్థానం ఆధ్వర్యంలో



చిరుతల రామాయణం సాంస్కృతిక ప్రదర్శన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. తెలంగాణ రంగస్థలం కళాకారుల అసోసియేషన్ జిల్లా శాఖ , ఇల్లంతకుంట, జమ్మికుంట మండల శాఖ , గురువు కోదూరు తిరుపతి ,తెలంగాణ రంగస్థలం అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి అలివేలు సమ్మిరెడ్డి పర్యవేక్షణలో ఏర్పాటుచేసిన చిరుతల రామాయణ కార్యక్రమం మల్యాల గ్రామ కళాకారులచే గత మూడు రోజులుగా అంగరంగ వైభవంగా కన్నుల పండుగ నిర్వహించారు. చివరి రోజు ఆహ్లాదకరంగా ఆంజనేయుడు లంకకు బయలుదేరా సన్నివేశాలతో రావణువధ జరిగే సన్నివేశం వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగస్థలం కళాకారుల అసోసియేషన్ జిల్లా కోశాధికారి నలగోని రమేష్, శంకరపట్నం మండల అధ్యక్షుడు దొంగల రాజయ్య, ఇల్లంతకుంట మండల అధ్యక్షులు కోదూరు రవీందర్, వివిధ గ్రామాల కళాకారులు పాల్గొన్నారు.

## నేడు వరంగల్ టీజీఎన్పీడీసిఎల్ కార్యాలయం ముట్టడి....

పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : తెలంగాణ రాష్ట్ర విద్యుత్ ఆర్టిజన్, ఆన్ మ్యాన్, పీస్ రేటు మీటర్ రీడర్స్ జెయింట్ జేఏసీ ఆధ్వర్యంలో వరంగల్ టీజీఎన్పీడీసిఎల్ కార్యాలయం ముట్టడికి తరలిరావాలని తెలంగాణ విద్యుత్ ఆర్టిజన్ ఎంప్లాయిస్ జేఏసీ జిల్లా చైర్మన్ మల్ల కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. పెద్దపల్లి జిల్లా నుండి పెద్ద ఎత్తున కార్మికులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. డిమాండ్ల సాధనకు ఆర్టిజన్, ఆన్ మ్యాన్, పీస్ రేట్, మీటర్ రీడింగ్ కార్మికులు కదం తొక్కాలని విజ్ఞప్తి చేశారు.


## పంట నష్టం అంచనా వేసి నష్ట పరిహారం చెల్లించండి

**జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేసిన జాతీయ బీసీ సంఘం నేషనల్ కోఆర్డినేటర్ ఆకుల స్వామి వివేక్ పటేల్**



పెద్దపల్లి ప్రతినిధి (ది క్రైమ్ న్యూస్) : ఇటీవల కురిసిన అకాల వర్షం,ఈదురుగాలతో పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జాతీయ బిసి సంఘం నేషనల్ కోఆర్డినేటర్ స్వామి డిమాండ్ చేశారు. సోమవారం ప్రజావాణిలో కలెక్టర్ కోయ శ్రీహర్షకి రైతులను ఆదుకోవాలని వినతిపత్రం అందించారు. వ్యవసాయ అధికారులతో వెంటనే మండలాల్లో పంట నష్టాన్ని అంచనా వేసి సమగ్ర నివేదికను ప్రభుత్వానికి అందించి, రైతులకు నష్టపరిహారం అందించాలని విజ్ఞప్తి చేశారు. చేతికొచ్చిన పంట కళ్ళముందే రాలిపోతుంటే ఏం చేయాలో దిక్కు తోచని స్థితిలో రైతన్నలు కన్నీరు మున్నీరవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కోతకు సిద్ధంగా ఉన్న వరి, మక్కజొన్న, పప్పుధాన్యాలు నేలకూలిపోవడం, తడిసిపోవడం, మామిడి రాలిపోవడం వల్ల రైతులు తీవ్ర ఆర్థిక నష్టపోయారని, ముఖ్యంగా మిర్చి, పత్తి వంటి వాణిజ్య పంటలు నాణ్యత కోల్పోయి రైతులు నష్టపోయారని కలెక్టర్ కి వివరించారు. ప్రధానంగా కాల్వ శ్రీరాంపూర్ మండలంలో దాదాపుగా 1000 ఎకరాలకు మొక్కజొన్న పంటకు నష్టం వాటిల్లిందని, నష్టపరిహారం క్రింద రూ.40 వేల రూపాయలు ప్రభుత్వం తరపున అందజేయాలన్నారు.

## చెరువులోకి దూకి యువకుడి ఆత్మాహత్య



బెజ్జంకి, ఎప్రిల్ 6(ది క్రైమ్ న్యూస్) : సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండలం వీరాపూర్లో మెరుగు భాగ్యరెడ్డి(35) అనే వ్యక్తి సోమవారం చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతదేహాన్ని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా ఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించారు. పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించి ఘటనపై కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ బోయిని సౌజన్య తెలిపారు.

## అంగన్వాడీలో బాలింతలకు పౌష్టికాహారం పంపిణీ



బెజ్జంకి, ఎప్రిల్ 6(ది క్రైమ్ న్యూస్) : సిద్ధిపేట జిల్లా బెజ్జంకి మండలకేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో గర్భిణీలు, బాలింతలకు సోమవారం పౌష్టికాహారం పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. సర్పంచ్ బొల్లం శ్రీధర్, వార్డు సభ్యుడు లింగాల శ్రీనివాస్ హాజరై లబ్ధిదారులకు గుడ్లు,బాలామృతం అందజేశారు. సర్పంచ్ మాట్లాడుతూ... గర్భిణీలు, బాలింతలు ప్రభుత్వం అందించే పౌష్టికాహారాన్ని క్రమం తప్పకుండా వినియోగించుకోవాలని సూచించారు. వాటితో ఆరోగ్యంగా ఉండడమే కాక శిశువుల అభివృద్ధికి ఉపయోగపడుతుందని, చిన్నారుల బరువు,ఎత్తును క్రమం తప్పకుండా చూసేందుకు వారి ఆరోగ్యంపై తల్లిదండ్రులు శ్రద్ధ వహించాలని సూచించారు. అంగన్వాడీ టీచర్ కనకలక్ష్మి, మహిళలు,గ్రామస్తులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## ప్రజారోగ్యంపై వాకథాన్

**జెండా ఊపిన మంత్రి దామోదర**

హైదరాబాద్,ఏప్రిల్ 6 : శారీరకంగా ఆరోగ్యంగా ఉంటేనే మానసికంగా దృఢంగా ఉండగలమని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనరసింహ అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా ప్రభుత్వం ఆరోగ్య వారోత్సవాలను నిర్వహిస్తోంది. ఈ మేరకు పీవీ మార్గ్ జలవిహార్ నుంచి హెచ్ఎండీఏ గ్రౌండ్స్ వరకు ఏర్పాటు చేసిన వాకథాన్‌ను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు.

## బిజెపి సెంట్రల్ జోన్ ఆధ్వర్యంలో ఘనంగా పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు...



కరీంనగర్ టౌన్, ఏప్రిల్6(ది క్రైమ్ న్యూస్)భారతీయ జనతా పార్టీ కరీంనగర్ సెంట్రల్ జోన్ కన్వీనర్ తణుకు సాయి కృష్ణ ఆధ్వర్యంలో సోమవారం రోజున కరీంనగర్ లోని టవర్ సర్కిల్ లో 47వ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జోన్ కన్వీనర్ తణుకు సాయి కృష్ణ ఈ సందర్భంగా పార్టీ జెండాను ఆవిష్కరించి, స్వీట్లు పంపిణీ చేసి మాట్లాడారు.కరీంనగర్ సెంట్రల్ జోన్ లోని బిజెపి రాష్ట్ర, జిల్లా జోన్ నాయకులు, కార్యకర్తలకు, ప్రజా ప్రతినిధులకు , బిజెపి కుటుంబ సభ్యులందరికీ భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలియజేస్తున్నట్టు చెప్పారు. 1980 ఏప్రిల్ 06 తేదీన అటల్ బీహార్ వాజ్ పాయ్ నేతృత్వంలో ఏర్పడిన బిజెపి దేశభక్తి, జాతీయవాదము, ఏకాత్మత మానవతావాదము, అంత్యోదయ మార్గంలో ప్రయాణిస్తుందన్నారు.. దేశభక్తి, జాతీయభావము కలిగిన కార్యకర్తలు బిజెపిలోనే ఉంటారని తెలిపారు. భారతీయ జనతా పార్టీ కార్యకర్తలు, నాయకులు రాజకీయ విలువలతో పాటు, సామాజిక స్పృహ సేవా తత్పరత కలిగి , పార్టీని మరింత బలోపేతం చేయడానికి కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ నగరపాలక సంస్థ మాజీ డిప్యూటీ మేయర్ గుగ్గిళ్ళపు రమేష్ ,బిజెపి జిల్లా ఉపాధ్యక్షులు కళ్లెం వాసుదేవ రెడ్డి, 66వ డివిజన్ కార్పొరేటర్ వంగల పవన్, కే పీ చంద్ర, గొట్టేముక్కుల ఉమారాణి ,తాటి ప్రభావతి, జిల్లా కోశాధికారి వైద రామానుజం నాయకులు లడ్డు ముందడ, పుప్పాల రఘు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడి టీచర్లు, హెల్పర్లకు, హాస్టళ్ల ఆహార సిబ్బందికి ప్రత్యేక శిక్షణ



భూపాలపల్లి, ఏప్రిల్6 : (ది క్రైమ్ న్యూస్) : సోమవారం భూపాలపల్లి ఐడీఓసీ కార్యాలయంలో బీసీ, ఎస్సీ, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లలో పనిచేస్తున్న ఆహార నిర్వహణ సిబ్బందికి మరియు ఐసిడిఎస్ అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్లకు ప్రత్యేక శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మొత్తం 150 మంది పాల్గొన్నారని ఫుడ్ ఇన్స్పెక్టర్ వరుణ్ రెడ్డి తెలిపారు. శిక్షణలో ఆహార భద్రత ప్రమాణాలు, పరిశుభ్రత, పోషకాహారం ప్రాముఖ్యత, ఆహార పదార్థాల సురక్షిత నిల్వ విధానాలు, వంట సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై విస్తృతంగా అవగాహన కల్పించబడింది. పిల్లలు మరియు విద్యార్థులకు అందించే ఆహారం నాణ్యతను మెరుగుపరచడం, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని ఏర్పరచడం ఈ శిక్షణ యొక్క ముఖ్య ఉద్దేశ్యంగా పేర్కొన్నారు. అదేవిధంగా, భూపాలపల్లి ఐడీఓసీ వద్ద ఐసిడిఎస్ అంగన్‌వాడీ కేంద్రాలకు రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లు కూడా పంపిణీ చేయబడినవి. ఈ సర్టిఫికెట్ల ద్వారా కేంద్రాల కార్యకలాపాలు మరింత సమర్థవంతంగా నిర్వహించబడేలా సహకారం అందుతుందని తెలిపారు. ఈ సందర్భంగా ఫుడ్ ఇన్స్పెక్టర్ వరుణ్ రెడ్డి మాట్లాడుతూ, ఆహార భద్రత ప్రమాణాలను కచ్చితంగా పాటించడం ప్రతి ఆహార నిర్వాహకుడి బాధ్యత అని, ఈ శిక్షణ ద్వారా వారికి అవసరమైన జ్ఞానం మరియు నైపుణ్యాలు పెంపొందుతాయని అన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ జారీ.

### నిరంతరం అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ

### - సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ ప్రియాంక



హైదరాబాద్, ఏప్రిల్ 6 : జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక గారు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలపై జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందవద్దని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో స్క్రూట్నీ చేసి అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంజూరి చేస్తూ నూతన కార్డులు జారీ చేయడం జరుగుతుందని, అర్హులైన జర్నలిస్టు ఆన్లైన్ లో తమ దరఖాస్తులను అప్లోడ్ చేసుకోవాలని, ఏప్రిల్ మాసంలో అక్రడేషన్ జారీ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని, కమిషనర్ సిహెచ్. ప్రియాంక ప్రకటనలో తెలిపారు. అదేవిధం జిల్లా స్థాయిలో కూడా ఈనెలలోనే జిల్లా కమిటీలు సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ లు జారీ చేయడం జరుగుతుందని, కావున జిల్లాలో జిల్లా స్థాయి దరఖాస్తు చేసుకొనే అర్హులైన జర్నలిస్టులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్లైన్లో చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

## బెంగాల్ ప్రచారంలోకి లియాండ్ర్ పేస్

### ఎక్స్ కేటగిరి భద్రత కల్పించిన కేంద్రం

న్యూఢిల్లీ,ఏప్రిల్ 6 : పశ్చిమబెంగాల్ అసెంబ్లీ ఎన్నికల వేళ ఇటీవల బీజేపీలో చేరిన టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్‌కు కేంద్ర హోం శాఖ 'ఎక్స్' కేటగిరీ భద్రత కల్పించింది. ఇందులో భాగంగా సీఐఎస్ఎఫ్ సిబ్బందిని ఆయన భద్రత కోసం కేటాయించింది. పశ్చిమబెంగాల్ రాజకీయాల్లో చురుకైన పాత్ర పోషించేందుకు లియాండర్ పేస్ సిద్ధపడుతుండటంతో కేంద్ర హోంశాఖ ఈ నిర్ణయం తీసుకున్నట్టు తెలుస్తోంది. యాభై రెండేళ్ల లియాండర్ పేస్ గత వారం బీజేపీలో చేరారు. తాను లాంఛనపూర్వకంగా పార్టీలో చేరలేదని, ఒక బాధ్యతతో, దేశానికి సేవచేసే లక్ష్యంతో బీజేపీలో చేరినట్టు చెప్పారు.




## జూబ్లీనగర్ కవల ఆడపిల్లల హత్యా కేసు ఛేదన

### కన్నతండ్రితో సహా నలుగురు నిందితుల అరెస్ట్

కరీంనగర్ టౌన్, ఏప్రిల్6(ది క్రైమ్ న్యూస్) : సొంత బిడ్డలనే కాలయముడిలా మారి బావిలో ముంచి చంపిన దారుణ ఘటనలో కన్నతండ్రితో పాటు అతనికి సహకరించిన కుటుంబ సభ్యులను కరీంనగర్ రూరల్ పోలీసులు అరెస్ట్ చేశారు. ఆస్తిపై మక్కువతో, ఆడపిల్లలనే వివక్షతో ఈ దారుణానికి ఒడిగట్టినట్లు విచారణలో వెల్లడైంది.ఘటన నేపథ్యం: ?కరీంనగర్ రూరల్ మండలం జూబ్లీనగర్ నివాసి కచ్చు శ్రీశైలం (28), ప్రతిమ మెడికల్ కాలేజీలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. 2020లో మౌనికతో ఇతనికి వివాహం కాగా, 2022లో వీరికి కవల ఆడపిల్లలు (గీతంశి, గీతన్విక) జన్మించారు. అయితే మొదటి నుండి మగపిల్లవాడు కావాలని కోరుకున్న శ్రీశైలంకు, ఆడపిల్లలు పుట్టడం ఇష్టం లేదు. సుమారు 2 కోట్ల విలువైన ఆస్తి ఆడపిల్లల పెళ్లిళ్లకే సరిపోతుందని భావించిన శ్రీశైలం, తన తల్లిదండ్రులు అశోక్, లావణ్య మరియు తమ్ముడు రాకేష్‌తో కలిసి పిల్లలను అడ్డు తొలగించుకోవాలని పథకం వేశాడు.పథకం ప్రకారం హత్య:ఏప్రిల్ 3న, పథకం ప్రకారం నిందితుడు శ్రీశైలం తన భార్యను ఇంట్లోనే ఉండమని చెప్పి, బలవంతంగా ఇద్దరు కుమార్తెలను మోటార్ సైకిల్‌పై పొలం వద్దకు తీసుకెళ్లాడు. చుట్టుపక్కల ఎవరూ లేని సమయం చూసి, నలుగురు నిందితులు ముందుగా అనుకున్న ఒప్పందం ప్రకారం, శ్రీశైలం ఇద్దరు చిన్నారులను వ్యవసాయ బావిలోకి తోసివేశాడు. నీటిలో మునిగిపోతున్న గీతంశి ప్రాణాల కోసం కొట్టుమిట్టాడుతుండగా, తనే బావిలోకి దిగి ఆమెను నీటిలో ముంచి ఊపిరాడకుండా చేసి చంపేశాడు. ?అనంతరం ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు, పిల్లలను కాపాడబోతున్నట్లుగా నటిస్తూ కేకలు వేశాడు. నిందితుడు ప్రవర్తనపై అనుమానం వచ్చిన గ్రామస్తులు పోలీసులకు సమాచారం అందించారు. రూరల్ సి.ఐ. నిరంజన్ రెడ్డి నేతృత్వంలో దర్యాప్తు చేపట్టిన పోలీసులు, నిందితులు గోపాల్‌పూర్‌లో తలదాచుకున్నట్లు గుర్తించారు. ఆదివారం (ఏప్రిల్ 5) మధ్యాహ్నం నిందితులను అదుపులోకి తీసుకోగా, వారు తమ నేరాన్ని అంగీకరించారు.అరెస్టైన వారు:కచ్చు శ్రీశైలం (తండ్రి)29,కచ్చు అశోక్ (తాత) 57 కచ్చు లావణ్య (నానమ్మ) 55,కచ్చు రాకేష్ (బాబాయ్) 27,స్వాధీనం చేసుకున్నవి:హత్యకు ఉపయోగించిన గ్లామర్ మోటార్ సైకిల్, ఒక వివో మొబైల్ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ?ఈ కేసును అత్యంత వేగంగా ఛేదించిన రూరల్ ఏసీపీ విజయ కుమార్, సి.ఐ. నిరంజన్ రెడ్డి, సిబ్బందిని కరీంనగర్ సి.పి. గౌష్ ఆలం అభినందించారు. గ్రామంలో ఉద్రిక్తతలు తలెత్తకుండా భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు పోలీసులు తెలిపారు. నిందితులను రిమాండ్‌కు తరలించడం జరిగింది.

## సుల్తానాబాద్‌లో ఘనంగా బీజేపీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



సుల్తానాబాద్,(ది క్రైమ్ న్యూస్): పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండల పరిధిలో భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా బీజేపీ మండల అధ్యక్షులు కందుల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సోమవారం మండల కేంద్రంలోని పూసాల రోడ్డు తో పాటు కాట్నాపల్లి, గర్రెపల్లి, రేగడి మద్దికుంట, అల్లిపూర్,కోదురుపాక, ఐతారాజ్ పల్లి, గొల్లపల్లి, రామునిపల్లి తోపాటు వివిధ గ్రామాలలో, బూత్ లలో వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు కర్ర సంజీవ్ రెడ్డి,గొట్టిముక్కుల సురేష్ రెడ్డి, నల్ల మనోహర్ రెడ్డి,జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి అశోక్ రావు, ఉపాధ్యక్షులు సౌదరి మహేందర్ యాదవ్,మిట్టపల్లి ప్రవీణ్,కామని రాజేంద్ర ప్రసాద్ పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పార్టీ జెండాను ఎగరవేసి, మిఠాయిలు పంచుతూ సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు మాట్లాడుతూ.. దేశానికి దేశభక్తి, ప్రజాసంక్షేమం లక్ష్యంగా శ్యామ ప్రసాద్ ముఖర్జీ జనసంఘ్‌ను స్థాపించినట్లు పేర్కొన్నారు. ఇందిరా గాంధీ విధించిన ఎమర్జెన్సీ సమయంలో ప్రజాస్వామ్యవాదులపై జరిగిన అణచివేతను ఆయన గుర్తుచేశారు. అనంతరం జనతా పార్టీ ఏర్పడి ప్రజల మద్దతు పొందినప్పటికీ, స్పష్టమైన సిద్ధాంతాలతో ముందుకు సాగాలనే ఉద్దేశంతో 1980 ఏప్రిల్ 6న భారతీయ జనతా పార్టీ ఆవిర్భవించిందన్నారు.మచ్చలేని నాయకత్వం కలిగిన అటల్ బిహారీ వాజపేయి గారిని పార్టీ తొలి అధ్యక్షునిగా నియమించుకున్నారని తెలిపారు. ఎన్నో ఎత్తుపల్లాలు ఎదుర్కొన్న బీజేపీ, దేశ ప్రజల ఆశీర్వాదంతో 2014లో నరేంద్ర మోదీ నాయకత్వంలో అధికారంలోకి వచ్చిందన్నారు. గత పదేళ్లలో దేశానికి సుపరిపాలన అందించడమే కాకుండా, ప్రజల ఆత్మగౌరవాన్ని పెంపొందించిందని పేర్కొన్నారు.ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా ఎదిగిన బీజేపీ మరింత అభివృద్ధి చెందాలని, ప్రజల ఆశీస్సులతో విజయాలు సాధించాలని కోరుతూ పార్టీ నాయకులు, కార్యకర్తలకు ఆవిర్భావ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు.ఈ కార్యక్రమంలో రూరల్ బీజేపీ నాయకులు చాతరాజు రమేష్, కోట నాగేశ్వర్, కొల్లూరి సంతోష్,కొమ్మిడి రాజేందర్ రెడ్డి, వడ్లకొండ శశివర్ధన్,మల్క భాగ్యలక్ష్మి,పెరక రమేష్, మారం రమేష్, ఏనుగు రాజిరెడ్డి, వీరగోని కిరణ్, డాక్టర్ బుమయ్య, మనోహర్, శేఖర్ మాస్టర్ తదితరులు పాల్గొన్నారు...

## ఎన్ హెచ్-65 రహదారి విస్తరణకు శ్రీకారం

### రూ.45 కోట్లతో పనులు ప్రారంభం



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : చందానగర్ డివిజన్ పరిధిలోని జాతీయ రహదారి (ఎన్ హెచ్-65)లో శ్రీదేవి థియేటర్ రోడ్డు నుంచి అమీన్‌పూర్ వరకు రూ.45 కోట్ల అంచనావ్యయంతో చేపట్టనున్న రహదారి విస్తరణ పనులను అధికారులు పరిశీలించారు. ఈ ప్రాజెక్ట్‌లో భాగంగా 2.7 కిలోమీటర్ల పొడవున 4 లేన్ మెయిన్ రోడ్‌తో పాటు 2 లేన్ సర్వీస్ రోడ్ నిర్మాణం చేపట్టనున్నారు. ఈ పనులను పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ, సిఎంసి కమిషనర్ సృజన, డిప్యూటీ కమిషనర్ శశిరేఖ, సిసిపి వెంకన్న, ఇంజనీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తదితరులతో కలిసి సోమవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ఈ రహదారి విస్తరణ పనులు ప్రాంత అభివృద్ధికి ఎంతో కీలకమని అన్నారు. పనుల్లో ఆలస్యం చేయకుండా వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ఏవైనా సమస్యలు తలెత్తితే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మార్గదర్శకంలో, మంత్రి శ్రీధర్ బాబు సహకారంతో శేరిలింగంపల్లి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తామని తెలిపారు. రహదారి విస్తరణ పూర్తయితే ట్రాఫిక్ సమస్యలు తగ్గి, ప్రయాణ సమయం, ఇంధన వినియోగం తగ్గుతాయని పేర్కొన్నారు. ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలతో పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేసి అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ఇప్పటికే ఫ్లైఓవర్లు, అండర్ బ్రిడ్జిలు, లింక్ రోడ్లు నిర్మించినట్లు గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఇంజనీరింగ్ విభాగ అధికారులు, టౌన్ ప్లానింగ్ సిబ్బంది, నాయకులు, కాలనీల అసోసియేషన్ సభ్యులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

## లక్ష్మీపూర్లో బిజెపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



మానకొండూర్, ఎప్రిల్ 6(ది క్రైమ్ న్యూస్): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం లక్ష్మీపూర్లో బిజెపి 47వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఉప సర్పంచ్, బిజెపి మాజీ మండలాధ్యక్షుడు రాపాక ప్రవీణ్ జెండాను ఆవిష్కరించి స్వీట్లు పంపిణీ చేశారు. అనంతరం అల్పాహార వితరణను ఏర్పాటు చేశారు. రాపాక ప్రవీణ్ మాట్లాడుతూ....1980 ఏప్రిల్ 6న ఏర్పడిన బిజెపి అంచెలంచెలుగా ఎదుగుతూ కేంద్రంలో ప్రభుత్వం ఏర్పాటు చేసి సుస్థిర పాలన అందిస్తూ అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి కోసం పనిచేస్తుందన్నారు.కార్యక్రమంలో ఉప్పు రవీందర్, బండారి హరీష్, రాపాక జగన్, కూకట్ల చంద్రయ్య, గ్యాజంగి తుకారం, సుంక ఉదయ్ కుమార్, రాపాక శ్యామ్ తేజ, వీర్ల మహేష్, తాండ్ర మహేష్, పిట్టల సురేష్, కొమ్మగల సురేష్, అనగొని స్వామి, రాపాక శంకరయ్య, చుక్క కొండయ్య, రాపాక వేణు, కొమ్మగళ్ళ శ్రీనివాస్, మనోజ్, చింటూ తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

## మంచరామిలో జన గణన-2027 సన్నాహక కార్యక్రమం

### గ్రామాన్ని సందర్శించిన ఎంపిడిఓ, సెన్సస్ అధికారులు



సుల్తానాబాద్, ఏప్రిల్ 06(ది క్రైమ్ న్యూస్) దేశవ్యాప్తంగా నిర్వహించనున్న జన గణన--2027 సన్నాహకాల్లో భాగంగా, మంచరామి గ్రామంలో సోమవారం ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపిడిఓ సెన్సస్ టెక్నికల్ అసిస్టెంట్ ముఖ్య అతిథులుగా హాజరై గ్రామాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, జన గణనలో అత్యంత కీలకమైన హౌస్ లిస్టింగ్ (గృహాల నమోదు) ప్రక్రియపై గ్రామస్థులకు వివరించారు. ప్రతి ఇంటి వివరాలను క్షేత్రస్థాయిలో ఎలా నమోదు చేస్తారు, ఇందులో ప్రజలు అధికారులకు ఎలా సహకరించాలి అనే అంశాలపై కీలక సూచనలు, సలహాలు అందించారు. ఈ గణన ద్వారా వచ్చే సమాచారం భవిష్యత్తులో ప్రభుత్వ పథకాల రూపకల్పనకు మరియు గ్రామ అభివృద్ధికి ఎంతో తోడ్పడుతుందని వారు పేర్కొన్నారు. సర్పంచ్ ఆధ్వర్యంలో ఘన సన్మానం: మంచరామి గ్రామ సర్పంచ్ ఉప్పు లక్ష్మి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. గ్రామానికి విచ్చేసిన ఎంపిడిఓ ని సర్పంచ్ , గ్రామస్థులు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం, అధికారులతో కలిసి గ్రామ సర్పంచ్ , ప్రజాప్రతినిధులు గ్రామ సమస్యలు, కొనసాగుతున్న అభివృద్ధి పనులపై చర్చించారు. గ్రామంలోని మౌలిక సదుపాయాల మెరుగుదలకు తీసుకోవాల్సిన చర్యలపై అధికారులకు విన్నవించారు. ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి, పంచాయతీ సిబ్బంది , అధిక సంఖ్యలో గ్రామస్థులు పాల్గొన్నారు.

## ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతి

### పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ

క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : ప్రజాక్షేమమే లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పనిచేస్తోందని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేదల పక్షపాతిగా నిరంతరం సేవలు అందిస్తున్నారని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ అన్నారు. శేరిలింగంపల్లి డివిజన్ పరిధిలోని నెహ్రూ నగర్ కాలనీకి చెందిన నుస్రత్ జాన్‌కు అత్యవసర వైద్య చికిత్స కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా రూ.2,50,000 ఆర్థిక సహాయం మంజూరైంది. ఈ మేరకు మంజూరైన ఆర్థిక సహాయాన్ని పిఏసి చైర్మన్ ఆరెకపూడి గాంధీ, మాజీ కార్పొరేటర్ హమీద్ పటేల్‌తో కలిసి సోమవారం బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి పేద ప్రజలకు గొప్ప వరమని అన్నారు. అనారోగ్యంతో బాధపడుతున్న, ఆర్థిక స్థోమత లేని వారికి ఈ నిధి కీలక సహాయాన్ని అందిస్తున్నదని పేర్కొన్నారు. అవసర సమయంలో సీఎం సహాయ నిధి ఆపన్నహస్తంలా నిలుస్తోందని తెలిపారు. ఈ సహాయానికి కృతజ్ఞతలు తెలియజేస్తూ బాధిత కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.



# మనస్సుంటే మన మధన్నదే...

**- అనారోగ్య బాధితులను చూసి చలించిన హృదయం**

**- ఆస్పత్రిలో చేర్పించి మెరుగైన వైద్యం కోసం వేడుకోలు**

**- సేవ చేయడం కేవలం పుట్ట మధన్నకే సాధ్యశీ**



రామగిరి, ఏప్రిల్ 06(ది క్రైమ్ న్యూస్) : నాయకుడంటే కేవలం ప్రజల ఓట్లతో గెలువడం కాదు...ప్రజల మనసులో పదిలమైన స్థానం సంపాదించుకునేవాడే అసలైన లీడర్... అధికారం..పదవిలో ఉన్నా లేకున్నా ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి కష్టాలను తీర్చేవాడే నిజమైన నాయకుడు...అలాంటి కోవకు చెందిన వారే మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్... మంథని ఎమ్మెల్యేగా, జెడ్పీ చైర్మన్‌గా పదవీ బాధ్యతలు నిర్వహించిన పుట్ట మధూకర్ ఎమ్మెల్యేగా ఓడిపోయినా ప్రజల మధ్యలో ఉంటూ వారి కష్టాలు తీర్చేందుకు ముందడుగు వేస్తున్నాడు. అసలు మనస్సుంటే మా మధన్నదే అంటున్నారు. అభిమానులు...మహాముత్తారం మండలం మాదారం గ్రామానికి చెందిన ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు బచ్చల ఎర్రయ్య గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్నాడు. విషయం తెలుసుకున్న ఆయన హుటాహుటీన బచ్చల ఎర్రయ్యను పరామర్శించి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వెంటనే స్వయంగా వరంగల్‌లోని ప్రతిమ క్యాన్సర్ ఇన్స్టిట్యూట్ ఆసుపత్రికి తీసుకెళ్లి అక్కడి వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అదే విధంగా అదే గ్రామానికి చెందిన మేకల మధునయ్య అనే వ్యక్తి ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్‌కు గురై వైద్యం చేయించుకోకుండా ఇంటి వద్దే ఉంటున్నారు. ఈ విషయాన్ని తెలుసుకున్న ఆయన మధునయ్యను వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తీసుకెళ్లి వైద్యం చికిత్స అందించేలా ఏర్పాట్లు చేశారు. ఇలా అనారోగ్యంతో బాధపడుతున్న వారిని చూసి ఛలించి తనవంతు సేవ చేయడం కేవలం పుట్ట మధన్నకే సాధ్యమని పలువురు చర్చించుకుంటున్నారు.

## ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడానికే ఎన్.సి.డి. వైద్య శిబిరం

**- తహసీల్దార్ సుమన్, సర్పంచ్ పల్లె ప్రతిమ-పివీరావు**





రామగిరి, ఏప్రిల్ 06(ది క్రైమ్ న్యూస్):- ప్రజల ఆరోగ్య పరిస్థితులను తెలుసుకోవడానికే ఎన్.సి.డి. వైద్య శిబిరం నిర్వహించారని రామగిరి మండల తహసీల్దార్ పర్నంది సుమన్, సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు లు అన్నారు. రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో ఎన్.సి.డి. వైద్య శిబిరం నిర్వహించారు. గ్రామ ప్రజల ఆరోగ్య పరిస్థితులను పరిశీలించడం లక్ష్యంగా పెట్టుకుని ఈ శిబిరం నిర్వహించడం జరుగుతుందని, ముఖ్యంగా 30 సంవత్సరాలు పైబడిన గ్రామస్తులు తప్పనిసరిగా హాజరై తమ ఆరోగ్య పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. శిబిరంలో ముఖ్యంగా షుగర్ (మధుమేహం), బీపీ (రక్తపోటు) పరీక్షలు ఉచితంగా నిర్వహించబడతాయని, ఈ పరీక్షల ద్వారా ముందుగానే వ్యాధులను గుర్తించి, తగిన జాగ్రత్తలు తీసుకోవడం సాధ్యమవుతుందన్నారు. ఈ శిబిరం ద్వారా గ్రామ ప్రజల్లో ఆరోగ్య అవగాహన పెంపొందించడం, వ్యాధులను ప్రారంభ దశలోనే గుర్తించడం లక్ష్యంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాద్రపు ప్రవళిక-ప్రశాంత్, ఏఎస్ఓ అల్వాల రమ్య, పంచాయతీ సెక్రటరీ గంగుల సంతోష్, ఏంఎల్ హెచ్ పి కర్రావుల నవ్య, ఏఎన్ఎం మన్నాల రాణి, కారోబార్ కొండపర్తి శ్రీనివాస్, ఆశా వర్కర్లు గడ్డం సునీత, అంగురి విజయలక్ష్మి, మేడ స్వరూప, పంజా శాంత, తదితరులు పాల్గొన్నారు.

## అర్హులైన జర్నలిస్టులకు అక్రెడిటేషన్ జారీ.

**నిరంతరం అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ**

**సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక**



రామగిరి , ఏప్రిల్ 06(ది క్రైమ్ న్యూస్) :- జర్నలిస్టుల అక్రిడిటేషన్ దరఖాస్తుల ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని సమాచార పౌరసంబంధాల శాఖ స్పెషల్ కమిషనర్ సిహెచ్. ప్రియాంక గారు ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుల ప్రక్రియపై ఇటీవల మీడియాలో వస్తున్న వార్తలపై జర్నలిస్టులు ఎటువంటి ఆందోళన చెందవద్దని కమిషనర్ ఆ ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర స్థాయిలో ఇప్పటి వరకు వచ్చిన దరఖాస్తులను ఈ నెల 10వ తేదీన జరిగే రాష్ట్ర స్థాయి అక్రిడిటేషన్ కమిటీ సమావేశంలో స్క్రూటిని చేసి అర్హులైన జర్నలిస్టులకు కొత్త అక్రిడిటేషన్ కార్డులను మంజూరి చేస్తూ నూతన కార్డులు జారీ చేయడం జరుగుతుందని, అర్హులైన జర్నలిస్టు ఆన్లైన్ లో తమ దరఖాస్తులను అప్లోడ్ చేసుకోవాలని, ఏప్రిల్ మాసంలో అక్రడేషన్ జారీ ప్రక్రియ పూర్తి చేయడం జరుగుతుందని, కమిషనర్ సిహెచ్. ప్రియాంక ప్రకటనలో తెలిపారు. అదేవిధం జిల్లా స్థాయిలో కూడా ఈనెలలోనే జిల్లా కమిటీలు సమావేశాలు ఏర్పాటు చేసి అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ లు జారీ చేయడం జరుగుతుందని, కావున జిల్లాలో జిల్లా స్థాయి దరఖాస్తు చేసుకొనే అర్హులైన జర్నలిస్టులు వెంటనే తమ దరఖాస్తులను ఆన్లైన్లో చేసుకోవాలని ఆమె ఆ ప్రకటనలో కోరారు.

## నూతన భవనాలకు ఎమ్మెల్యే కవ్వంపల్లి భూమిపూజ



మానకొండూర్, ఎప్రిల్ 6(ది క్రైమ్ న్యూస్): కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం బంజేరుపల్లిలో గ్రామ పంచాయతీ భవనం,సిసి రోడ్డు,వన్నారంలో వీవో భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ సోమవారం భూమి పూజ చేశారు.అనంతరం లలితాపూర్లో దాడి మమత-లక్ష్మణ్, వేల్పుల అయిలమ్మ, కాల్వ రమ్య-సతీష్ ల ఇందిరమ్మ ఇండ్ల గృహ ప్రవేశాలకు ఎమ్మెల్యే హాజరయ్యారు.ఎంపీడీవో వీ. వరలక్ష్మి, తహశీల్దార్ విజయ్ కుమార్, మార్కెట్ చైర్మన్ మర్రి ఓదెలు యాదవ్, సర్పంచ్లు తోట లత, పి.శారద, రామడుగు హరీష్,పెంచాల కిషన్ రావు, కేడీసీసీ డైరెక్టర్ మర్రి కొమురయ్య, పార్టీ మండలాధ్యక్షుడు నందగిరి రవింద్ర చారి,నాయకులు తోట శ్రీనివాస్, బోళ్ళ మురళీధర్, బండి మల్లేశం, మడుపు ప్రేమ్ కుమార్,బుర్ర శ్రీధర్ గౌడ్,ఎగోలపు శ్రీనివాస్ గౌడ్, ఎడ్ల శ్రీధర్ తదితరులు ఎమ్మెల్యే వెంట కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

## జనగణన ప్రిలిమినరీ సర్వేను ప్రారంభించిన రామగిరి తహసీల్దార్ సుమన్

**-రత్నాపూర్‌లో సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు ఆధ్వర్యంలో....**



రామగిరి, ఏప్రిల్ 06(ది క్రైమ్ న్యూస్):- జనగణన-2027 ప్రిలిమినరీ సర్వేను రామగిరి మండలం రత్నాపూర్ గ్రామంలో సోమవారం మండల తహసీల్దార్ పర్నంది సుమన్ స్థానిక సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ సుమన్ మండల గణాంక అధికారి అల్వాల రమ్య మాట్లాడుతూ ప్రతి గ్రామంలో 700 నుంచి 800 జనాభా కు ఒక బ్లాక్ గా గుర్తిస్తామని తెలిపారు. మండలంలో 15 గ్రామ పంచాయితీలలో 128 ప్రభుత్వ టీచర్ లను ఎన్యుమరేటర్ లు గా నియమించడం జరిగిందన్నారు. 6 నుంచి 7 ఎన్యుమరేటర్ లకు ఒక సూపర్వైజర్ ను నియమించారని తెలిపారు. ఈ సారి డిజిటల్ యాప్ ద్వారా జనగణన సర్వే జరుగుతుందన్నారు. 34 ప్రశ్నలతో కూడిన సర్వే ఉంటుందని, ఖచ్చితంగా మొబైల్ నెంబర్ ఇవ్వాలని తహసీల్దార్ తెలిపారు. సెల్ఫ్ డిక్లరేషన్ కూడా చేసుకోవచ్చని, సర్వే కు ఎన్యుమరేటర్ లు వచ్చినపుడు ఓటీపీ చెప్పాలని వారు సూచించారు. మే-11 వ తేదీ నుంచి జూన్-09వ తేదీ వరకు ఫస్ట్ ఫేజ్ లో సర్వే జరుగుతుందని, ఇందులో పూర్తి హౌస్ డేటా వస్తుందని ఆయన తెలిపారు. ఫిబ్రవరి-2027 నుంచి రెండో విడత కులజనాభా గణన సర్వే జరుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాద్రపు ప్రవళిక-ప్రశాంత్, పంచాయతీ సెక్రటరీ గంగుల సంతోష్, కారోబార్ కొండపర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

## రామగిరి లో బిజేపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

**-పార్టీ జెండాను ఆవిష్కరించిన మండల అధ్యక్షుడు కొండు లక్ష్మణ్**




రామగిరి, ఏప్రిల్ 06(ది క్రైమ్ న్యూస్):- రామగిరి మండలం లో భారతీయ జనతా పార్టీ 47వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి,మండల అధ్యక్షుడు కొండు లక్ష్మణ్ పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కొండు లక్ష్మణ్ మాట్లాడుతూ అప్పటి కాంగ్రెస్ వాది డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారు కాంగ్రెస్ పార్టీ విధి విధానాలు నచ్చక మరియు భారత్ విభజన కాశ్మీర్ కు ప్రత్యేక హోదా కల్పిస్తూ ఆర్టికల్ 370 నీ ప్రోత్సహించిన కాంగ్రెస్ పార్టీ నుండి బయటకు వచ్చి 1951 అక్టోబర్ 21వ తేదీన డాక్టర్ శ్యామ ప్రసాద్ ముఖర్జీ గారు భారతీయ జనాసంఘ్ పార్టీని స్థాపించడం జరిగిందని దేశంలోనే తొలి హిందూ వాది పార్టీగా ఈ పార్టీ అవతరించిందనీ ఒకే దేశంలో రెండు రాజ్యాంగాలు ఇద్దరు ప్రధానులు రెండు జెండాలు ఉండకూడదని ---ఏక్ దేశ్ మే దో విధాన్ దో ప్రధాన్ ధో నిషన్ నహి చలేంగే అనే నినాదంతో ముఖర్జీ గారు పోరాటం చేశారని అయన అన్నారు.1953 ముఖర్జీ గారి మరణాంతరం ఎన్నో ఒడిదోడుగులు ఎదుర్కొంటూ 1977లో అద్వానీ మరియు వాజ్పేయి ఆధ్వర్యంలో జనసంఘ్ పార్టీ జనత పార్టీలో విలీనం చేయడం జరిగింది.అంతేకాకుండా 1977 సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించి తొలి కాంగ్రెస్ హేతర ప్రభుత్వంగా అవతరించిశీదాని క్రమేపి రెండు సంవత్సరాల వ్యవధిలోనే పార్టీలో చిరికలు మొదలై నాటి జనసఘ్ నేతలు జనతా పార్టీ నుండి బయటకు వచ్చి 1980 ఏప్రిల్ 6 న భారతీయ జనతా పార్టీనీ స్థాపించడం జరిగిందనీ అన్నారు.తొలుత కేవలం రెండు సీట్లతో మొదలైన ఈ పార్టీ ప్రస్థానం ఇప్పుడు ప్రపంచంలోనే అతిపెద్ద రాజకీయ పార్టీగా అవతరించిందనీ గతంలో కాంగ్రెస్ పార్టీ చేసిన తప్పిదాలను సవరిస్తూ ప్రపంచంలోనే భారతీయ విశ్వ గురువుగా నిలిపేందుకే బిజెపి పని చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి తోట్ల రాజు ఉపాధ్యక్షుడు నాంసాని మహేష్ సీనియర్ నాయకులు పొన్నం సదానందం కార్యదర్శి కొత్త కమలాకర్ ఓబీసీ అధ్యక్షుడు మైదాన్ సందీప్ బీజేవైఎం ప్రధాన కార్యదర్శి ముక్కెర మణికంఠ, బాద్రపు కృష్ణాకర్ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత డ్రోన్ టెక్నీషియన్ నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమం

## ఉచిత నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొండి

**జిఎం లు రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్,**

**అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు**



రామగిరి, ఏప్రిల్ 06(ది క్రైమ్ న్యూస్): - సింగరేణి సంస్థ కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సి.ఎస్.ఆర్) ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పలు నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతులను సద్వినియోగం చేసుకొని, ఉపాధి అవకాశాలు మెరుగుపరచుకోవాలని రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, లు అన్నారు. సోమవారం స్థానిక విటిసి లోని స్కిల్ డెలప్మెంట్ ట్రైనింగ్ సెంటర్ నందు సింగరేణి సంస్థ సిఎస్ఆర్ ఆధ్వర్యంలో 30 మంది అభ్యర్థులకు రెండు వారాల పాటు నిర్వహించే ఉచిత డ్రోన్ టెక్నీషియన్ నైపుణ్యాభివృద్ధి శిక్షణా తరగతుల ప్రారంభోత్సవ కార్యక్రమానికి రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ సుంకర మధుసూదన్, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, లు ముఖ్య అతిథులుగా పాల్గొని, శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సింగరేణి సంస్థ ఉద్యోగుల కుటుంబ సభ్యుల కోసమే కాకుండా, పరిసర ప్రాంతాల నిరుద్యోగ యువత కోసం కూడా ఎన్నో నైపుణ్యాభివృద్ధి శిక్షణా కార్యక్రమాలను నిర్వహిస్తోందని, ఈ ఉచిత శిక్షణను సద్వినియోగం చేసుకొని, నైపుణ్యాన్ని సంపాదించి, ఉపాధి అవకాశాలను మెరుగుపరచుకోవాలని, సమీప గ్రామాల అభివృద్ధి కోసం ఉపాధి అవకాశాలు పెంచడానికి సింగరేణి సంస్థ సి.ఎస్.ఆర్ లో బాగంగా ఈ ట్రైనింగ్ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందని, ముస్ముందు డ్రోన్ టెక్నాలజీ ఉపయోగం చాలా అవసరమని, స్వయం ఉపాధి పొందుతూ ఆర్థికంగా బలోపేతం కావలని అన్నారు.అనంతరం మోడల్ రూమ్, నూతనంగా నిర్మిస్తున్న ట్రైనింగ్ గ్యాలరీ లను సందర్శించి, పరిశీలించారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటుజిఎం బి.వి. సత్య నారాయణ, మేనేజర్ సుజీత్, డివై ఎస్ఇ శ్రీనివాస్, శిక్షకులు వెంకటేశ్వర రావు, అభ్యర్థులు పాల్గొన్నారు.

## ఘనంగా బీజేపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు



క్రైమ్ న్యూస్, రంగారెడ్డి జిల్లా, ప్రతినిధి : భారతీయ జనతా పార్టీ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలో జెండా ఆవిష్కరణ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. హుడా కాలనీ, హఫీజ్‌పేట్ గ్రామంలో జరిగిన ఈ కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, శేరిలింగంపల్లి అసెంబ్లీ ఇంచార్జి రవికుమార్ యాదవ్ పాల్గొని పార్టీ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్యామా ప్రసాద్ ముఖర్జీ స్థాపించిన బీజేపీ, దీన్ దయాళ్ ఉపాధ్యాయ ప్రవచించిన ఏకాత్మ మానవతా వాదం సిద్ధాంతాలపై నడుస్తూ దేశంలో అతిపెద్ద పార్టీగా అవతరించిందని అన్నారు. అటల్ బిహారి వాజపేయి, ఎల్.కే. అద్వానీ మార్గదర్శకంలో అభివృద్ధి చెందుతూ, ప్రస్తుతం ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశాన్ని విశ్వగురువుగా నిలబెట్టే దిశగా ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. అంత్యోదయ సిద్ధాంతాన్ని ఆచరిస్తూ పంక్తిలో చివరి వ్యక్తికి ప్రయోజనం చేకూర్చడం బీజేపీ లక్ష్యమని తెలిపారు. అలాగే, ఓటరు జాబితా శుద్ధి కార్యక్రమాల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు చురుకుగా పాల్గొని పారదర్శక వ్యవస్థకు సహకరించాలని పిలుపునిచ్చారు. రాబోయే సైబరాబాద్ మున్సిపల్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని ప్రతి కార్యకర్త ఇప్పటి నుంచే పని ప్రారంభించాలని సూచించారు. తెలంగాణలో బీజేపీ బలపడి భవిష్యత్ ఎన్నికల్లో విజయం సాధిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఉపాధి హామీ పనుల సమస్యలు పరిష్కరించండి

**-సర్పంచ్ కి వినతిపత్రం**



రామగిరి, ఏప్రిల్ 06(ది క్రైమ్ న్యూస్):- రామగిరి మండలం రత్నాపూర్ ఉపాధి హామీ పనుల సమస్యలు పరిష్కరించాలని సోమవారం సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు పలువురు ఉపాధి కూలీలు వినతిపత్రం అందచేశారు. నూతన యాప్ లో తమ పేర్లు ఉన్నప్పటికీ ఐరిష్, ఈ-కెవైసి సరిగ్గా లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అదే విధంగా ఈ సమస్యతో తమను ప్రతిరోజు పని కల్పించకుండా వెనకకు పంపిస్తున్నారని అన్నారు. సింగరేణి రిటైర్డ్ ఉద్యోగుల కుటుంబాలకు ఉపాధి లేదని పేర్కొంటున్నారని కూలీలు ఆవేదన వ్యక్తం చేశారు. తమ కుటుంబాలకు పెన్షన్ సరిగ్గా రాదని, తమకు కూడా ఉపాధి పనులు కల్పించాలని కూలీలు సర్పంచ్ ని కోరారు. ఈ సందర్భంగా సర్పంచ్ పల్లె ప్రతిమపివీరావు మాట్లాడుతూ ఉపాధి కూలీలకు పనులు కల్పించాలని కోరుతూ అధికారుల దృష్టి కి తీసుకెళ్లుతామని ఆమె తెలిపారు.

## నవాబుపేటలో జనగణన సర్వేపై ఎమ్మార్వో సుమన్ ముందస్తు పర్యటన



రామగిరి, ఏప్రిల్ 06(ది క్రైమ్ న్యూస్):- రామగిరి మండలంలోని నవాబుపేట గ్రామంలో జనగణన సర్వే ప్రారంభానికి ముందు ఎమ్మార్వో సుమన్ ఆకస్మికంగా పర్యటించారు. సర్వే ఇంకా ప్రారంభం కాకపోయినా, గ్రామం మొత్తం తిరిగి పరిస్థితులను స్వయంగా పరిశీలించారు.గ్రామంలోని పలు కాలనీలు సందర్శించి, సర్వే నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై అవగాహన పొందారు. సర్వే ప్రారంభానికి ముందే అన్ని ఏర్పాట్లు పూర్తిగా సిద్ధంగా ఉండాలని సంబంధిత అధికారులకు సూచించారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ మౌనిక సతీష్ కుమార్, ఉప సర్పంచ్ అయిందాల లావణ్య రాజ్ కుమార్ పాల్గొన్నారు. సర్వే ప్రారంభానికి గ్రామస్థులు సహకరించాలని కోరారు.

### ఇజ్రాయెల్‌కు విమాన సర్వీసులు నిలిపివేత

**ఎయిర్ ఇండియా వెల్లడి**

న్యూఢిల్లీ,ఏప్రిల్6 : పశ్చిమాసియాలో ఉద్రిక్త పరిస్థితుల దృష్ట్యా ప్రముఖ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా కీలక నిర్ణయం తీసుకుంది. మే 31 వరకు ఇజ్రాయెల్ రాజధాని టెల్ అవీవ్‌కు వెళ్లే సర్వీసులను, అక్కడి నుండి వచ్చే అన్ని విమాన సర్వీసులను తాత్కాలికంగా నిలిపివేస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. ప్రయాణికులు, విమాన సిబ్బంది భద్రతను దష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎయిర్ ఇండియా వెల్లడించింది. ఈ కాలంలో ప్రయాణానికి ఇప్పటికే టికెట్లు బుక్ చేసుకున్న వారికి పూర్తి మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని, లేదా ఒకసారి ఉచితంగా ప్రయాణ తేదీని మార్చుకునే వెసులుబాటు కల్పిస్తామని ప్రకటిచింది. మే 31 తర్వాత అప్పటి పరిస్థితులను పరిశీలించి నిర్ణయం తీసుకుంటామని పేర్కొంది.

# పుదీనా చట్నీతో హెల్త్ మ్యాజిక్..



వేసవిలో అధిక ఉష్ణోగ్రతల నుండి మన శరీరాన్ని రక్షించుకోవడానికి, ఆరోగ్యాన్ని కాపాడుకోవడానికి పుదీనా అద్భుతంగా పనిచేస్తుంది. ఈ కాలంలో ఏది పడితే అది తినడం ఆరోగ్యానికి హానికరం కావచ్చు. అందుకే పుదీనాతో చేసే వంటకాలు, ముఖ్యంగా పుదీనా చట్నీని తీసుకోవడం వల్ల ఆరోగ్యం, చల్లదనం లభిస్తాయని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. అలాగే పుదీనా పానీయాలు వేసవిలో మన శరీరానికి ఉపశమనం కలిగిస్తాయి.

పుదీనా ఆకుల్లో అడాప్టోజెన్ గుణాలు ఉంటాయి. ఇవి వేసవిలో శరీరాన్ని చల్లబరచడంలో కీలక పాత్ర పోషిస్తాయి. పుదీనాలోని శీతలీకరణ శక్తి శరీరంలోని వేడిని తగ్గించడంలో సహాయపడుతుంది. వేసవిలో చల్లగా ఉండటానికి చాలామంది చల్లటి పదార్థాలను ఆశ్రయిస్తారు. కానీ అవి కొన్నిసార్లు ఆరోగ్యానికి హానికరంగా మారవచ్చు. అలాంటి సందర్భాల్లో, రుచి, ఆరోగ్యం రెండింటినీ పుదీనా వంటకాలు, పానీయాలు అందిస్తాయి.

ఆహారపు రుచిని పెంచే పుదీనా చట్నీని వేసవిలో ఎక్కువగా తినమని ఆరోగ్య నిపుణులు ప్రత్యేకంగా సిఫార్సు చేస్తారు. ఇది కేవలం రుచి కోసమే



కాకుండా, కడుపు ఆరోగ్యానికి కూడా మంచిదని నమ్ముతారు. పుదీనా చట్నీ కడుపు ఆరోగ్యానికి ప్రయోజనకరమైన ఔషధంగా పరిగణించబడుతుంది. ఇది శరీరాన్ని సమతుల్యం చేయడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా వేసవిలో జీర్ణక్రియ, ప్రేగుల ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తుంది.

పుదీనాలో సహజసిద్ధంగా యాంటీఆక్సిడెంట్లు, విటమిన్-సి, ఫైబర్ వంటి పోషకాలు పుష్కలంగా ఉంటాయి. పిప్పర్ మెంట్ లోని శీతలీకరణ శక్తి పేగు ఆరోగ్యాన్ని శాంతపరచడానికి సహాయపడుతుంది. అంతేకాకుండా, దీనిలోని యాంటీ-బాక్టీరియల్, యాంటీ-సెప్టిక్ లక్షణాలు పేగు సూక్ష్మజీవులను ఆరోగ్యంగా ఉంచడంలో తోడ్పడతాయి.

పుదీనా చట్నీలో విటమిన్-సి, ఫైబర్ అధికంగా ఉంటాయి. ఈ సాంప్రదాయ చట్నీ తయారీలో ఉపయోగించే మూలికలు, సుగంధ ద్రవ్యాల మిశ్రమం పేగు ఆరోగ్యాన్ని గణనీయంగా మెరుగుపరుస్తుంది. ఇంట్లో పుదీనా చట్నీని తయారు చేసుకోవడం చాలా సులభం.

ముందుగా పుదీనా ఆకులను శుభ్రంగా కడిగి నీటిలో నానబెట్టి, ఆపై వడకట్టి బాగా కడగాలి. ఆ తర్వాత ఒక బ్లెండర్ తీసుకుని అందులో పుదీనా ఆకులు, మూడు వెల్లుల్లి రెబ్బలు, ఒక అంగుళం అల్లం, రెండు పచ్చిమిర్చి వేసి మెత్తగా పేస్ట్ చేయాలి. చాట్ మసాలాతో పాటు ఉప్పు, ఎండుమిర్చి, నిమ్మరసం జోడించి మళ్లీ బ్లెండ్ చేసి తాజా చట్నీని ఆస్వాదించండి. వేసవిలో ఈ చట్నీని ఫ్రిడ్జ్‌లో నిల్వ చేసి చాలా రోజుల వరకు ఉపయోగించుకోవచ్చు.



# జ్యోతిర్లింగం, శక్తి పీఠం దివ్యక్షేత్రం శ్రీశైలం

## నేడు శ్రీ శ్రీశైలం భ్రమరాంబిక కుంభోత్సవం


తెలుగు నేలపై కొలువైన దివ్యక్షేత్రం శ్రీశైలం. జ్యోతిర్లింగం, శక్తి పీఠం ఒకే గిరి శృంగం మీద వెలసిన పరమ పవిత్ర స్థలంగా భాసిల్లుతున్న క్షేత్రం. పన్నెండు జ్యోతిర్లింగాలలో రెండవది, శ్రీభ్రమరాంబా దేవికి నెలవైన శక్తిపీఠం. శైవక్షేత్రాల్లో తలమానికం. మల్లికార్జున మహాలింగ చక్రవర్తి కొలువై ఉండి, సకల లోకారాధ్యంగా, త్రైలోక్య పూజితంగా విరాజిల్లు తున్నది. సంకల్ప, పూజా సందర్భాలలో శ్రీశైలానికి ఏ దిగ్భాగంలో ఉన్నామో భగవంతునికి తెలియ చేసుకునే సాంప్రదాయాన్ని బట్టి క్షేత్ర ప్రాధాన్యత స్పష్టం అవుతున్నది.
పురాణాల్లో వర్ణితమైన ఎనిమిది శృంగాలతో, నలభై నాలుగు నదులు, అరవై కోట్ల తీర్థరాజాలు, పరాశర, భరద్వాజాది మహర్షుల తపోవన సీమలతో, చంద్ర, సూర్య కుండాది పుష్కరిణులతో, లతలు, వృక్ష సంతతులు, అనేక లింగాలు, అద్భుత ఔషధాలు కలిగి శ్రీశైల మల్లన్న దేవుని సన్నిధికి చేర్చే దారి అత్యంత ఆహ్లాదాన్ని కలిగిస్తుంది.

బ్రహ్మగిరి, విష్ణుగిరి, రుద్రగిరి అనే మూడు పర్వతాలకు పాదాభి వందనం చేస్తూ వేదఘోషను ప్రతిధ్వ నింప చేస్తూ, పాతాళగంగ నామాంకిత అయిన కృష్ణవేణీ నది ఈ ప్రదేశంలో ఉత్తర వాహినిగా ప్రవహిస్తున్నది. అష్టాదశ పురాణాల్లోనూ భారత రామాయణాది ఇతిహాసా ల్లోనూ శ్రీశైల వైభవం వర్ణించ బడింది. కృతయుగంలో హిరణ్య కశిపుడు శ్రీశైలాన్ని తన పూజా మందిరంగా చేసుకొన్నాడు. పురాణాల ప్రకారం సీతారాములు ప్రతిష్ఠించిన సహస్ర లింగాలు, పాండవులు భక్తితో స్థాపించిన సద్యోజాత లింగం, పంచపాండవ లింగాలు పూజార్హత కలిగి అలరారు తున్నాయి. సంస్కృత, ఆంధ్ర, కన్నడ, మరాఠీ గ్రంథాల్లో ఈ క్షేత్రాన్ని గురించిన వర్ణనలున్నాయి. పలు భాషల కవులు క్షేత్ర ప్రాధాన్యతను అభివర్ణించారు.

స్కాంద పురాణంలోని శ్రీశైల ఖండం, ఈ క్షేత్ర మహత్తును వివరిస్తోంది. ఈ క్షేత్ర ప్రశాంతతకు ముగ్ధులైన ఆది శంకరులు కొంత కాలం ఇక్కడ తపస్సు చేసి, శివానంద లహరిని రచించి, మల్లి కార్జునుడికి సమర్పించి, భ్రమరాంబ సన్నిధిలో శ్రీ చక్రాన్ని ప్రతిష్ఠించారు. దత్తావతార పరంపరలో భక్తుల పూజలందుకొనే నృసింహ సరస్వతీ స్వామి శ్రీశైల మహత్యాన్ని వివరి స్తూ తన పాదుకల్ని పట్టుకొన్న తంతుడు అనే భక్తుడికి ఈ క్షేత్ర దర్శన భాగ్యాన్ని కలిగించినట్లు గురుచరిత్ర చెబుతోంది. నృసింహ సరస్వతి స్వామి ఇప్పటికీ కదళీవనంలో గుప్తరూపంలో ఉన్నట్లు దత్తాత్రేయ భక్తులు విశ్వసిస్తారు.



వచ్చే భక్తులకు అతడు రుద్రాక్షలను పంచిపెడు తుండేవాడని స్థానికులు చెబుతుంటారు. నాలుగోదైన సారంగ మఠాన్ని సారంగేశ్వరముని నిర్మించాడని చరిత్ర చెబుతోంది. దీనికి సంబంధించిన లిఖిత ఆధారంగా క్రీ.శ.1585 నాటి శాసనం మఠంలో లభ్యమైంది. అయిదోదైన నంది మఠంలో నందికేశ్వరుడు అనే యోగి సుదీర్ఘకాలం జీవించాడు. ఇది ఘంటా మఠానికి వైపు ఉండేది. ఇవే కాకుండా శ్రీశైలంలో పలు మఠాలు ఉండేవి. వాటిలో వీరశైవ సిద్ధాంత భిక్షావృత్తి మఠం ప్రసిద్ధమైంది. క్రీ.శ. 1518లో దీనిని సిద్ధ భిక్షావృత్తి భార్య, శిష్యుడు పర్వతయ్యలు ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. దీనికి చాలాకాలం ముందే 3వ కుంభోత్సవం జరుగుతుంది. శ్రీ భ్రమరాంబా అమ్మవారికి సాత్విక బలి సమర్పించేందుకు ఈ ఉత్సవాన్ని నిర్వహిస్తారు. భారీగా గుమ్మడి కాయలు, కొబ్బరికాయలు, నిమ్మకాయలు, అన్నరాశి మొదలైనవి అమ్మవారికి బలిగా సమర్పించడం ఈ ఉత్సవ సంప్రదాయం. ప్రసిద్ధమైన ఈ ఉత్సవాలలో అమ్మవారికి జరిగే కుంభోత్సవంను శ్రీశైలములో నివసించే స్థానికులందరూ ఈ ఉత్సవాన్ని తమ ఊరిపండుగ (క్షేత్ర పండుగ) అని భావిస్తారు. ఆ రోజు దాదాపుగా స్థానికులందరూ అమ్మవారిని విధిగా దర్శించుకుంటారు. ఉత్సవం సందర్భంగా అమ్మవారి ఆలయమంతా పలురకాల పుష్పాలతో, నిమ్మకాయదండలతో, వేపమండలతో అలకరించ బడుతుంది.



కుంభోత్సవం నాడు ముందుగా అమ్మవారికి ప్రాత: కాలపూజలు, అర్చకస్వాములు నవావరణ పూజ, త్రిశతి, ఖడ్గమాల, సహస్రనామ, అష్టోత్తరపూజలు, జప పారాయణలను ఏకాంతములో నిర్వహిస్తారు. అర్చకులు తప్ప ఇతరులెవరూ ఈ పూజలను వీక్షించే అవకాశం ఉండదు. కుంభోత్సవం కారణంగా ఆ రోజు తెల్లవారు జామునుండే అమ్మవారి ఆలయ తలుపులు మూసివేయబడి ఉంటాయి. సాయంకాలం సూర్యాస్తమయం అయిన తరువాతనే అమ్మవారి దర్శనానికి భక్తులను అనుమతిస్తారు. చెంచులుగా పిలువబడే ఇక్కడి స్థానిక గిరిజనులు భ్రమరాంబాదేవిని తమ ఆడపడుచుగా, స్వామి వారిని తమ అల్లునిగా భావిస్తారు. అందుకే చెంచులు కుంభోత్సవం తమ ఇంటి పండుగా భావించి, ఆనందోత్సవాలతో ఈ ఉత్సవంలో పాల్గొంటారు. పెద్దసంఖ్యలో గుమ్మడి కాయలు, కొబ్బరి కాయలు, నిమ్మ కాయలు అన్నపు రాశులను శక్తి స్వరూపిణియైన భ్రమరాంబ దేవికి స్వాతికమైన పద్ధతిలో బలిని సమర్పించడమే ఈ ఉత్సవం యొక్క ప్రధాన ఉద్దేశం.

శ్రీశైల క్షేత్రాన్ని దర్శించి ఇక్కడి మఠాలలో ఉన్న సాధకులు, యోగుల వసతి కోసం క్రీస్తుపూర్వం నుంచి అనేక రాజవంశాలు ఎన్నో దానాలను గావించి నట్లు శిలాశాసనాలు, చారిత్రక ఆధారాలు ఉన్నాయి. ఇక్ష్వాకులు, శాతవాహనులు, విష్ణు కుండినులు, పల్లవులు, రాష్ట్ర కూటులు, చాళుక్యులు, కాకతీయులు, రెడ్డిరాజులు, విజయనగర సామ్రాజ్యాధీశులు, భ్రమరాంబికా సమేతులైన మల్లికార్జునుణ్ణి దర్శించి భక్తుల సౌకర్యాలకు ఎన్నో ఏర్పాట్లు, అశేష వస్తు సంపదలు సమర్పించారు.

శ్రీశైలంలో పంచ మఠాలు ప్రాచీన మైనవి. మొదటిదైన ఘంటామఠం - శ్రీశైల ఆలయానికి వాయువ్య దిశగా ఉంది. శివ సాధకుడైన ఘంటాకర్ణ సిద్దేశ్వరుడు తన శిష్యులతో కలిసి దీనిని ఏర్పాటు చేశారు. రెండోదైన విభూతి మఠం, శ్రీకృష్ణ దేవరాయల కాలపు వీరశైవుడైన శాంతి మల్లయ్య అనే వ్యక్తి పేరు మీదుగా ఏర్పడినట్లు పరిశోధనలు వివరిస్తున్నాయి. మూడోదైన రుద్రాక్ష మఠాన్ని మల్లి శంకరస్వామి అనే భక్తుడు నిర్మించాడని తెలుస్తోం ది. ఇక్కడికి



కుళోత్తుంగ చోళుడు ఒక మఠాన్ని క్రీ.శ. 1178-1216 మధ్య కాలంలో ఏర్పాటు చేసినట్టుగా చరిత్ర చెబుతోంది. వటసిద్ధి మఠం, చంద్రమఠం, కమరీ మఠం అనే మఠాలు భక్తులకు అన్నవసతి ఏర్పాటు చేసినట్టుగా తెలుస్తోంది. ఇంకా అనేక మఠాలు పదహారో శతాబ్దికి పూర్వం నుంచే ఇక్కడ ఉన్నాయి.

ఇంతటి ప్రాధాన్యత సంతరించుకున్న శ్రీశైల క్షేత్రంలో ప్రతీ సంవత్సరం చైత్రమాసంలో పౌర్ణమి తరువాత వచ్చే మంగళ లేదా శుక్ర వారాలలో (ఏరోజు ముందుగా వస్తే ఆ రోజు)

అమ్మవారికి కుంభోత్సవం జరుగుతుంటే మరోవైపు స్వామి వారికి అభిషేకాలు, అర్చనలు, సర్వదర్శనం నివేదనలు మొదలైనవన్నీ యథావిధిగా జరుప బడతాయి. ఆరోజు స్వామి వారికి ప్రదోషకాల పూజలయ్యాక, పెరుగు కలిపిన అన్నాభిషేకంతో స్వామి వారి మూల మూర్తిని పూర్తిగా కప్పి వేస్తారు. అనంతరం అమ్మవారికి ఉత్తర పూజలు చేసి 9 రకాల పిండివంటలను నివేదించడంతో ఈ ఉత్సవం ముగుస్తుంది.

**- రామ కిష్టయ్య సంగన భట్ల, సీనియర్ ఇండిపెండెంట్ జర్నలిస్ట్ కాలమిస్ట్...9440595495**

# మహిళలకు చికెన్‌లోని ఈ పార్ట్ ఒక వరం..

సాధారణంగా మనం చికెన్ వండుకునేటప్పుడు ముక్కలకే ఎక్కువ ప్రాధాన్యత ఇస్తాం. కానీ చాలామంది పక్కన పెట్టేసే కోడి కాలేయంలో దాగున్న పోషకాలు తెలిస్తే ఆశ్చర్యపోవాల్సిందే. ముఖ్యంగా మహిళల శరీర తత్వానికి, వారు ఎదుర్కొనే నెలవారీ సమస్యలకు చికెన్ లివర్ ఒక అద్భుతమైన ఔషధంలా పనిచేస్తుందని ఆరోగ్య నిపుణులు చెబుతున్నారు.

**రక్తహీనతకు చెక్:**
మహిళల్లో సర్వసాధారణంగా కనిపించే సమస్య రక్తహీనత. శరీరంలో హిమోగ్లోబిన్ స్థాయిలు తగ్గడం వల్ల నీరసం, ఆయాసం వంటివి వస్తుంటాయి. చికెన్ లివర్‌లో ఐరన్ పుష్కలంగా ఉంటుంది. మొక్కల ద్వారా లభించే ఐరన్



కంటే, లివర్ ద్వారా లభించే ఐరన్‌ను మన శరీరం చాలా వేగంగా గ్రహిస్తుంది. ఇది రక్తంలో హిమోగ్లోబిన్ స్థాయిని పెంచి రక్తహీనత దరిచేరకుండా కాపాడుతుంది.

**పీరియడ్స్ సమయంలో నీరసానికి చెక్:** రుతుస్రావం సమయంలో అధిక రక్తస్రావం కారణంగా చాలామంది మహిళలు తీవ్రమైన అలసట, నీరసానికి గురవుతుంటారు. చికెన్ లివర్‌లో ఉండే విటమిన్ బి12 శరీరానికి తక్షణ శక్తిని ఇస్తుంది. ఇది నాడీ వ్యవస్థ పనితీరును మెరుగుపరచడమే కాకుండా ఆ సమయంలో కలిగే మానసిక కల్లోలాలను తగ్గించడానికి కూడా సహాయపడుతుంది.

**గర్భిణీలకు మేలు:**
గర్భధారణ సమయంలో శిశువు మెదడు, వెన్నెముక అభివృద్ధికి ఫోలేట్ చాలా అవసరం. చికెన్ లివర్‌లో సహజ సిద్ధమైన ఫోలిక్ ఆమ్లం ఉంటుంది. ఇది పుట్టుకతో వచ్చే లోపాల ప్రమాదాన్ని తగ్గిస్తుంది. అయితే గర్భిణీ స్త్రీలు తమ డైట్‌లో మార్పులు చేసుకునే ముందు ఖచ్చితంగా డాక్టర్ సలహా తీసుకోవాలి.

**ఎలా తీసుకోవాలి?:** చికెన్ లివర్‌లో ఐరన్, విటమిన్లతో పాటు జింక్ కూడా ఉంటుంది. ఇది జుట్టురాలడాన్ని తగ్గించి, చర్మాన్ని కాంతివంతంగా ఉంచడంలో తోడ్పడుతుంది. ప్రొటీన్లు కూడా సమృద్ధిగా ఉండటం వల్ల కండరాల పుష్టికి మేలు చేస్తుంది. అయితే దీనిని ఫ్రై చేయడం కంటే తక్కువ నూనెతో కూరలా వండుకుని తింటే అందులోని పోషకాలు పూర్తిగా అందుతాయి. వారానికి ఒకటి లేదా రెండుసార్లు పరిమితంగా తీసుకోవడం వల్ల ఉత్తమ ఫలితాలు ఉంటాయి.

# సోంపు గురించి తెలిస్తే నోరెళ్లబెడతారు..

## అన్నం తిన్న తర్వాత ఎందుకు తినాలంటే..?

**గ్యాస్, ఉబ్బరానికి చెక్:**
భారీ భోజనం చేసినప్పుడు మన జీర్ణవ్యవస్థపై ఒత్తిడి పెరుగుతుంది. ఆ సమయంలో సోంపు గింజలు అద్భుతంగా పనిచేస్తాయి. వైద్య నిపుణుల ప్రకారం.. సోంపులో అనెథోల్, ఫెంచోన్, ఎస్ట్రాగోల్ వంటి ముఖ్యమైన నూనెలు ఉంటాయి. ఇవి కడుపులోని గ్యాస్‌ను బయటకు పంపడంలో కీలక పాత్ర పోషిస్తాయి. ముఖ్యంగా కడుపు ఉబ్బరం, అజీర్ణం, మలబద్ధకం వంటి సమస్యల నుండి ఇవి తక్షణ ఉపశమనం కలిగిస్తాయి.

**సహజమైన మౌత్ ఫ్రెషనర్:**
నోటి శుభ్రత విషయంలో సోంపు గింజలు ఒక సహజ సిద్ధమైన ఔషధం. వీటిని నమలడం వల్ల నోటిలో లాలాజల ఉత్పత్తి పెరుగుతుంది. ఇది నోటిలోని హానికర బ్యాక్టీరియాను తొలగించడమే కాకుండా చిగుళ్ల ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుంది. సోంపులోని సుగంధ తైలాలు మీ శ్వాసను రోజంతా తాజాగా ఉంచుతాయి.



**ప్రేగులకు ఉపశమనం:**
చాలామందికి తిన్న వెంటనే కడుపులో అసౌకర్యంగా లేదా తిమ్మిర్లు వచ్చినట్లు అనిపిస్తుంది. సోంపు గింజలకు యాంటీస్పాస్మోడిక్ గుణాలు ఉన్నాయి. అంటే, ఇవి ప్రేగులలోని కండరాలను సడలించి, ఆహారం సులభంగా ముందుకు కదిలేలా చేస్తాయి. దీనివల్ల జీర్ణరసాల స్రావం పెరిగి, మనం తిన్న ఆహారం త్వరగా విచ్ఛిన్నం అవుతుంది.

**బరువు తగ్గడంలో కూడా సహాయం:**
సోంపు గింజలలో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీవక్రియను వేగవంతం చేయడంలో తోడ్పడుతుంది. భోజనం తర్వాత సోంపు తీసుకోవడం వల్ల అనవసరమైన ఆకలి కలగదు, తద్వారా అతిగా తినడాన్ని నియంత్రించవచ్చు. ఇది పరోక్షంగా బరువు తగ్గాలనుకునే వారికి కూడా మేలు చేస్తుంది.

**డాక్టర్ సలహా ఏంటంటే?:**
ప్రతీరోజూ భోజనం ముగిసిన తర్వాత ఒక టీస్పూన్ సోంపు గింజలను బాగా నమిలి తినాలని నిపుణులు సిఫార్సు చేస్తున్నారు. సోంపును నేరుగా నమలడం శ్రేయస్కరం. కావాలంటే కొంచెం పటిక బెల్లం కలుపుకోవచ్చు, కానీ చక్కెర కోటింగ్ ఉన్న సోంపు కంటే సహజమైన గింజలే ఆరోగ్యానికి మంచివి. ఒకవేళ గింజలు నమలడం ఇష్టం లేని వారు, సోంపును నీటిలో మరిగించి సోంపు టీ లాగా కూడా తీసుకోవచ్చు.

# సీజ్ ఫైర్‌పై ఆశలు.. నష్టాల నుంచి భారీ లాభాల్లోకి సూచీలు


**ముంబయి:**
**దేశీయస్టాక్ మార్కెట్ సూచీలు యూటర్న్ తీసుకున్నాయి. సోమవారం ఉదయం నష్టాల్లో ట్రేడైన సూచీలు.. మధ్యాహ్నం తర్వాత లాభాల్లోకి వచ్చాయి. అమెరికా- ఇరాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరొచ్చన్న అంచనాలు మార్కెట్ రికవరీకి దోహదం చేశాయి. సెన్సెక్స్ కనిష్ఠాల నుంచి 1378 పాయింట్లమేర కోలుకుంది. దీంతో మదుపర్ల సంపదగా భావించే బీఎస్ఈలో నమోదిత కంపెనీల మొత్తం విలువ దాదాపు రూ.5 లక్షల కోట్లు పెరిగి రూ.427 లక్షల కోట్లకు చేరింది.**

సెన్సెక్స్ ఉదయం 73,477.53 (క్రితం ముగింపు 73,319.55) పాయింట్ల వద్ద నష్టాల్లో ప్రారంభమైంది. ఇంట్రాడేలో 72,728.66 పాయింట్ల వద్ద కనిష్ఠాన్ని తాకింది. కాల్పుల విరమణకు సంబంధించిన వార్తలు రావడంతో లాభాల్లోకి వచ్చింది. ఇంట్రాడేలో 74,207.46 పాయింట్ల వద్ద గరిష్ఠాన్ని తాకిన సూచీ.. చివరికి 787.30 పాయింట్ల లాభంతో 74,106.85 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 255.15 పాయింట్ల లాభంతో 22,968.25 వద్ద స్థిరపడింది. డాలరుతో రూపాయి మారకం విలువ 93.05గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ట్రెంట్, యాక్సిస్ బ్యాంక్, టైటాన్, ఎల్అండ్‌టీ, అల్ట్రాటెక్ సిమెంట్ స్టాక్స్ లాభాల్లో ముగిశాయి. రిలయన్స్, హెచ్‌సీఎల్ టెక్నాల జీస్, సన్‌ఫార్మా స్టాక్స్ నష్టపో యాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ బ్యారెల్ ధర 108 డాలర్ల వద్ద



కొనసాగుతుండగా.. బంగారం ఔన్సు 4689 డాలర్ల వద్ద ట్రేడవుతోంది.

**కారణాలు ఇవీ..**
**ఇరాన్-అమెరికా మధ్య శాంతి చర్చలు:**
పాకిస్థాన్ మధ్యవర్తిత్వంతో ఇరాన్, అమెరికా మధ్య కాల్పుల విరమణ కోసం ఒక ఒప్పంద ప్రణాళిక సిద్ధమైన ట్లు వచ్చిన వార్తలు ఇన్వెస్టర్లలో ఉత్సాహాన్ని నింపాయి. హార్ముజ్ జలసంధి ద్వారా వాణిజ్యం మళ్లీ ప్రారంభమయ్యే అవకాశం ఉండటం మార్కెట్‌కు పాజిటివ్‌గా మారింది.
**తగ్గిన క్రూడాయిల్:**
శాంతి చర్చల వార్తలతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు తగ్గుముఖం పట్టాయి. బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 110 డాలర్ల కంటే దిగువకు చేరింది. ఇది మన దేశ ఆర్థిక వ్యవస్థకు, ద్రవ్యోల్బణం నియంత్రణకు ఉపకరిస్తుంది.
**పుంజుకున్న రూపాయి:**
రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చర్యల వల్ల అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ 93.04 స్థాయికి వచ్చింది. కరెన్సీ మార్కెట్‌లో ఒడుదొడుకులు తగ్గడం స్టాక్ మార్కెట్ రికవరీకి దోహదపడింది. దీనికితోడు ఆసియా మార్కెట్లైన జపాన్ నిక్కీ, దక్షిణ కొరియా కోస్పి రాణించడమూ మన మార్కెట్ సూచీలకు కలిసొచ్చింది





# ప్యాకేజీ రూ.80 లక్షలు.. అందులో సగం కిడ్నాపింగ్ ఇన్సూరెన్స్: ప్లేస్‌మెంట్ స్టోరీ వైరల్





సంవత్సరానికి ప్యాకేజీ రూ.80 లక్షలు.. కానీ అందులో రూ.40 లక్షలు కిడ్నాపింగ్ ఇన్సూరెన్స్ అంటూ ఓ పాడ్‌కాస్టర్ చెప్పిన స్టోరీ నెట్టింట్లో వైరల్ అవుతోంది. ఐఐఎం కలకత్తాలో ప్లేస్‌మెంట్ సందర్భంగా వచ్చిన ఆఫర్ గురించి వెల్లడించారు. ఇంతకీ విషయం ఏంటంటే..?

వ్యాపారవేత్త అమన్ ధత్తర్వాల్‌తో పాడ్‌కాస్టర్ కుశాల్ లోధా మాట్లాడుతూ తన దృష్టికి వచ్చిన ఒక చిత్రమైన ప్లేస్‌మెంట్ గురించి వెల్లడించారు. "ఒకసారి ఐఐఎం కలకత్తాలో నిర్వహించిన ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లో ఒక ఆఫ్రికా కంపెనీ కూడా భాగమైంది. అది రూ.80 లక్షలు ప్యాకేజీ ఆఫర్ చేసింది. పేపర్‌లో ఆ లెక్కలు ఆకట్టుకునేలా ఉన్నాయి. అయితే అందులో సగం కిడ్నాపింగ్ ఇన్సూరెన్స్ కోసం కేటాయించింది. ఆ లెక్కన చూసుకుంటే సదరు ఉద్యోగికి వచ్చేది రూ.40 లక్షలే. ఆఫ్రికాలో ఆ కంపెనీ సమీప ప్రాంతాల్లో కిడ్నాప్‌లు తరచూ జరుగుతుంటాయట. ఒకవేళ ఆ ఉద్యోగిని అపహరిస్తే.. కిడ్నాపర్లకు ఆ ఇన్సూరెన్స్ మొత్తం ఇచ్చి విడిపించుకు వస్తారు" అంటూ లోధా చెప్పిన మాటలు నెట్టింట్లో వైరల్ అవుతున్నాయి. దీనిపై నెటిజన్లు భిన్నాభిప్రాయాలు వ్యక్తంచేశారు.

**తమ ఉద్యోగాలను కాపాడుకోవడానికి.. సహోద్యోగులకు ఎసరు:**

కొత్త ఏఐ ట్రెండ్..! ఒకవేళ కిడ్నాపర్లు రూ.41 లక్షలు డిమాండ్ చేస్తే.. ఆ ఉద్యోగి వచ్చే ఏడాది క్లెయిమ్ చేసుకోవాలా..? అని ఓ నెటిజన్ ప్రశ్నించారు. ఆ డబ్బుల కోసం ప్రతిఏడాది ఉద్యోగి స్నేహితులే కిడ్నాప్‌లు ప్లాన్ చేయొచ్చుగా అంటూ మరొకరు ఫన్నీగా కామెంట్ పెట్టారు. కొందరు ఆ కంపెనీ పేరు కూడా షేర్ చేశారు.


## ప్రతిరోజూ రూ.166 డిపాజిట్ చేస్తే చాలు

# రూ.20 లక్షలు మీ సొంతం.. !

దేశంలోనే అతిపెద్ద ప్రభుత్వ బీమా సంస్థ అయిన రా×జ అనేక అద్భుతమైన పథకాలను అందిస్తోంది. ఇవి మీ డబ్బుకు పూర్తి భద్రతను, బలమైన రాబడులను అందిస్తాయి.

ఈ రోజు అటువంటి ఒక ఎల్ఐసీ పాలసీ గురించి తెలుసుకుందాం. దీనిలో మీరు ప్రతిరోజూ కేవలం రూ.166 జమ చేయడం ద్వారా 20 లక్షల రూపాయల కార్పస్‌ను నిర్మించుకోవచ్చు. ఈ పాలసీ ఏమిటో? మీరు 20 లక్షల రూపాయల కార్పస్‌ను ఎలా నిర్మించుకోగలరో తెలుసుకుందాం.

ఈ ఎల్ఐసీ పాలసీని జీవన్ లాభ్ స్కీమ్ అని పిలుస్తారు. ఇది అత్యంత ప్రజాదరణ పొందిన పాలసీలలో ఒకటి. ఇది మీ పెట్టుబడిపై పన్ను ప్రయోజనాలను అందించడమే కాకుండా, ఇది ప్రభుత్వ నిధులతో నడిచేది కాబట్టి, మీ డబ్బును కోల్పోయే ప్రమాదం కూడా చాలా తక్కువ. అందుకే దీని వివరాలను తెలుసుకుందాం..






మీరు ఎన్ని సంవత్సరాల పాటు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది?: ఒక వ్యక్తికి 30 సంవత్సరాల వయస్సు ఉందని, అతను 25 సంవత్సరాల కాలానికి ఈ పాలసీని కొనుగోలు చేశాడని అనుకుందాం. ఈ సందర్భంలో వారు కేవలం 16 సంవత్సరాలు మాత్రమే ప్రీమియంలు చెల్లించాల్సి ఉంటుంది. ఈ పాలసీ ప్రకారం, వారి హామీ మొత్తం రూ.10 లక్షలు ఉంటుంది. ఈ పాలసీకి వార్షిక ప్రీమియం సుమారుగా రూ.60,000 నుండి రూ.65,000 వరకు ఉంటుంది. దీనిని నెలవారీగా లెక్కిస్తే అది దాదాపు రూ.5,000 నుండి రూ.5,500 వరకు వస్తుంది. రోజువారీగా లెక్కిస్తే, ఈ మొత్తం సుమారుగా రూ.166 అవుతుంది.

మొత్తంగా ఎంత డబ్బు జమ చేయాల్సి ఉంటుంది?: మీరు డిపాజిట్ చేయవలసిన మొత్తం గురించి చర్చిద్దాం. మీరు సంవత్సరానికి రూ.5,000 ప్రీమియం చెల్లిస్తే, మొత్తం 16 సంవత్సరాల పాలసీ కాలంలో మీరు సుమారుగా రూ.9.6 లక్షలు డిపాజిట్ చేసి ఉంటారు.

20 లక్షల రూపాయలు ఎలా పొందాలి?: మీరు రూ.9.6 లక్షలు డిపాజిట్ చేస్తే మీకు రూ.20 లక్షలు ఎలా వస్తాయని ఇప్పుడు మీరు ఆశ్చర్యపోవచ్చు. ఈ ప్లాన్‌లో హామీ ఇచ్చిన మొత్తం రూ.10 లక్షలు. కంపెనీ రూ.8 నుండి రూ.10 లక్షల వరకు బోనస్‌ను కూడా అందిస్తుంది. అందుకే హామీ ఇచ్చిన రూ.10 లక్షల మొత్తాన్ని, రూ.10 లక్షల బోనస్‌ను కలిపితే మెచ్యూరిటీ సమయంలో మీకు సుమారుగా రూ.20 లక్షలు అందుతాయి.

క్రైమ్ న్యూస్
తెలుగు దిన పత్రిక






## పెద్ది డిజిటల్ హక్కుల కోసం నెట్‌ఫ్లిక్స్ పోటీ

మెగా పవర్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సన కాంబినేషన్‌లో తెరకెక్కుతున్న 'పెద్ది' చిత్రం రిలీజ్‌కు ముందే టాలీవుడ్‌లో సంచలనాలు సృష్టిస్తుంది. రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా రూపొందుతున్న ఈ సినిమాపై మొదటి నుంచే భారీ అంచనాలు ఉన్నాయి. తాజాగా ఈ అంచనాలను మరింత పెంచేలా ఓటీటీ హక్కుల విషయంలో భారీ డీల్ కుదిరినట్లు సమాచారం. ప్రముఖ ఓటీటీ సంస్థ నెట్‌ఫ్లిక్స్ 'పెద్ది' డిజిటల్ స్ట్రీమింగ్ హక్కుల కోసం ఏకంగా రూ.130 కోట్ల ఆఫర్ ఇచ్చినట్లు టాలీవుడ్ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. తెలుగుతో పాటు ఇతర భాషల హక్కులు కలిపి ఈ డీల్ కుదిరిందని చెబుతున్నారు. ఒక తెలుగు సినిమా కేవలం ఓటీటీ రైట్స్ ద్వారానే ఇంత భారీ మొత్తాన్ని రాబట్టడం ఇండస్ట్రీలో చర్చనీయాంశంగా మారింది. ఇంకా ఆసక్తికర విషయం ఏమిటంటే, సినిమా థియేటర్లలో సాధించే విజయాన్ని బట్టి అదనంగా రూ.20 కోట్ల బోనస్ ఇవ్వాలని కూడా నెట్‌ఫ్లిక్స్ ప్రతిపాదించిందట. అంటే 'పెద్ది' బాక్సాఫీస్ వద్ద సూపర్ హిట్‌గా నిలిస్తే, మొత్తం డిజిటల్ డీల్ విలువ రూ.150 కోట్లకు చేరుకునే అవకాశం ఉంది. ఇది రామ్ చరణ్‌కు ఉన్న గ్లోబల్ మార్కెట్ క్రేజ్‌ను మరోసారి నిరూపిస్తోందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. ఈ చిత్రంలో బాలీవుడ్ నటి జాన్వీ కపూర్ హీరోయిన్‌గా నటిస్తుండగా, సంగీతాన్ని ఆస్కార్ విజేత ఏఆర్ రెహమాన్ అందిస్తున్నారు. ఈ కాంబినేషన్ సినిమాపై అంచనాలను మరింతగా పెంచింది. ఇప్పటికే విడుదలైన గ్లింప్స్ ప్రేక్షకులను ఆకట్టుకుని, సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ పీరియడ్ స్పోర్ట్స్ డ్రామాలో రామ్ చరణ్ 'పెద్ది పహిల్వాన్'గా, అలాగే క్రికెటర్‌గా రెండు భిన్నమైన షేడ్స్‌లో కనిపించబోతున్నాడు. నటన, బాడీ లాంగ్వేజ్ పరంగా ఇది ఆయన కెరీర్‌లో మరో కొత్త ఛాలెంజ్‌గా భావిస్తున్నారు అభిమానులు. ఈ చిత్రం ఏప్రిల్ 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుండగా, థియేటర్లలో విడుదలైన నాలుగు వారాల తర్వాత ఓటీటీలో స్ట్రీమింగ్‌కు వచ్చే అవకాశం ఉంది. మొత్తంగా, రిలీజ్‌కు ముందే భారీ డీల్‌తో 'పెద్ది' సినిమా ట్రేడ్ వర్గాల్లోనే కాకుండా అభిమానుల్లోనూ భారీ హైప్ క్రియేట్ చేస్తోంది.


## రాకాసకు మంచి ఓపెనింగ్స్

మెగా డాటర్ నిహారిక కొణిదెల నిర్మాతగా వరుస విజయాలతో దూసుకుపోతున్నారు. తాజాగా ఆమె నిర్మించిన 'రాకాస' సినిమా విడుదలైన తొలి రోజునుంచే సూపర్ హిట్ టాక్ తెచ్చుకుని బాక్సాఫీస్ వద్ద భారీ వసూళ్లు సాధిస్తోంది. 'రాకాస' చిత్రాన్ని ఓటీటీ సిరీస్‌లతో గుర్తింపు తెచ్చుకున్న మానస శర్మ తెరకెక్కించారు. ఈ సినిమాలో సంగీత్ శోభన్ హీరోగా నటించగా, నయన్ సారిక హీరోయిన్‌గా మెప్పించారు. హారర్, కామెడీ, ఫాంటసీ మేళవింపుతో రూపొందిన ఈ చిత్రంలో వెన్నెల కిషోర్, బ్రహ్మాజీ, గెటప్ శ్రీను, తనికెళ్ల భరణి, ఆశిష్ విద్యార్థి కీలక పాత్రల్లో నటించారు. ఏప్రిల్ 3న గ్రాండ్‌గా విడుదలైన 'రాకాస' సినిమా, గ్లింప్స్, టీజర్, ట్రైలర్‌తో ముందుగానే మంచి అంచనాలు ఏర్పరచుకుంది. విడుదలైన తర్వాత ఆ అంచనాలను మించి ప్రేక్షకులను అలరించడంతో తెలుగు రాష్ట్రాల్లోనే కాకుండా ఓవర్సీస్‌లో కూడా మంచి రెస్పాన్స్ వస్తోంది.ట్రేడ్ వర్గాల సమాచారం ప్రకారం, 'రాకాస' సినిమా కేవలం రెండు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ.10.30 కోట్ల గ్రాస్ కలెక్షన్స్ సాధించింది. శుక్ర, శనివారాల్లో వచ్చిన రెస్పాన్స్ ఆదివారం మరింత పెరగడంతో వసూళ్లు వేగంగా పెరుగుతున్నాయి. ఈ సినిమాపై ఉన్న క్రేజ్‌కు నిదర్శనంగా, విడుదలైన తొలి 24 గంటల్లోనే 60 వేలకుపైగా టికెట్స్ అమ్ముడవడం విశేషం. డిఫరెంట్ ప్రమోషనల్ స్ట్రాటజీ కూడా సినిమాకు ప్లస్ అయిందని ట్రేడ్ సర్కిల్స్ అభిప్రాయపడుతున్నాయి. ఇప్పటికే నిర్మాతగా 'కమిటీ కుర్రోళ్లు' సినిమాతో బ్లాక్‌బస్టర్ అందుకున్న నిహారిక, 'రాకాస'తో మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నట్లు కనిపిస్తోంది. జీ స్టూడియోస్ సమర్పణలో ఉమేష్ కుమార్ బన్సాల్‌తో కలిసి ఈ చిత్రాన్ని నిర్మించిన తీరు ప్రశంసలు అందుకుంటోంది. సంగీత్ శోభన్ కామెడీ టైమింగ్, నయన్ సారిక గ్లామర్, సపోర్టింగ్ క్యాస్ట్ ఎంటర్‌టైన్‌మెంట్ అన్నీ కలిసి సినిమాకు మంచి ప్లస్ అయ్యాయి. ముఖ్యంగా హారర్ కామెడీ జానర్‌ను కొత్తగా ప్రెజెంట్ చేయడంపై ప్రేక్షకులు ప్రశంసలు కురిపిస్తున్నారు.




## లవ్ ఇన్సూరెన్స్ కంపెనీకి ఓటిటి పోటీ

లవ్‌టుడే, డ్రాగన్ , డ్యూడ్ సినిమాలతో సూపర్ హిట్స్‌ను ఖాతాలో వేసుకున్నాడు తమిళ యాక్టర్ ప్రదీప్ రంగనాథన్. ఈ మల్టీ టాలెంటెడ్ యాక్టర్ తాజాగా విఘ్నేశ్ శివన్ దర్శకత్వంలో లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ చిత్రంలో నటిస్తున్నాడు. కృతి శెట్టి హీరోయిన్‌గా నటిస్తోంది. ఈ మూవీ ఏప్రిల్ 10న గ్రాండ్‌గా విడుదల కానుంది. థియాట్రికల్ రిలీజ్‌కు ముందే ఈ మూవీకి డిజిటల్ ప్లాట్‌ఫాంలో కూడా మంచి డిమాండ్ ఏర్పడింది. పాపులర్ ఓటీటీ ప్లాట్‌ఫాం అమెజాన్ ప్రైం వీడియోతో లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ ఓటీటీ డీల్ కుదిరినట్టు ఫిలింనగర్ సర్కిల్ సమాచారం. నాలుగు వారాల థియాట్రికల్ రన్ తర్వాత మిడ్ మేలో ఈ మూవీ ఓటీటీ డెబ్యూ ఇవ్వనుందని ఇన్‌సైడ్ టాక్. ఇప్పటికే రిలీజ్ చేసిన ట్రైలర్‌లో ప్రపంచం ఎక్కడికో వెళ్లిపోయింది.. మనమిప్పుడు 2040లో ఉన్నాం. కానీ ఒకడు లేని ఒక విషయాన్ని ఉందనే అంటున్నాడు.. ఉందండి.. ఈ లవ్ ఎట్ ఫస్ట్‌సైట్ ఇంకా ఉందండి. అది ఈ అమ్మాయిని చూడగానే అర్థమైంది. తల నుంచి కాలి వేలి వరకు ఒక ఫీలింగ్ వచ్చింది మామ.. అంటూ సాగుతున్న డైలాగ్స్ యూత్ ఫుల్ స్టోరీతో ఇంట్రెస్టింగ్ ఎలిమెంట్స్‌తో సినిమా ఉండబోతున్నట్టు చెబుతున్నాయి. తమిళంతో పాటు తెలుగు, కన్నడ, మలయాళ భాషల్లోనూ ఈ చిత్రం విడుదల కానుందని ఇప్పటికే మేకర్స్ తెలిపారు. ఈ మూవీని రౌడీ పిక్చర్స్, సెవెన్ స్క్రీన్ స్టూడియో బ్యానర్లపై ఎస్ ఎస్ లలిత్ కుమార్‌తో కలిసి నయనతార తెరకెక్కిస్తోంది. ఈ చిత్రంలో ఎస్‌జే సూర్య, యోగి బాబు, సీమాన్, గౌరీ కిషన్, షారా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. భవిష్యత్‌లో(2040) ప్రేమ ఎలా ఉండబోతుంది అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా రాబోతుందని టీజర్‌లో హింట్ ఇచ్చింది విఘ్నేశ్ శివన్ టీం.




## వారాణాసిలో మరో బాలీవుడ్ నటి ?

మహేష్ బాబు హీరోగా రూ. 1300 కోట్ల భారీ బ్జడెట్‌తో తెరకెక్కుతున్న అడ్వెంచర్ ఎపిక్ 'వారణాసి'. ఈ చిత్రాన్ని రాజమౌళి అత్యంత ప్రతిష్టాత్మకంగా ఐమ్యాక్స్ ఫార్మాట్‌లో చిత్రీకరిస్తున్నారు. ఎం.ఎం. కీరవాణి సంగీతం అందిస్తున్న ఈ సినిమాలో పృథ్వీరాజ్ సుకుమారన్ విలన్‌గా నటిస్తుండగా, ఆర్. మాధవన్ కూడా ఒక కీలక పాత్రలో కనిపించబోతున్నారు. ఇక ఈ మూవీ పై రోజుకో ఆసక్తికర వార్త బయటకు వస్తోంది. ప్రస్తుతం హైదరాబాద్‌లోని రామోజీ ఫిలిం సిటీలో వేసిన భారీ వారణాసి సెట్‌లో మహేష్ బాబు (రుద్ర), ప్రియాంక చోప్రా (మందాకిని)లపై కీలక సన్నివేశాలను రాజమౌళి చిత్రీకరిస్తున్నారు. ఈ షెడ్యూల్ ముగియగానే ఒక గ్రాండ్ సాంగ్ షూటింగ్ జరగనుందని, అందులో మహేష్ బాబు సరసన నటించేందుకు మరో బాలీవుడ్ స్టార్ హీరోయిన్‌ను చిత్రబృందం సంప్రదించినట్లు వార్తలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే ప్రియాంక చోప్రా తన పాత్ర కోసం ఒక అదిరిపోయే డ్యాన్స్ నెంబర్ ఉండాలని కోరగా, ఈ స్పెషల్ సాంగ్ సినిమాకే హైలైట్‌గా నిలుస్తుందని సమాచారం. ఇక హాలీవుడ్ స్థాయి విజువల్స్ కోసం అంటార్కిటికా వంటి లొకేషన్లలో కూడా షూటింగ్ జరిపిన జక్కన్న, ఈ స్పెషల్ సాంగ్‌ను విజువల్ వండర్‌గా తీర్చిదిద్దబోతున్నారట. ఏప్రిల్ 7, 2027న ఉగాది కానుకగా విడుదల కాబోతున్న ఈ చిత్రం, భారతీయ సినిమా చరిత్రలో సరికొత్త రికార్డులను సృష్టించడం ఖాయమని ట్రేడ్ వర్గాలు విశ్లేషిస్తున్నాయి.




## గాయపడ్డ సింహం.. ఓ మంచి పాత్రలో కనిపిస్తా

## నటుడు జెడి చక్రవర్తి

కమల్ హాసన్ చేసినన్ని పాత్రలు సినీ చరిత్రలోనే ఎవరూ చేసి ఉండరని నటుడు జేడీ చక్రవర్తి అన్నారు. తరుణ్ భాస్కర్ ప్రధాన పాత్రలో కశ్యప్ శ్రీనివాస్ దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'గాయపడ్డ సింహం' మే 1న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో జేడీ చక్రవర్తి కీలకపాత్రలో నటించారు. ఈ సినిమా ప్రెస్‌మీట్‌లో ఆయన మాట్లాడుతూ తన పాత్ర గురించి చెప్పారు. 'నటులందరికీ కమల్ హాసన్ నటనే ఒక బెంచ్‌మార్క్. ఆయన చేసినన్ని పాత్రలు ప్రపంచ సినీ చరిత్రలో ఎవరూ ఇప్పటివరకూ చేయలేదు. ఇకపై కూడా ఆయన్ని బీట్ చేయడం కష్టమే. ఒక నటుడిగా నేను ఆయనకు ఏ విషయంలోనూ సరితూగను. ఆయనకు రాని అదృష్టం నాకు ఈ సినిమా రూపంలో దక్కింది. ఇందులో నాది అంత గొప్ప పాత్ర. చాలా వేరియేషన్స్ ఉంటాయి. ఇప్పటివరకూ కమల్ హాసన్ కూడా చేయని పాత్ర ఇది. కెరీర్‌లో చాలామందికి జయాపజయాలు ఉండొచ్చు. కానీ, ప్రతిఒక్కరికీ కెరీర్‌లో గుర్తుండిపోయే పాత్ర ఒకటి ఉంటుంది. నాకు 'మనీ', 'అనగనగా ఒక రోజు' చిత్రాలు ఎప్పటికీ ప్రత్యేకమే. మళ్లీ చాలా ఏళ్ల తర్వాత ఆ సినిమాల్లో పోషించిన లాంటి పాత్ర వచ్చింది' అని జేడీ చక్రవర్తి చెప్పారు. 'గాయపడ్డ సింహం'లో ఎంతోమంది దర్శకులు నటించారని ఇది దర్శకుల చిత్రమని ఆయన అన్నారు.



## లవ్ ఇన్సూరెన్స్ ప్రేక్షకులకు నచ్చుతుంది: దిల్ రాజు

'లవ్ ఇన్సూరెన్స్ కంపెనీ' అంటూ ప్రేక్షకులను కొత్త కాన్సెప్ట్ మూవీతో అలరించేందుకు సిద్ధమయ్యారు ప్రదీప్ రంగనాథన్, కృతిశెట్టి. వీరిద్దరూ జంటగా నటించిన ఈ చిత్రాన్ని విఘ్నేశ్ శివన్ తెరకెక్కించారు. నయనతార, ఎస్ఎస్ లలిత్ కుమార్ నిర్మించారు. ఈనెల 10న రానుంది. ఈ నేపథ్యంలో తాజాగా ప్రీరిలీజ్ ఈవెంట్‌ను నిర్వహించారు. ఈ వేడుకకు దిల్ రాజు, అనిల్ రావిపూడి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ.. ప్రదీప్ రంగనాథన్ నటించిన 'లవ్ టుడే' ప్రేక్షకులకు నచ్చుతుందని ముందే ఊహించినట్లు తెలిపారు. అందుకే తెలుగులో డబ్ చేయించినట్లు చెప్పారు.



## త్రిష సైలెంట్ రియాక్షన్ వైరల్ ..

రాజకీయ వివాదాల మధ్య లవ్ కోట్స్‌తో సందేశం సీనియర్ హీరోయిన్ త్రిష కృష్ణన్ గత కొంతకాలంగా సినిమాల కంటే వ్యక్తిగత విషయాలతోనే ఎక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. ముఖ్యంగా తమిళనాడులో ఎన్నికల వాతావరణం వేడెక్కుతున్న వేళ, ఆమె పేరు అనుకోకుండా రాజకీయ చర్చల్లోనూ వినిపిస్తోంది. విజయ్ రాజకీయ ప్రవేశం తర్వాత, అతడిని లక్ష్యంగా చేసుకుని చేస్తున్న విమర్శల్లో త్రిష పేరు కూడా లాగడం కూడా చర్చనీయాంశంగా మారింది. ఇలాంటి పరిణామాల మధ్య కొద్ది రోజులుగా సైలెంట్‌గా ఉన్న త్రిష, తాజాగా తన ఇన్‌స్టాగ్రామ్‌లో కొన్ని భావోద్వేగపూరిత వీడియోలు, కోట్స్ షేర్ చేశారు. ఒక వీడియోలో ఇతరుల అభిప్రాయాలను మనం నియంత్రించలేం... మనం చేయగలిగింది మన జీవితాన్ని నిజాయితీగా, మంచిగా గడపడం మాత్రమే అనే సందేశాన్ని పంచుకున్నారు. ఇంకో వీడియోలో "సరిగ్గా ఉండటం కంటే శాంతి ముఖ్యమైనది... ప్రతీ వాదనకు స్పందించడం అవసరం లేదు... మౌనం చాలా సందర్భాల్లో ఉత్తమ సమాధానం" అనే భావనను వ్యక్తపరిచారు. ఈ పోస్టులు చూస్తుంటే, ప్రస్తుత పరిస్థితులపై ఆమె పరోక్షంగా స్పందిస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే "ప్రేమే సర్వస్వం కాదు... కానీ ప్రేమ లేకపోతే దేనికీ అర్థం లేదు" అనే కోట్‌ను షేర్ చేస్తూ 'నిజం' అని క్యాప్షన్ ఇచ్చారు. దీంతో ఆమె పోస్టులు సోషల్ మీడియాలో వైరల్ అవుతూ, నెటిజన్లలో చర్చకు దారితీశాయి. తమిళనాడులో రాజకీయ వాతావరణం కాస్త వేడెక్కుతున్న వేళ, విజయ్ పై విమర్శల నేపథ్యంలో త్రిష పేరును కూడా కొన్ని వర్గాలు లాగడం హాట్ టాపిక్‌గా మారింది.ఇటీవల విజయ్ వ్యక్తిగత జీవితంపై వచ్చిన ఆరోపణల్లో కూడా ఓ సినీ నటితో సంబంధం ఉందని వార్తలు రావడం, అదే సమయంలో విజయ్--త్రిష కలిసి ఓ రిసెప్షన్‌కు హాజరుకావడం మరింత చర్చకు దారితీసింది. ఇక పార్థిబన్ వంటి సినీ, రాజకీయ ప్రముఖులు కూడా ఈ వ్యవహారంపై స్పందించడం గమనార్హం. ఈ నేపథ్యంలో త్రిష పెట్టిన సోషల్ మీడియా పోస్టులు మరింత ప్రాధాన్యం సంతరించుకున్నాయి. రెండు దశాబ్దాలకు పైగా హీరోయిన్‌గా రాణిస్తున్న త్రిష, 40 ఏళ్లు దాటినా ఇంకా పెళ్లి చేసుకోలేదు. గతంలో ఆమె ఎంగేజ్‌మెంట్ జరిగినప్పటికీ, అది రద్దు అయిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ఆమె వ్యక్తిగత జీవితం ఎప్పటికప్పుడు వార్తల్లో నిలుస్తూనే ఉంది. వివాదాలు పక్కన పెడితే, త్రిష సినిమాల పరంగా మాత్రం బిజీగా ఉన్నారు. ప్రస్తుతం సూర్య సరసన 'కరుప్పు' సినిమాలో నటిస్తున్నారు. ఈ చిత్రం మే 14న విడుదల కానుంది. అలాగే చిరంజీవి తో కలిసి 'విశ్వంభర' అనే సోషియో ఫాంటసీ మూవీలో నటిస్తున్నారు. ఈ సినిమా పోస్ట్ ప్రొడక్షన్ దశలో ఉండి, త్వరలోనే విడుదలకు సిద్ధమవుతోంది.

Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com